# ముందుమాట

**భా**రత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) పార్టీ ఎడ్యుకేషన్ సబ్ కమిటీ ఆగస్టు 2023లో పట్టణ ప్రాంతాలలో పనిచేస్తున్న కార్యకర్తలకు కేంద్రంలో క్లాస్ కమ్ వర్క్‌షాప్‌ను నిర్వహించింది. ఆ క్లాసులలో ఇచ్చిన నోట్స్‌ను క్లాసులలో జరిగిన చర్చల అనంతరం విద్యార్థుల నుండి కొన్ని అభిప్రాయాలు, సవరణలు వచ్చాయి. వాటిని అవసరమైన మేరకు తీసుకుని మార్పు చేర్పులతో ఫైనలైజ్ చేసి ఈ నోట్స్‌ని ముద్రిస్తున్నాము. ఈ నోటీసులో మొత్తం 4 అంశాలు తీసుకోబడ్డాయి. (i) భారతదేశంలో పట్టణీకరణ చరిత్ర (ii) పట్టణ ప్రాంతాల్లో విధానాలు, సమస్యలు (iii) పట్టణ ప్రాంతాల్లో పనిపై పార్టీ దృక్పథం, మరియు (iv) పట్టణాల్లో పని గురించి కొన్ని కోణాలు.

పట్టణ ప్రాంతాల్లో పనిచేసే కార్యకర్తలకు ఈ నోట్స్ ఉపయోగకరంగా ఉంటుందని, తద్వారా పార్టీ బలోపేతానికి కూడా తోడ్పడుతుందని ఆశిస్తున్నాము.

**పార్టీ ఎడ్యుకేషన్ సబ్-కమిటీ**

**కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్)**

**సెప్టెంబర్ 2023.**

# భారతదేశంలో పట్టణీకరణ చరిత్ర

## ముందుమాట

**ఈ** శతాబ్దం భారతదేశం యొక్క పట్టణ శతాబ్దంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే ఇక్కడ జనాభాలో అత్యధిక శాతం పట్టణాలలో నివాసముంటున్నారు. 1901 జనాభా లెక్కల ప్రకారం, పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న 26 మిలియన్లమంది జనాభాలో 11 శాతంగా ఉన్నారు. 2023 నాటికి దాదాపు 510 మిలియన్లకు చేరుకున్నారు. ఇది మొత్తం జనాభాలో దాదాపు 36 శాతం.

1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పట్టణాలు, నగరాలకు వలసలు వేగవంతమయ్యాయి. సగటు శాతం పెరుగుతూనే ఉంది. 2047 నాటికి భారతదేశంలో 50 శాతం మంది పట్టణ ప్రాంతాల్లో నివసిస్తారని అంచనా. భారతదేశంలోని ప్రస్తుత పట్టణ జనాభా అమెరికా సంయుక్త రాష్ట్రాల జనాభా కన్నా ఎక్కువ. ప్రస్తుత సామాజిక–ఆర్థిక అభివృద్ధి ప్రక్రియతో 21వ శతాబ్దపు పట్టణాలు, నగరాలు మిలియన్ల మంది భారతీయుల జీవన పర్యావరణంపై ప్రభావం చూపించబోతున్నాయి.

భారతీయ నగరాలను వాటి స్వంత సంక్లిష్టమైన, సమ్మిళిత గతం నుండి చూడాలి తప్ప అభివృద్ధి చెందిన ప్రపంచ దేశాల ద్వారా చేయబడ్డ సూత్రీకరణలు, కొలమానాల ప్రకారం కాదు.

ప్రస్తుత భారతీయ నగరాల పరిస్థితి గత కొన్ని దశాబ్దాలతో పోలిస్తే చాలా క్లిష్టంగా ఉంది. నగరంలో అధికారిక, అనధికారిక పద్ధతుల పరస్పర కొత్త తరగతులు (intersection), అవి ఆయా ప్రాంతాల ప్రాదేశిక వ్యక్తీకరణలుగా ఉన్నాయి.

భారతీయ నగరం కేవలం పరిమాణంలో పెద్దది మాత్రమే కాదు, మూడు దశాబ్దాల ఆర్థిక సరళీకరణ, ప్రపంచీకరణ యొక్క వాస్తవిక చిత్రం భూ వినియోగంలోనే

కాకుండా ప్రపంచ పెట్టుబడిదారీ విధానంతో ముడిపడి ఉన్న భవన నిర్మాణ పద్ధతుల్లో కూడా విశేషమైన మార్పులు మనం చూడవచ్చు.

భారతదేశంలోని పట్టణ వాతావరణం భూమి, సముద్ర మార్గాల ద్వారా ఎన్నో శతాబ్దాల క్రితం భారతదేశంలోకి ప్రవేశించిన విభిన్న సంస్కృతులు, సంబంధాల ప్రభావంతో సమ్మిళితమైన ఒక హైబ్రిడ్ విధానానికి నాంది పలికింది.

ఉపఖండ పట్టణవిధానం పైన మూడు విస్తృత కాలాలు తమ ప్రభావాన్ని (ముద్రని) వేసాయి. అవి : వలస పూర్వపు కాలం, వలస కాలం, వలసానంతర కాలం.

## వలస - పూర్వ కాలం

## ప్రారంభ పట్టణ స్థావరాలు - కాంస్య యుగంలో పట్టణాలు

సింధు లోయలోని మొహంజొదారో, పంజాబ్‌లోని హరప్పా భారతదేశంలోని మొట్టమొదటి నగరాలు. ఇవి ప్రపంచంలోనే అత్యంత ప్రాచీనమైనవి. అవి 200,100 హెక్టార్ల విస్తీర్ణంలో ఉండేవని అంచనా. వారి జనాభా సుమారు 85,000, 65,000 ఉండవచ్చు. ఈ నగరాలు పెద్ద ప్లాట్‌ఫారమ్ పైన అక్రోపోలిస్ లేదా కోట ఆకృతిలో నిర్మించబడ్డాయి.

పట్టణాల నిర్మాణానికి ముందుగానే రోడ్లను జాగ్రత్తగా ప్రణాళిక ప్రకారం గుర్తించారు. ఫలితంగా పొడవైన, విశాలమైన వీధులు లంబ కోణంలో కలుస్తాయి. గృహాలు దీర్ఘచతురస్రాకారంగా, పరిమాణంలో వైవిధ్యంగా ఉండేవి. బహుశా యజమాని కుటుంబం, బానిసలు, సేవకులు ఇలా అందరూ వాడుకునేందుకు వీలుగా బావులు, వంట చేసే ప్రదేశాలు వంటి సౌకర్యాలతో ఈ నగరాలు ఉండేవి. నగరాలు సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థను కూడా కలిగి ఉండేవి. ఎలాగంటే ఇంటిలో ఉపయోగించిన నీరు సెస్–గుంటలలోకి మళ్ళించబడి, దాని నుండి రోడ్డు పక్కన ఉన్న కాలువలలోకి ప్రవేశించి, చివరికి నగరంలోని ఇంకుడు గుంటలలోకి చేరేది.

స్నానాల కోసం కాల్చిన ఇటుకలతో ఒక దీర్ఘచతురస్రాకార ట్యాంక్ తయారు చేయబడింది. పెద్ద ఇటుకలతో నిర్మించిన వేదికలు ధాన్యాగారం అయి

ఉండాలి. అలాగే స్తంభాల హాలు  బహుశా సమావేశాలు లేదా శుభ కార్యాలకు ఉపయోగించి ఉండవచ్చు.

పట్టణం దిగువ ప్రాంతాన ఒక ప్రముఖ రాజమందిరం, ఆలయంగా భావించబడే కొన్ని ఆనవాళ్లు, కొన్ని నివాస భవంతులు ఉన్నాయి.

ఈ ప్రాంత పాలకులు భద్రత రీత్యా అలాగే తమకు అవసరమైన ఆయుధాలు, దుస్తులు, పాత్రలు, విలాస వస్తువులు మొదలైన సామగ్రిని సంబంధిత తయారీదారుల (చేతివృత్తుల వారు) నుండి పొందటానికి పట్టణాలలో లేదా వాటికి దగ్గరలోని భవన సముదాయాలు, కోటలలో నివసించడం సౌకర్యంగా ఉంటుందని భావించి ఉండవచ్చు.

పట్టణ నిర్వహణ కోసం రాష్ట్ర యంత్రాంగం ఉనికిలోకి వచ్చింది. కానీ పట్టణానికి అవసరమైన జీవనాడి అనగా, గ్రామీణ ప్రాంతాల నుండి మిగులులో కొంత భాగాన్ని ప్రభుత్వం ఆహార ధాన్యాలు, ముడిపదార్థాలను కానుకలు లేదా పన్నుల రూపంలో స్వాధీనం చేసుకునేది.  వాటిని భద్రపరచడానికి కూడా ప్రభుత్వ యంత్రాంగం అవసరం.

రాళ్లను మాత్రమే ఉపయోగించగలిగే గ్రామస్థులను తమ ఆధీనంలో ఉంచుకోవడం కోసం నగర పాలకులకు కాంస్య ఆయుధాలు మరింత బలాన్నిచ్చాయి. గ్రామస్తులు పాలకులకు కానుకలు లేదా పన్ను చెల్లించవలసి రావటంతో, వారు తమ అధికారులు, ఉద్యోగులు, సేవకులకు ధాన్యం, ఇతర ఉత్పత్తులను పంపిణీ చేసేవారు. పాలకులు, వారిపై ఆధారపడినవారు వారి ఉత్పత్తులు, సేవలను కొనుగోలు చేయడం ద్వారా గ్రామీణ మిగులులో కొంత భాగం పట్టణ వ్యాపారులు, కార్మికులు, చేతివృత్తుల వారికి చేరుతుంది.

## ఇనుప యుగం పట్టణీకరణ

పట్టణీకరణ యొక్క తరువాతి దశ వెయ్యి సంవత్సరాల తర్వాత సుమారు క్రీ.పూ. 500 నుండి ప్రారంభమై దాదాపు 300ఎడి వరకు గంగా పరీవాహక ప్రాంతంలో కొనసాగింది. దీనిని ఇనుప యుగం పట్టణీకరణగా పేర్కొనవచ్చు. ఉత్పాదక కార్యకలాపాలలో ఇనుము వాడకం వ్యవసాయానికి, చేతివృత్తుల ఉత్పత్తికి గొప్ప ప్రోత్సాహాన్ని ఇచ్చింది. ఈ విధంగా ఉత్పత్తి చేయబడిన మిగులు పెరుగుదల ఆధారంగా ఈ కాలంలో పట్టణీకరణ మరింతగా అభివృద్ధి చెందింది. రాజగృహ, అయోధ్య, కాశీ వైశాలి, ఉజ్జయిని, తక్షశిల ప్రసిద్ధ పట్టణాలు. ఇక్కడ మనం పాలకులు–

పాలితులు అనే విధానాన్ని చూస్తాము. ఇక్కడి ప్రజలను వివిధ రాజులు పాలించారు. 321 బిసి నుండి 185 బిసి వరకు మౌర్యుల కాలం. మౌర్యుల అనంతర కాలం 200 బిసి నుండి 300 ఎడి వరకు వర్తిస్తుంది.

ఏకకాలంలో అక్రమించుకోబడినవిగా భావిస్తున్న దాదాపు 60 స్థావరాలు 50-30 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నాయని అంచనా. బహుశా ప్రత్యేక హస్తకళలు, వాణిజ్యం కలిగి ఉన్న గ్రామాల చుట్టూ ఈ పట్టణాలు పెరిగి ఉండవచ్చు.

ప్రాకారాలు, బలమైన గోడలతో అటువంటి పట్టణాలు నూతనంగా నిర్మాణాన్ని సంతరించుకున్నాయి. అంతర్గతంగా ప్రత్యేకంగా గిల్డులు నిర్మించబడ్డాయి. ప్రతి ఒక్క గిల్డు పట్టణంలోని ఒక నిర్దిష్ట ప్రాంతాన్ని ఆక్రమించుకుని ఉంటుంది.

కొన్ని పట్టణ ప్రణాళికలు పరిశీలించినట్లైతే - చాలా పట్టణాలలో రెండు వెడల్పు వీధులు, వాటిని చతురస్రాకారంలో వేరుచేస్తూ గోడలతో కూడలిలాగా నిర్మించారు. మిగిలిన వీధులన్నీ ఇరుకుగాను, అడ్డదిడ్డమైన రహదారులతో, కోట లేదా దేవాలయం మొదలైన ప్రధాన ప్రాంతాలకు దారితీస్తున్నాయి.

రాజులు, పాలకులతో పాటు, ఆర్థిక, సామాజిక అధికారం కలిగిన ఇతర సమూహాలు ఈ కాలంలో అభివృద్ధి చెందాయి. అవి వర్తక వ్యాపార సమూహాలు, భూ యజమానులు, సన్యాసినులు, సన్యాసులు మొదలైన కార్పొరేట్ సమూహాలను కలిగి ఉన్నాయి. అప్పటికే పట్టణ ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ జీవితంలో ఏకీకృత వర్ణ వ్యవస్థ ప్రధాన పాత్ర పోషిస్తున్నది.

200 బిసి నుండి 300 ఏడి నాటికి పట్టణాలు సంపదలో అత్యున్నత స్థాయికి చేరుకున్నాయి. మౌర్యుల అనంతర పట్టణీకరణలో కూడా హస్తకళలు వెల్లివిరియటం చెప్పుకోదగ్గ అంశం. మౌర్యుల అనంతర కాలం గొప్ప సాంకేతిక పురోగతికి ప్రసిద్ధి చెందింది. ఖరీదైన వస్తువుల స్థానిక, దూర వాణిజ్యం, లోతట్టు ప్రాంతాల నుండి వ్యవసాయ ఉత్పత్తుల లభ్యతతో పాటు హస్తకళా ఉత్పతులు, ఇతర ఉత్పత్తులు, మౌర్య అనంతర శతాబ్దాలలో పట్టణీకరణ వేగవంతం కావటానికి తోడ్పడింది. అనేక ముద్రలు, శిలా శాసనాలు బౌద్ధమతం శ్రేయోభిలాషులుగా ఉన్న కళాకారులు, వ్యాపారుల ప్రాముఖ్యత పెరగడాన్ని ధృవీకరిస్తున్నాయి.

## గుప్తుల, గుప్తులనంతర కాలం

గుప్త సామ్రాజ్యంలో నగరాలు, పట్టణాల క్షీణత కనిపిస్తుంది. మూడవ శతాబ్దం చివరిలో, నాల్గవ శతాబ్దం ప్రారంభంలో తగ్గుముఖం పట్టిన దూర వాణిజ్యం పట్టణ క్షీణతకు కారణం. ఆరవ శతాబ్దం అనంతరం పట్టణ కేంద్రాలు మరింత వేగంగా క్షీణ దశకు చేరుకున్నాయి.

మూడవ, నాల్గవ శతాబ్దాలలో జరిగిన సామాజిక తిరుగుబాటు గ్రామీణ ప్రాంతాలను భూస్వామ్య విధానంలోకి మార్చింది.

కానీ పట్టణ క్షీణత, స్తబ్దతను వ్యవసాయ విస్తరణ భర్తీ చేసింది. నాయకులు, యువరాజులు భూమి మంజూరు చేసి ప్రోత్సహించడం వల్ల ఇది సాధ్యమైంది.

డీ-అర్బనైజేషన్ అనేది భూస్వామ్య విధానం యొక్క మొదటి లేదా శాస్త్రీయ దశ యొక్క లక్షణం. వాణిజ్యం, ప్రధానంగా వ్యవసాయ ఆర్థిక పరిస్థితులు కుంగిపోతున్న సమయంలో కొంతమంది రైతాంగం, భూస్వామ్య ఆధిపత్య వర్గాల ద్వారా ఈ మార్పు ఏర్పడింది.

పదకొండవ శతాబ్దంలో దేశంలోని కొన్ని ప్రాంతాలలో తేలికపాటి పట్టణ పునరుద్ధరణ ప్రారంభమై పద్నాలుగో శతాబ్దం నాటికి పట్టణీకరణ గుర్తించదగిన ప్రక్రియగా మారింది.

## దక్షిణ భారతదేశం

దక్షిణాదిలో 200 బిసి నుండి 200 ఎడి మధ్య కాలంలో పట్టణ స్థావరాలు ఉన్నట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. ప్రణాళికాబద్ధమైన లేఅవుట్‌లు, మట్టితో పటిష్టంగా కట్టిన రాజభవన సముదాయాలు, ధాన్యాగారాలు, నీటి నిల్వ కోసం ఏర్పాట్లు కనిపిస్తాయి.

ముఖ్యంగా సముద్రం ఆవల వాణిజ్యం ఫలితంగా తీర రేఖ వెంబడి పట్టణ వాణిజ్య సమూహం పుట్టుకకు దారితీసింది. ఈ కాలంలోని ముఖ్యమైన పట్టణ కేంద్రాలు దక్షిణాన పుహార్, అరికమేడు, కోర్కై, ముసిరి, కచ్చి, సెంట్రల్ డెక్కన్‌లోని కోటలింగాల, ధూళికట్ట, పెద్దబంకుర్, కోనాద్‌పూర్. క్రీస్తుశకం మూడవ శతాబ్దంలో వాణిజ్యం తగ్గిపోవడంతో సముద్ర వాణిజ్యం కూడా నిలిచిపోయింది.

ఏడవ శతాబ్దం నుండి ప్రారంభమైన మధ్యయుగ కాలంలో (క్రీ.శ. 600 నుండి క్రీ.శ. 1600 వరకు) ఇది మళ్లీ పుంజుకుంది. పదమూడవ, పద్నాల్గవ శతాబ్దాలు దక్షిణ భారతదేశ పట్టణ చరిత్రలో ఒక పరీవాహక ప్రాంతంగా గుర్తించబడతాయి.

ఈ కాలంలోని పట్టణీకరణను 'దేవాలయ పట్టణీకరణ'గా వర్ణించవచ్చు. బహుళ-ఆలయాల కేంద్రాలు, ఒకే పెద్ద ఆలయ కేంద్రాలు, వాటిలో కొన్ని తీర్థయాత్ర కేంద్రాలు, చివరకు, రాజరిక కేంద్రాలు కూడా ముఖ్యమైన పట్టణాలు, కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి. దేవాలయాలు కేంద్రకాలుగా, నగరం ద్వారా నిర్వహించబడిన వాణిజ్యం, ఇతర వ్యాపార సంస్థలు, చేతి వృత్తులు (హస్తకళల) సంస్థలు పట్టణ కేంద్రాల అభివృద్ధికి దోహదపడ్డాయి.

వారు రాజరిక విధానం ద్వారా చైతన్యంతో అభివృద్ధి చేయబడిన ఓడరేవులను, రాచరిక/రాజకీయ కేంద్రాలను కూడా ఒక పటిష్టమైన ఆర్థిక రాజకీయ గూటిలోకి తీసుకువచ్చారు. ఈ కాలంలో దక్షిణ భారతదేశం అంతటా వ్యాపించిన భక్తి భావజాలం ముఖ్యమైన పట్టణాల్లోని ముఖ్యమైన దేవతల చుట్టూ కేంద్రీకృతమై, పట్టణ జీవితంలోని వివిధ తరగతులను ఐక్యం చేసే శక్తిని అందించింది.

పట్టణ ముఖచిత్రంలో దేవతలు, దేవతల పౌరాణిక కథలను వర్ణించే విస్తృతమైన శిల్పాలతో కూడిన గోపురం లేదా ఆలయ ద్వారం ప్రముఖంగా నిలిచి, తన ఉనికిని చాటుకుంటుంది. కుంభకోణం, కాంచీపురం, అంబసముద్రం, తంజావూరు, మదురై, మామల్లపురం మొదలైనవి ఈ కాలంలోని కొన్ని ముఖ్యమైన పట్టణ కేంద్రాలు.

## సుల్తాన్‌ల, మొఘలుల కాలం

ఢిల్లీలో సుల్తాన్ సామ్రాజ్య స్థాపన తర్వాత ఉత్తర భారతదేశంలో పట్టణీకరణ వేగం పెరిగింది. వివిధ సుల్తానులు, స్వతంత్ర రాజుల క్రింద, పెద్ద నగరాలు కోటలుగా, పరిపాలన కేంద్రాలుగా అభివృద్ధి చెందాయి. 13వ, 14వ శతాబ్దాలలో పట్టణ ఆర్థిక వ్యవస్థలో పెద్ద విస్తరణ జరిగింది. నగరాల పరిమాణం, సంఖ్య పెరిగింది. హస్తకళా వస్తువుల ఉత్పత్తి, వాణిజ్యంలో పెరుగుదల ఉంది. ఈ కాలంలో సాంకేతికతలో చోటుచేసుకున్న ప్రధానమైన మార్పులు ఉత్పత్తి వృద్ధి చెందడానికి దోహదం చేసాయి.

సుల్తానుల కాలంలో పట్టణీకరణ ప్రక్రియలో సైనిక స్థావరాలు, ఖాన్‌ఖాలు, వీధులు (సరై), బజార్‌లను స్థాపించాలనే ప్రభుత్వ విధానం ముఖ్యమైన పాత్ర పోషించింది. బజార్లతో ముఖ్యమైన టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేసి, సమీప గ్రామాల

నుండి రైతులు, చేతివృత్తుల వారు తయారు చేసిన వస్తువులను మార్కెట్‌లో అమ్ముకునేందుకు ప్రోత్సహించారు.

ఇది ఒకవైపు ద్రవ్య వినియోగం పెరగడానికి, మరోవైపు కొత్త వృత్తులను పరిచయం చేయడానికి దారితీసింది. విదేశాలతో సముద్ర, రోడ్డు మార్గంలో వాణిజ్యం పురోగతి చెందటం వల్లనే ఇది సాధ్యమైంది.

సుల్తానులు, ఉన్నతాధికారులు, నిర్వహించే కార్ఖానాలతో (వర్క్‌షాప్ కమ్ స్టోర్ హౌస్), చివరికి సాధారణ వర్తకులు కూడా వివిధ చేతివృత్తులలో నైపుణ్యం కలిగిన కళాకారులు, పనివారిని పట్టణ కేంద్రాలకు వచ్చేలా ఆకర్షించారు.

పాలకులు వారి రాజభవనాలు, భారీ కట్టడాలు, పెద్ద భవనాలు, అపారమైన అనుచరగణంతో, రైతులు, వ్యాపారుల నుండి సేకరించిన మిగులులో ఎక్కువ భాగాన్ని నగరాల మార్కెట్లలో ఖర్చు చేసేవారు. అన్ని పెద్ద నగరాల్లో, సాధారణ ఉపయోగం కోసం సాధారణ మార్కెట్లు, ధాన్యం, వస్త్రాలు, గుర్రాలు, అన్ని దేశాల బానిసల కోసం ప్రత్యేక మార్కెట్లు ఉండేవి. వారు కళాశాలలతో పాటు వేశ్యలు, వేశ్యాగృహాలు, హోటళ్లను ఏర్పాటుచేసి తమ స్వంత సంస్కృతిని అభివృద్ధి చేసుకున్నారు.

మొఘలుల పాలనలో, 1550, 1750 మధ్య బహుశా 250 ప్రాథమిక, ద్వితీయ నగరాలు ఆగ్రా లేదా ఢిల్లీ వంటి సామ్రాజ్య రాజధానుల నుండి అనేక లక్షల మంది నివాసితులతో ప్రాంతీయ రాజధానులు లేదా ప్రాంతీయ (సుబా) అధికారులు, 10,000 నుండి 20,000 మంది నివాసితులతో ఉప-ప్రాంతీయ (సర్కార్) అధికారుల స్థానాలు ఉండవచ్చు.

నగరం (షహర్ లేదా మదాయిన్)కి భిన్నంగా కస్బా (కస్బాత్, కస్బా) అని పిలువబడే చిన్న పట్టణ ప్రాంతాల సమూహం అధికారికంగా గ్రామాల ఆధారంగా విస్తరించిన, విస్తరిస్తున్న వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో ఉండేది. అక్బర్ కాలంలో విస్తరిస్తున్న సామ్రాజ్యంలో పట్టణంగా పిలువబడే ఇటువంటి ప్రదేశాలు సుమారు 2,700 నుండి 3,200 వరకు ఉండేవి.

ఈ కాలంలో లాహోర్, బదాయున్, ఢిల్లీ, ఆగ్రా, ఫతేపూర్ సిక్రీ, దౌల్తాబాద్, తుగ్లకాబాద్, కాబూల్, అలహాబాద్, అహ్మదాబాద్, ముల్తాన్ మొదలైనవి పెద్ద రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక కేంద్రాలుగా మారాయి. అదేవిధంగా భారతదేశం అంతటా స్వతంత్ర రాజ్యాల అధికార స్థానాలుగా అనేక కొత్త పట్టణాలు ఉనికిలోకి వచ్చాయి. ప్రస్తుత పట్టణాల మూలాలు ఇక్కడే ఉన్నాయి.

ప్రత్యేక తరహాలో సైనిక నిర్మాణాన్ని ప్రతిబింబించే రాజమందిరాలు, కోటలు, సైనిక కవాతులు, గుర్రపుస్వారీ, వ్యాయామాల కోసం బహిరంగ ప్రదేశాలు (మైదానాలు), దేవాలయాలు, మసీదులు, సమాధులు, కళాశాలలు, బజార్లు, కారవాన్ సెరాయ్ వంటి మతపరమైన నిర్మాణాలు భారీ గోడలు మరియు కోటగుమ్మాలతో ఉన్నాయి. ఈ గోడలకు బయట ఉన్న ప్రదేశంలో పెద్ద నగరాలు ఏర్పడి పట్టణ విస్తరణకు తోడ్పడ్డాయి.

ఈ కాలంలో, పాలకుల మతం ఇస్లాం అయినప్పటికీ, కుల వ్యవస్థ నగరాల్లో నివసించే ప్రజల జీవితాలను ప్రభావితం చేసే ముఖ్యమైన సామాజిక, ఆర్థిక పాత్రను పోషించడం కొనసాగించింది. భారతదేశంలో ప్రబలంగా ఉన్న కుల వ్యవస్థ భూస్వామ్య పాలనకు కంచుకోటగా పనిచేస్తున్నందున పాలకులు దీనిని సవాలు చేయలేదు. మార్చలేదు. వృత్తిపరమైన విభజన చాలా ప్రబలంగా ఉండేది. నగర వ్యవహారాలలో సామాజిక అంచెల విధానం బలంగా ఉంది. వివిధ కులాలకు చెందిన ప్రజలు నగరంలో వేర్వేరు ప్రాంతాల్లో నివసించేవారు.

## వలసవాద కాలం

పాశ్చాత్య దేశాలలో పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం రావడంతో వలసరాజ్యాల కాలం ప్రారంభమైంది. ఉత్పత్తి చేయబడిన వస్తువుల అమ్మకం కోసం కొత్త ప్రాంతాలు (కాలనీలు) వెతకబడ్డాయి. దాదాపు 200 సంవత్సరాల పాటు కొనసాగిన వలసరాజ్యాల కాలం భారతీయ నగరాలను వలసరాజ్యాల దోపిడీ, పరిపాలనకు అనుకూలంగా మార్చడానికి ఉద్దేశించిన అనేక నియమాలు, నిబంధనలు, అలవాట్లను ప్రవేశపెట్టింది. 1857 తిరుగుబాటు తర్వాత భారతీయ నగరాల స్వభావాన్ని మార్చడానికి తీవ్రమైన ప్రయత్నాలు జరిగాయి. వీధుల విస్తరణ, రద్దీగా ఉండే ప్రాంతాలను కూల్చివేయడం, సామ్రాజ్యవాద వలస ఉనికి యొక్క భౌతిక చిహ్నాలను ఏర్పాటు చేయడం వీటికి కొన్ని ఉదాహరణలు.

నగర పరిపాలన కోసం కొత్త నియమ నిబంధనలు ప్రవేశపెట్టబడ్డాయి. జరిమానాలు, రుసుములతో మునిసిపల్ అథారిటీని వివిధ ప్రదేశాలలో స్థాపించారు. వాటిలో ముఖ్యమైనవి సిమ్లా, కలకత్తా, బొంబాయి, మద్రాస్, ఢిల్లీ. నగరాల్లో భవన నిర్మాణాలకు అనుమతులను మంజూరు చేయడం ద్వారా తాత్కాలిక వ్యవస్థకు శాశ్వత రూపాన్ని ఇచ్చి నియంత్రించారు. ఆధునిక వ్యవస్థల కోసం నీటి సరఫరా, ఘన వ్యర్థాల సేకరణ మొదలైన పూర్వపు వ్యవస్థలు మరుగుపరచబడ్డాయి. పన్నులు

ప్రవేశపెట్టడం, నగరాన్ని ఆర్థికంగా లాభదాయకంగా మార్చడం, ధనవంతుల కోసం కొత్త నివాస స్థలాల నిర్మాణానికి చర్యలు చేపట్టడంతో నగరం యొక్క విస్తరణకు మార్గం సుగమం అయింది.

**నగర అభివృద్ధిలో వలసరాజ్యాల కాలం యొక్క ఐదు ముఖ్యమైన లక్షణాలు మరియు ప్రభావాన్ని ఈ విధంగా చెప్పుకోవచ్చు.**

మొదటిది, కొత్త (ఆక్రమిత) ప్రాంతాలను పౌర (సివిల్) మరియు కంటోన్మెంట్ (సైనిక) స్థావరాలుగా పేర్కొనడం వల్ల నగర పరిధి సుదూర ప్రాంతాల వరకు వ్యాప్తి చెందింది. ఆ వారసత్వం ఈనాటికీ కొనసాగుతోంది. దీనివల్ల గతంలో ఒక ప్రధాన కూడలి ఆధారంగా చుట్టూ నిర్మించబడ్డ నగరాల స్థానంలో అధికార కార్యాలయాలు, కోర్టులు, అధికారుల నివాసాలు మొదలైన వాటితో– సివిల్ లైన్స్, కంటోన్మెంట్ ప్రాంతంలో మిలిటరీ స్థావరాలు ఏర్పడ్డాయి.

చాలా తక్కువ సాంద్రతతో, పెద్ద బహిరంగ ప్రదేశాలతో ఒక పద్ధతి ప్రకారం నిర్మించిన ఈ పట్టణాలు స్థానిక పట్టణాలకు పూర్తి భిన్నంగా ఉన్నాయి.

అధునాతన ప్రాథమిక సౌకర్యాలతో ఆంగీకరించబడిన ప్రాంతం ఒకవైపు, పాత నగరం మరోవైపు ఏర్పడటంతో నగరంలో ఒక కొత్త ద్వంద్వత్వం చోటుచేసుకుంది. ఈ ద్వంద్వత్వం ఇప్పటికీ నగరాలలో కొనసాగుతోంది – ధనికుల కోసం ఒక నగరం, పేదల కోసం మరొకటి.

దాదాపు 114 కంటోన్మెంట్లు, ఎక్కువగా పంజాబ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని మైదానాలలో నిర్మించబడ్డాయి. భద్రతా కారణాల కోసం అనేది స్పష్టం. పరిపాలన లేదా సైనిక ప్రాముఖ్యత లేని ఇతర పూర్వ పట్టణాలు విస్మరించబడ్డాయి.

రెండవది, ఐరోపా నిర్మాణ శైలులలో పబ్లిక్ భవనాలను నిర్మించటమే కాకుండా పాలకుల గొప్పదనాన్ని భౌతికంగా ప్రదర్శించటం కోసం చేసిన ప్రయత్నాల ఫలితంగా దేశీయ నిర్మాణాలలో క్రమంగా ఆశ్చర్యకరమైన మార్పులు చోటుచేసుకుని పట్టణ ద్వంద్వత్వాన్ని సంతరించుకున్నాయి.

ప్రధాన నిర్మాణ రూపాలు ట్యూడర్, గోతిక్, విక్టోరియన్ (ఇక్కడ లుటియన్స్ ఢిల్లీ నిర్మాణం, కొత్త సెంట్రల్ విస్టా అంశాన్ని మరచిపోకుడదు).

మూడవది, ఈ కాలంలో అనేక కొత్త పట్టణాలు, నగరాల స్థాపన కూడా జరిగింది. ఇవి స్వదేశీ పట్టణాలకు చాలా భిన్నంగా ఉన్నాయి. ఇవి చిన్న కొండప్రాంతాలు, కెనాల్ కాలనీ పట్టణాల స్థాయి నుండి ముంబై, కోల్‌కతా, చెన్నై

వంటి మెట్రోపాలిటన్ ఓడరేవు నగరాల వరకు బ్రిటీష్ వలసరాజ్యాల దోపిడీ యొక్క ఆర్థిక, పరిపాలనా, సైనిక ప్రయోజనాలకు ఉపయోగపడే స్థాయిలో మారాయి.

నాలుగు, భారతదేశంలోకి పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానాన్ని ప్రవేశపెట్టిన మాధ్యమం వలసవాదం. దానితో పాటు రైల్వేలు, ఓడరేవులు, కర్మాగారాలు మరియు గిడ్డంగులు వంటి కొత్త సాంకేతికత, సంస్థలు వచ్చాయి. ఈ కొత్త తరహా కార్యకలాపాలకు అనుబంధమైన రవాణా నెట్‌వర్క్‌లు మరియు సంస్థాగత భవనాలు ఇప్పటికే ఉన్న నగరాల్లోని కొన్ని భాగాలను పూర్తిగా మార్చాయి. ఇది బొంబాయి, కలకత్తా, బెంగుళూరు, మద్రాస్ వంటి నగరాల్లోకి గ్రామీణ ప్రాంతాల నుండి ఫ్యాక్టరీ కార్మికులు, మిల్లులో పనిచేసేవారిని తీసుకురావడం ద్వారా పట్టణ శ్రామిక శక్తి వృత్తిపరమైన నిర్మాణాన్ని మార్చింది. తద్వారా వారి సామాజిక, ఆర్థిక కూర్పును కూడా మార్చింది.

ఐదు, ఆధునిక ఆలోచనలు మూర్తీభవించిన పాశ్చాత్య విద్య, చట్టం స్థానిక ప్రముఖులపై చాలా సానుకూల ప్రభావాన్ని కలుగజేశాయి. కొత్త ఫ్యాక్టరీలలో, కార్యాలయాలలో ఉపాధి పొందుతున్న శ్రామిక వర్గానికి, గ్రామీణ ప్రాంతాల్లో వలే కులం, మతం ఆధారంగా ఎదుర్కొన్న ఆంక్షలు, ఆటంకాలు లేకపోవడంతో పట్టణాల్లో కొత్త తరగతి (వర్గం) అవిర్భవించింది.

ఆ విధంగా, బ్రిటిష్ వలసవాదం భారతీయ సమాజంలో ఆధునికత యొక్క సంస్కరణను ప్రవేశపెట్టింది కానీ ఒక బలమైన వలసవాద ముద్రను వేసింది. సివిల్ లైన్లు, అవి విస్తరించిన ప్రాంతాలు బాగా నిర్వహించబడ్డాయి. దానికి భిన్నంగా పని ప్రదేశాలకు దగ్గరగా పేద ప్రజలు, వలస కార్మికులు నివసించే క్రిక్కిరిసిన జనావాసలలో మాత్రం పరిస్థితులు దుర్భరంగా ఉండేవి.

## స్వాతంత్ర్య అనంతర కాలం - 1947 నుండి 1991 వరకు

అనేక కారణాల వల్ల 1947 తర్వాత పట్టణీకరణ వేగంగా పెరిగింది. తక్షణ పరిణామాలతో, కొత్తగా ఏర్పడిన తూర్పు, పశ్చిమ పాకిస్తాన్ నుండి శరణార్థులు పెద్ద సంఖ్యలో వచ్చారు. 1951లో దాదాపు 7.3 మిలియన్ల మంది శరణార్థులు నమోదయ్యారు. పంజాబ్‌లోని జలంధర్, లూథియానా, అమృత్‌సర్, అంబాలా వంటి కొత్త పట్టణాలు, తూర్పున కలకత్తా, ఢిల్లీ విస్తరించబడ్డాయి. కానీ వారందరికీ వసతి కల్పించడానికి స్థలం సరిపోలేదు.

మొత్తం మీద, 1941, 1951 మధ్య ఎనిమిది ప్రధాన రాష్ట్రాలలో 14

కొత్త పట్టణాలు నిర్మించబడ్డాయి. 1951 నాటికి 4,70,000 మంది శరణార్థులకు వసతి కల్పించారు.

ప్రారంభ సంవత్సరాల్లో పట్టణ వృద్ధి రేటు ఎక్కువగా ఉంది. 1941–51 మధ్య పట్టణ జనాభా 41 శాతం ఉండగా 1951–61లో 26 శాతం పెరిగింది. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణతో పాటు వాటి రాష్ట్ర రాజధానుల ఏర్పాటు కూడా పట్టణ వలసలకు దారితీసింది. అందువల్ల పట్టణీకరణ రేటును వేగవంతం చేయడంలో జనాభా, ఆర్థిక, పరిపాలనా అంశాలు ముఖ్యపాత్ర పోషించాయి.

1971 నాటికి 112 కొత్త పట్టణాలు నిర్మించబడ్డాయి (వాటిలో పెద్ద సంఖ్యలో 1950 నుండి 1960 మధ్య నిర్మించారు). ఇది భారతదేశం ప్రారంభ అలాగే వేగవంతమైన పారిశ్రామికీకరణ కాలానికి సమానంగా ఉంది. చండీగఢ్, భువనేశ్వర్, గాంధీనగర్ వంటి రాష్ట్ర రాజధానులతో పాటు, భారీ పరిశ్రమలు, విద్యుత్ ప్రాజెక్టుల అనుసంధానంనం వల్ల అనేక కొత్త పట్టణాల అభివృద్ధి జరిగింది. ఉదాహరణకు భిలాయ్, బొకారో, దుర్గాపూర్, రూర్కెలా, నంగల్, మోడీనగర్, జంషెడ్‌పూర్ వంటి కొన్ని కంపెనీ పట్టణాలు మినహా, కొత్త పట్టణాలు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం వలన నిర్మించబడ్డాయి.

కొత్త పట్టణాలు శరణార్థులకు ఉద్యోగాలు, గృహవసతి కల్పించడం, పాత పట్టణాల నుండి అధిక జనాభాను తీసుకురావడం వంటి అనేక అవసరాలను తీర్చాయి. ఈ పట్టణాలు కొత్త అలాగే అభివృద్ధి చెందుతున్న ఆధునిక భారతదేశానికి ప్రతీకలు. చండీగఢ్ నెహ్రూ కలల సాకారం.

పంచవర్ష ప్రణాళికల కాలంలో పట్టణ విధానానికి సంబంధించి రాజ్యం ప్రమేయం గణనీయమైనది. మొదటి రెండు పంచవర్ష ప్రణాళికలలో (1951–56, 1956–61), పట్టణ పరిపాలన, నైపుణ్యం కలిగిన నిపుణుల శిక్షణ కోసం అనేక ముఖ్యమైన సంస్థలు ఏర్పాటు చేయబడ్డాయి. అవి, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జాతీయ భవనాల సంస్థ, స్కూల్ ఆఫ్ ప్లానింగ్, ఆర్కిటెక్చర్, టౌన్, కంట్రీ ప్లానింగ్ ఆర్గనైజేషన్ (1957లో ఢిల్లీకి మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేయడానికి పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సాంకేతిక విభాగం). 1960వ దశకంలో అనేక రాష్ట్రాలు చట్టాలను రూపొందించాయి. పట్టణ, ప్రణాళికా విభాగాలను ఏర్పాటు చేసారు. ఇవి కేంద్ర గ్రాంట్ల సహాయంతో స్వతంత్ర నగరాల 500 మాస్టర్ ప్లాన్‌లను రూపొందించాయి.

కానీ స్వాతంత్ర్యం తర్వాత వేగవంతమైన పట్టణీకరణ, పట్టణ జనాభా

1951లో 62 మిలియన్ల నుండి 1981లో 159 మిలియన్లకు, 1991లో 217 మిలియన్లకు మూడు రెట్లు పెరగడంతో ఈ ప్రణాళికలు గందరగోళంలో పడ్డాయి. అనేక కారణాల వల్ల అవి ఎక్కువగా కాగితంపైనే ఉండిపోయాయి.

గత శతాబ్దంలో పట్టణీకరణ మరొక గుర్తించదగిన లక్షణం పెద్ద పట్టణాలు నగరాలు వేగంగా అభివృద్ధి చెందడం. ఈ విధంగా, ముఖ్యంగా 1991 వరకు అటువంటి స్థావరాలలో పట్టణ జనాభా సాంద్రత పెరిగింది. గత శతాబ్దం ప్రారంభంలో 20,000 కంటే తక్కువ జనాభా కలిగిన చిన్న పట్టణాల, పట్టణ జనాభాలో దాదాపు 47 శాతం వాటా కలిగి అగ్రస్థానంలో ఉన్నాయి. 1991 నాటికి, ఇది 11శాతానికి పడిపోయింది. 1,00,000, అంతకంటే ఎక్కువ జనాభా కలిగిన మొదటి శ్రేణి పట్టణాలుగా పిలువబడే పట్టణాలు 65 శాతంగా ఉన్నాయి. ఈ అగ్రశ్రేణి పట్టణాల సంఖ్య 1901లో 24 ఉండగా 1951లో 76కి,1991లో 300కి పెరిగింది.

మరో ప్రధాన అభివృద్ధి ఏమిటంటే, మహానగరీకరణ అంటే, అతి పెద్ద లేదా మెట్రోపాలిటన్ నగరాల సంఖ్య వేగంగా పెరగటం. భారతదేశంలో ఒక మిలియన్, అంతకంటే ఎక్కువ జనాభా కలిగిన స్థావరాలను మెట్రోపాలిటన్ నగరంగా పరిగణిస్తారు. 1901లో అలాంటి ఒకే ఒక్క నగరం కలకత్తా. 1951 నాటికి ఈ సంఖ్య నాలుగుకు చేరింది – కలకత్తా, మద్రాసు, బొంబాయి, ఢిల్లీ. అటువంటి నగరాల సంఖ్య 1981 నాటికి 12 కి పెరగగా, 1991కి ఈ సంఖ్య 23 అయింది. ప్రస్తుతం మనదేశంలో 35 మెట్రోపాలిటన్ నగరాలు ఉన్నాయి.

ఈ కాలంలో చోటుచేసుకున్న ఇతర మార్పు లేదా ప్రధాన లక్షణం నగరాలు విస్తృత శ్రేణి తయారీ కేంద్రాల నుండి సేవా కేంద్రాలు (సర్వీసు సెంట్రర్లు)గా రూపాంతరం చెందడం. స్వాతంత్ర్యం అనంతరం దశాబ్ద కాలంలో , పెద్ద నగరాల్లో తయారీ రంగంలో ఉద్యోగాలు పెద్ద సంఖ్యలో శ్రామిక జనాభాకు మద్దతునిచ్చాయి. 1960లు, 1980లలో పురాతన సంప్రదాయ జౌళి తయారీ లేదా పత్తి, దుస్తుల పరిశ్రమలు పతనం కావడంతో, వీటిపైన ఆధారపడ్డ నగర ఆర్థిక వ్యవస్థ ముందుకు సాగలేకపోయింది. ఎగుమతి ఆధారిత పరిశ్రమలపై దృష్టి సారించటంతో కొత్త రంగాలు ఉనికిలోకి వచ్చాయి. బెంగళూరు, హైదరాబాద్, పూణే మొదలైన ఐటీ ఆధారిత నగరాలు వేగంగా అభివృద్ధి చెందాయి.

భారతీయ నగరాల్లో ఈ మార్పు పట్టణ ఉపాధిపై కూడా ప్రభావం చూపింది. 1981–91 మధ్య బొంబాయిలో ఫ్యాక్టరీ కార్మికుల సంఖ్య 604,000 నుండి 4,47,000 కి తగ్గగా, అహ్మదాబాద్ లో 1983–84, 1995 మధ్య కాలంలో 50,000 మిల్లు కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారు. ఒక అంచనా ప్రకారం 1983లో పట్టణ

ప్రాంతాలలో తయారీ రంగంలో పనిచేసే పురుష కార్మికుల సంఖ్య 27శాతం నుండి 24 శాతానికి క్రమంగా క్షీణించడాన్ని గమనించవచ్చు. మహిళా కార్మికులలో ఇది 26 శాతంగా ఉంది.

ఆసక్తికరమైన విషయమేమిటంటే, బ్లూ కాలర్ (అల్పాదాయ కార్మిక వర్గం) పరిశ్రమల క్షీణతతో పాటు జనాభాలో కూడా క్షీణత ఏర్పడింది. నగరవ్యాప్తంగా ఉద్యోగం, ఉపాధి కోల్పోయి వేలాది కార్మికులు రోడ్డునపడ్డారు. కానీ ఎక్కడికి వెళ్లగలరు? వారు ఇప్పటిదాకా మెట్రోపాలిట్ ప్రాంత సరిహద్దుల్లోనే నివసించారు. ఉదాహరణకు 1961లో బొంబాయి నగర నడిబొడ్డులో 2.7మిలియన్ల జనాభా ఉండగా, ఇది గ్రేటర్ ముంబై మొత్తం జనాభాలో మూడింట రెండొంతులు. 1991 నాటికి, బొంబాయి (ద్వీపం) జనాభా 3.3మిలియన్లు. ఇది గ్రేటర్ ముంబై జనాభాలో 9.9 మిలియన్లలో కేవలం 33 శాతం మాత్రమే. కలకత్తా ఇతర చాలా మెట్రో నగరాల్లో కూడా ఇదే పరిస్థితి.

ఉత్పాదక రంగంలో ఉపాధి క్రమంగా మందగించినప్పటికీ, మొత్తంగా, ఈ కాలంలో పట్టణ జనాభా రేటు సంవత్సరానికి 3 శాతంచొప్పున పెరిగింది. దీని వల్ల గృహ నిర్మాణాల్లో పెరుగుదల, ప్రాథమిక మౌలిక సదుపాయాలలో తీవ్ర సమస్యలు తలెత్తాయి.

పైన పేర్కొన్న విధంగా మాస్టర్ ప్లాన్‌లు అయితే చాలా ప్రత్యేకమైనవి లేదా ఈ భారీ మార్పుకు తగినవిధంగా అర్ధం చేసుకోకుండా చేసినవి. నగరంలో పేదలు సరైన ఇళ్లలో ఉండే స్థోమత లేక, బహిరంగ ప్రదేశాల్లోనే తాత్కాలిక గృహాలను నిర్మించుకుని స్థిరపడ్డారు.

కేంద్రీకృత ప్లానింగ్ అధికారులకు పేదలు ఇచ్చిన సమాధానం ఇది. తమ జీవనోపాధి సంపాదించే క్రమంలో వారు అసంఘటిత రంగంగా మార్పు చెంది, దాదాపు 86శాతం పట్టణవాసులకు ఉద్యోగాలు లభించటానికి కారకులయ్యారు. 1991లో బొంబాయిలో అసంఘటిత రంగంలో 66శాతానికి పైగా ఉపాధి ఉండగా, కలకత్తాలో అది 55శాతం ఉండేది. ప్రస్తుతం ఈ సంఖ్య రెండు నగరాల్లోనూ 90శాతానికి చేరుకుంది.

అందువల్ల స్వాతంత్రం తర్వాత కాలంలో పట్టణీకరణ సారూప్య లక్షణం భారతీయ పట్టణాలలో మురికివాడలు, చెదురుమదురు నివాసాల పెరుగుదల, దీనితోపాటు అసంఘటిత రంగం పెరుగుదల కూడా.

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరం కూడా అన్ని పార్శ్వాలలో విస్తరించక తప్పలేదు. ప్రణాళికాబద్ధమైన శివారు ప్రాంతాలు, చుట్టుపక్కల పట్టణాల

అభివృద్ధితో పాటు నగర పరిధి పరిసరాలలో కూడా ప్రణాళిక లేని, అడ్డదిడ్డమైన అభివృద్ధి వల్ల ఇది సంభవించింది.

ఈ కాలంలోని మరొక ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సివిల్ లైన్‌ల మధ్య తీవ్రమైన విభేదాలు, పరిపాలనలోకి ప్రవేశించిన రాజకీయ సమీకరణాలతో నగరం మిగిలిన ప్రాంతాలు నెమ్మదిగా నిర్మూలించబడ్డాయి. నగరంలోని మురికివాడలు ఇతర ప్రాంతాల మధ్య ఒక కొత్త రకమైన ద్వంద్వవాదం ముందుకొచ్చింది.

1991 నాటికి భారతదేశంలోని 21 శాతం పట్టణ ప్రజలు మురికివాడల్లో నివసిస్తున్నారు. బొంబాయి వంటి పెద్ద నగరాల్లో ఇది చాలా ఎక్కువగా ఉంది. బొంబాయిలో 43 శాతం, కలకత్తాలో 36 శాతం కాగా ఢిల్లీలో 22 శాతం మంది మురికివాడల్లో నివసిస్తున్నారు.

ముగింపుగా, స్వాతంత్ర్యానంతర కాలంలో 1991 వరకు భారతీయ నగరంలో రాజ్యం, తద్వారా లభించే ప్రత్యేక హెూదా, జీవనశైలికి బందీలైన సంప్రదాయ ఉన్నతవర్గం ఒకవైపు, అప్పుడే ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రభుత్వ రంగ గృహాలతో నిలదొక్కుకుని అభివృద్ధి చెందుతున్న మధ్యతరగతి, చిన్న వ్యాపారస్తులు, వర్తకులు మరోవైపు, సంఘటిత తయారీ రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గడంతో కుదించుకు పోయిన సంఘటిత కార్మిక వర్గం, అసంఘటిత రంగంలో వివిధ రకాల పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న పేదల సంఖ్య పెరుగుతుండటం, మొదలైన గణనీయమైన వైరుధ్యాలను కలిగి ఉన్నాయి. అది భారతీయ ఆర్థిక రంగం నయా ఉదారవాద మార్పుకు లోనవుతున్న సందర్భం. కాబట్టి పట్టణాల మీద ప్రత్యేక దృష్టి కచ్చితంగా ఉండి తీరుతుంది.

## ఉదారీకరణ అనంతర యుగం

## జాతీయ అర్బన్ కమిషన్

చార్లెస్ కొరియా వంటి వ్యక్తుల సారధ్యంలో 1986లో జాతీయ అర్బన్ కమిషన్ ఏర్పడింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి భారతదేశంలో జరిగిన పట్టణీకరణ ప్రక్రియపై అర్బన్ కమిషన్ చాలా సమగ్రంగా సమీక్షించింది. ఈ క్రింది సిఫారసులను చేశారు :

329 కొత్త అభివృద్ధి కేంద్రాలను ప్రోత్సహించాలని కమిషన్ సిఫార్సు చేసింది. ఇప్పటికే ఉన్న పెద్ద మహానగరాలను బలోపేతం చేయడంపై దృష్టి పెట్టింది.

ఆర్థిక అభివృద్ధి ఆధారంగా నగరాలను జాతీయ ప్రాధాన్యతగల నగరాలు, రాష్ట్ర ప్రాధాన్యత కలిగిన నగరాలు, ప్రాదేశిక ప్రాధాన్యత కలిగిన పట్టణీకరణ ప్రాంతాలు, గ్రామీణ లోతట్టు ప్రాంతాలకు సేవలు అందిస్తున్న చిన్న పట్టణాలుగా

వర్గీకరించారు. మెట్రోపాలిటన్ కేంద్రాలలో వలసల రద్దీని తగ్గించడానికి చిన్న, మధ్యతరగతి స్థాయి పట్టణాలకు అవకాశాలు కల్పించాలని కూడా సిఫార్సు చేసింది.

ఈ సిఫార్సులలో నేషనల్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, నేషనల్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బ్యాంక్, స్మాల్ అర్బన్ బిజినెస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ అనే 3 బ్యాంకింగ్ సంస్థల ఏర్పాటు కూడా ఒకటి.

పట్టణ పునరుద్ధరణ అనేది తరువాతి కాలంలో జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎమ్ సంస్కరణల సమయంలో సంచలనంగా మారింది. స్మార్ట్ సిటీ మిషన్ కూడా సిఫార్సులలో భాగం.

ఆర్థికంగా లాభసాటిగా లేని భూమిని దశలవారీగా తగ్గించి, దాని స్థానంలో కొత్త అభివృద్ధిని ప్రవేశపెట్టాలనేది మరొక సిఫార్సు.

గ్లోబల్ టైపోలాజీలు, పెట్టుబడులకు మరింతగా వీలు కల్పించే సాంకేతికత కొత్త ప్రమాణంగా మారింది. పెద్ద పెద్ద సాంకేతిక నిపుణుల సలహాలతో పట్టణాల ప్రణాళికలు రూపొందించబడ్డాయి. ప్రశాంతత కలిగిన సమగ్ర పట్టణాల బదులుగా ప్రాజెక్ట్ ఆధారిత పట్టణాలు రూపుదిద్దుకున్నాయి.

పట్టణాలు అభివృద్ధికి ఇంజిన్లుగా పరిగణించబడ్డాయి. ప్రైవేటు ప్రాజెక్టుల పైన దృష్టితో పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు భూ చట్టాల్లో మార్పులు చేశారు.

నగర పాలనలో ముఖ్యమైన భాగంగా పరిగణించబడే ముఖ్య అవసరాలు వ్యాపార నమూనాగా రూపాంతరం చెందాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారుల సారథ్యంలో అభివృద్ధి నమూనా నగరంలో పెట్టుబడులను ఆకర్షించడంలో దృష్టి కేంద్రీకరించడం అనేది 90 దశకం తర్వాత చోటుచేసుకున్న అవరోధాలకు ముఖ్య కారణం.

గృహ నిర్మాణం, ఆఫీసు స్థలాలు, పాఠశాలలు, ఆసుపత్రులు మొదలైన డిమాండ్లను తీర్చడానికి చుట్టుపక్కల ఉన్న ఇతర పట్టణాలు, గ్రామాల బయటికి విస్తరించడం వల్ల వాటి పరిధి పెరిగింది. అందువల్ల, పెద్ద సంఖ్యలో చిన్న పట్టణాల విలీనం లేదా పెద్ద పట్టణ సముదాయాలలో వాటిని చేర్చడం మనం చూస్తున్నాము. 1991, 2001 మధ్య 221 పట్టణాలు ఆ విధంగా విలీనం చేయబడ్డాయి. ఇది 1981-91 దశాబ్దంతో పోలిస్తే రెండు రెట్లు ఎక్కువ.

ఈ కాలంలో భారతీయ నగరాల వృద్ధిపై ప్రపంచ దేశాల ప్రభావం కూడా గుర్తించదగ్గవి. 1991-2001 కాలంలో, ఆర్థిక వ్యవస్థ తలుపులు తెరవడం వల్ల పారిశ్రామిక రంగం, ఆర్థిక రంగాలపై నియంత్రణ సడలింపు అవసరం అయింది. అనేక మెట్రోపాలిటన్ ప్రాంతాలు అటువంటి మార్పులకు సాక్ష్యంగా మారాయి. అనేక

బిజినెస్ ప్రాసెస్ అవుట్‌సోర్సింగ్ (బిపిఓలు) నాలెడ్జ్ ప్రాసెస్ అవుట్ సోర్సింగ్ (కెపిఓలు) పరిశ్రమలకు పెద్ద నగరాల్లో ఆఫీస్ స్పేస్ అవసరం పెరిగింది. బిల్డింగ్ నిర్మాణాకృతులు, డిజైన్ల పైన కూడా ప్రపంచ పెట్టుబడి బలమైన ముద్ర చూడవచ్చు.

## పట్టణ పెట్టుబడి నమూనాలు

పట్టణ భారతదేశంలో పెట్టుబడిదారీ విధానాలు ఎలా ఉన్నాయి?

1995–2010 కాలానికి సంబంధించ సంగ్రహ లెక్కలను పరిశీలిస్తే ఒక ప్రత్యేక నమూనా మనకు కనపడుతుంది. పాత మునిసిపల్ కార్పొరేషన్ ప్రాంతాలతో కూడిన అనేక ప్రధాన నగరాల్లోని ముఖ్య ప్రాంతాలలో, ఎక్కడైతే మునిసిపల్ కార్పొరేషన్లు ఉన్నాయో, అక్కడ గణనీయమైన ప్రభుత్వ పెట్టుబడులు వచ్చాయి. అత్యధికంగా రాజధాని నగరం ఢిల్లీలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పెట్టుబడులు కలిపి మొత్తం పెట్టుబడిలో 60 శాతం ఉన్నాయి. కలకత్తా, మద్రాస్, హైదరాబాద్, అహ్మదాబాద్‌లలో దేశీయ వనరుల నుండి ప్రైవేట్ పెట్టుబడులు ప్రభుత్వ పెట్టుబడిని మించిపోయాయి.

విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిలో (FDI) ఎక్కువ భాగం ప్రధాన నగరాల్లోని పట్టణ ప్రాంతాలకు వెళ్లింది. ఉదాహరణకు, బెంగుళూరులో పాత ప్రధాన ప్రాంతాల కంటే అక్కడి శివారు ప్రాంతాలకు (సబర్బన్) ఎక్కువ భాగం లభించింది.

చిన్న మెట్రోపాలిటన్ ప్రాంతాలలో, ప్రైవేట్ పెట్టుబడి కన్నా ప్రభుత్వ పెట్టుబడి చాలా ముఖ్యమైనది.

1990ల నుండి ప్రైవేట్ మూలధనాన్ని ఆకర్షించడం పట్ల ఏర్పడ్డ వ్యామోహం, యుపిఏ–1 పాలనా కాలంలో కూడా పట్టణ సంస్కరణలు, స్మార్ట్ సిటీ మిషన్ వంటి రూపాలలో కొనసాగి, పట్టణ రంగంలో మన విధానాల మార్పుకు దారితీసింది. మూడు దశాబ్దాల సంస్కరణల తర్వాత కూడా, అర్బన్ ఫైనాన్స్ ప్రధానంగా ప్రభుత్వం నుండి వస్తున్నది. పట్టణ మూలధన వ్యయాలకు నిధులు సమకూర్చడానికి అవసరమైన ఆర్థిక వనరులు కేంద్ర, రాష్ట్ర, నగర ప్రభుత్వాల నుండి 48 శాతం, 24 శాతం, 15 శాతం వరుసగా తీసుకోబడ్డాయి. దీనితోపాటు ప్రైవేట్ పబ్లిక్ భాగస్వామ్య (PPP) ప్రాజెక్టులు 3 శాతం, వాణిజ్య రుణాలు 2 శాతం దోహదం చేస్తాయి.

పెరుగుతున్న జనాభా డిమాండ్లను తీర్చడానికి పట్టణ భారతదేశంలో

పెట్టుబడి కోసం దాదాపు 840 బిలియన్ కోట్ల డాలర్లు (రూ.70 లక్షలు కోట్లు) అవసరమవుతాయని ప్రపంచబ్యాంక్ అంచనా వేసింది. అంటే సంవత్సరానికి 55 బిలియన్ డాలర్లు అవసరమవుతాయి. ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలైన స్మార్ట్ సిటీ మిషన్, అమృత్ (AMRUT), పీఎంఏవై (PMAY) మొదలైన వాటికి కూడా ఐదేళ్ల కాలానికి రూ.2 లక్షల కోట్లకు మించి కేటాయించలేదు. డిమాండ్, సరఫరా మధ్య అంత గ్యాప్ ఉంటే ఎలా సరిపోతుంది?

**నివేదిక ప్రధాన ఉద్దేశ్యం – ప్రపంచ బ్యాంక్ నివేదికలో సూచించబడిన పరిష్కారాలు :** "భారత నగరాల ఆర్థిక పునాది, రుణ తీసుకోగల సామర్థ్యాన్ని మెరుగుపరచడం. నగరాలు తప్పనిసరిగా అద్భుతమైన ఆదాయ పునాదిని ఏర్పాటు చేసుకోవాలి. దానితోపాటు సేవలను అందించడానికి అయ్యే ఖర్చును తిరిగి రాబట్టుకోగలగాలి." సూటిగా చెప్పాలంటే, ఆస్తి పన్నులు, వినియోగదారు రుసుములు, సేవా ఛార్జీలు మొదలైనవాటిని పెంచడం దీని సారాంశం.

ఈ నివేదిక ఇప్పటికే ప్రభుత్వ ఆదాయంలో దాదాపు 85 శాతం నగరాల నుంచే వస్తుందని చెపుతూనే, అయినప్పటికీ అక్కడ నివసించే ప్రజలపైనే ఎక్కువ భారం మోపడంపై దృష్టి సారిస్తోంది.

## సిటీ ల్యాండ్‌స్కేప్ - ధనిక, పేదల నగరం

పట్టణం ల్యాండ్‌స్కేప్ అనేది– ఒకటి నిశ్చలమైనది, శాశ్వత పదార్థాలైన కాంక్రీటు, ఉక్కు, ఇటుక లతో దృఢంగా నిర్మితమైనది. మరోపక్క ప్లాస్టిక్, షీట్‌లు, వ్యర్థ లోహాలు ఇతర మిగిలిపోయిన పదార్థాలతో నిర్మించబడిన మురికివాడలతో తాత్కాలిక స్వభావం కలిగిన 'కైనటిక్ సిటీ' (చలనంలో ఉన్న నగరం). నగర రూపంలో కొత్త ద్వంద్వత్వం చోటుచేసుకుంది.

నగరం లోపల ఆర్థిక కార్యకలాపాల్లో మార్పులు ఆ నగరం కనిపించే తీరుపై ప్రధాన ప్రభావాన్ని చూపుతాయి. 1990ల నుండి తయారీ రంగం నుండి సేవ, సమాచార–ఆధారిత కార్యకలాపాలకు క్రమంగా జరిగిన మార్పు అనేక రకాలుగా ప్రభావం చూపుతుంది. టెక్స్‌టైల్ మిల్లులు, కర్మాగారాలు మూతపడటంతో యాజమాన్యం తమ భూములను బహిరంగ మార్కెట్‌లో విక్రయించడం వల్ల ప్రైవేట్ డెవలపర్లకు, గతంలో ప్రభుత్వం మాత్రమే నిర్వహించే ప్రాజెక్టులను అభివృద్ధి చేయడానికి నయా ఉదారవాద మార్గంలో అవకాశం కలిగింది. పట్టణ పునరాభివృద్ధికి

సంబంధించిన పెద్ద ప్రాజెక్టులు అన్ని ప్రాంతాలలోనూ జరుగుతున్నాయి. సరళీకరణ కాలం ప్రారంభ సంవత్సరాల్లో జరిగిన అత్యంత పేర్కొనదగ్గ మార్పులు; 608 ఎకరాలకు పైగా ముంబై మిల్లుల భూములు రియల్ ఎస్టేట్ కోసం ఇచ్చారు. కోల్‌కతాలోని బాటా ఫ్యాక్టరీలో 262 ఎకరాలు, సీమెన్స్ ప్లాంట్ భూమి 61ఎకరాలు, ఉషా ఫ్యాన్స్ 31 ఎకరాలు ఇందులో భాగమే. తర్వాత ఈ నగరం సౌత్ సిటీగా మార్చబడింది. నగరంలోని ఏడు ప్రముఖ ప్రైవేట్ డెవలపర్స్ కన్సార్టియం ద్వారా రిటైల్, అధిక-ఆదాయ వర్గాల నివాస సముదాయాన్ని ఒక దగ్గరికి (సమీకృతం) చేర్చింది.

అందువల్ల సమకాలీన భారతీయ నగరాలు జెంట్రిఫికేషన్, అనధికారిక రెండు ప్రక్రియల సంయుక్త రూపాన్ని కలిగి ఉంటాయి. పాత ప్రదేశాలు (నగరాలు) ప్రత్యేకించి గతంలో ఉత్పాదక కేంద్రాలుగా ఉన్నవాటిని షాపింగ్ సెంటర్లు, కార్యాలయ సముదాయాలు,మధ్య ఉన్నత ఆదాయ వర్గాల నివాస ప్రాంతాలుగా మార్చబడుతున్నాయి. తద్వారా పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ భౌగోళిక ప్రాంత భాగం ఉన్నత వర్గాలచే ఆక్రమించబడింది. మరోపక్క నగరం, దాని పరిసర ప్రాంతాలు పేద మధ్యతరగతి ప్రజల నివాస, పని ప్రదేశాల అవసరాల కోసం కేటాయించబడింది.

## సామాజిక వాతావరణం

భారతీయ నగరాల సామాజిక వాతావరణం గతకాలపు కొనసాగింపు, వర్తమానపు మార్పు రెండింటినీ కలిగి ఉంది. నగరవాసులు తమను ఇతరులతో పోల్చి చూసే విధానంలో మనం దీనిని గమనిస్తాము. ఒకవైపు, చారిత్రాత్మకంగా వెనుకబడిన సామాజిక-ప్రాదేశిక వెలివేత సమకాలీన భారతీయ నగరం యొక్క లక్షణంగా కొనసాగుతూనే ఉంది. మరోవైపు నిరంతర చలనశీలత, వలసలతో కూడిన కొత్త నమూనా పాత పద్ధతుల పట్టు నుండి బయటపడి, కొంతమందికి సామాజిక అవకాశాలను విస్తృతం చేస్తున్నాయి. వీరిలో ఇతర రాష్ట్రాల నుండి లేదా రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన చదువుకున్న, నైపుణ్యం కలిగిన వలసదారులు ఉన్నారు.

మాతృభాష, జన్మస్థలం, కులం, మతం వంటి పుట్టుకతో సంక్రమించిన గుర్తింపు ఆధారిత లక్షణాలు పేదలకు, అట్టడుగు వర్గాల జీవితాలలో ప్రభావం చూపుతాయి. వారు మురికివాడలు, పేద నివాస ప్రాంతాలలో, సరైన వసతులు లేని ప్రాంతాలలో విభిన్న క్లస్టర్లలో (సమూహాలు) నివసిస్తున్నారు. ఎస్సీలు, ఎస్టీలు, ముస్లింలు ఈ వర్గంలోకి వస్తారు. వారి నివాస ప్రాంతాలను చూస్తేనే ఈ వెలివేత, మినహాయింపు

మనకు కనిపిస్తుంది.

వెనుకబడిన వర్గాల పరిసరాల్లో పెరుగుతున్న పిల్లలు, యువకులలో పాఠశాల విద్య, తల్లిదండ్రుల చదువు, ఇంటి ఖర్చులతో పోలిస్తే చాలా తక్కువగా ఉంది.

భారతదేశంలో అభివృద్ధికి దూరంగా విసిరివేయబడిన నివాసాలలో జీవిస్తున్న అట్టడుగు వర్గాలకు కనీస వసతులు కల్పనలో అసమానత కూడా వారు ఎదుర్కొంటున్న ప్రతికూలతలకు ముఖ్య కారణంగా చెప్పవచ్చు.

భారతదేశంలో వేగంగా అభివృద్ధికి దోహదపడుతున్న ఇంజన్లుగా కనపడుతున్నప్పటికీ, ఎక్కువ శాతం గ్రామీణ భారతంలోని కులం, మతం మొదలైన పాత ఆచారాలు, ప్రభావాలతో ఉన్నాయి.

## బహిర్గతమైన నయా - ఉదారవాద పట్టణీకరణ డొల్లతనం

2020 మార్చి 24 నుండి ప్రారంభమై రెండు నెలలకు పైగా కొనసాగిన లాక్డౌన్ కాలం పట్టణ భారతదేశం భయానక వాస్తవాలను బయటపెట్టింది. ఇది భారతదేశంలోని పట్టణీకరణ పునాదినే సవాలు చేసింది. నిర్దిష్ట కాల వ్యవధిలో నగరాలు అత్యంత మినహాయింపులతో కూడినవని, పట్టణీకరణ నమూనా అంటే పట్టణ ప్రణాళిక పాలన నిలకడలేనిదని ఈకాలం రుజువు చేసింది.

లాక్‌డౌన్ ప్రకటించిన వెంటనే, సహజంగానే లక్షలాది మంది వలస కార్మికులు గ్రామాలలోని తమ ఇళ్లకు తిరిగి వెళ్లడం ప్రారంభించారు. వారిలో కొందరు గుంపులుగా వారాల తరబడి నడిచారు. నగరాల్లోనే ఉండడం వల్ల ఆకలితో చనిపోతామని వారికి తెలుసు. అందుకే వారు తమ ఇళ్ళకి తిరుగు ప్రయాణాన్ని మొదలెట్టారు.

కనీసం కొన్ని రోజులు లేదా వారాలు కూడా నగరాలు తమ కార్మికులను వెళ్లకుండా ఎందుకు అపలేకపోయాయి? ఈ కార్మికులే కదా ఈ నగరాలు, రోడ్లు, ఉద్యానవనాలు, భవనాలు, ధనికుల కోసం మెరుగుపెట్టిన వజ్రాలు, బట్టలు నేయడం, ఆహారం అందించడం మొదలైన వాటిని నిర్మించారు? కేవలం కరోనా వైరస్ భయం కారణంగానే వారు తిరిగి వెళ్లిపోవాలని వీధుల్లోకి వచ్చారు; ఆ విధంగా వారి నిస్సహాయత వారు వ్యాధి బారినపడే అవకాశాన్ని మరింత తీవ్రతరం చేసింది. లేదా, అటువంటి 'రివర్స్ మైగ్రేషన్ మార్చ్'కి నగర అభివృద్ధి నమూనా విపరీతమైన ప్రవృత్తి కారణమా?

సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎమ్ఐఇ) ఒక నివేదికను విడుదల చేసింది. ఇందులో రెండు ముఖ్యమైన విషయాలు ఉన్నాయి. మొదటిది, కోవిడ్–19 లాక్‌డౌన్ సమయంలో పట్టణ నిరుద్యోగిత రేటు 27 శాతానికి పెరిగింది. దాదాపు 120 మిలియన్ల ఉద్యోగాలు పోయాయి. ఇక రెండవ విషయంలో ఎక్కువ చిక్కులు ఉన్నాయి. నివేదికలోని ఈ భాగం పట్టణ కార్మికుల 'పని చేసేందుకు ఇష్టపడే' రేటుని తీసుకుంది. ఈ రేటు దాదాపు 70 శాతం నుంచి 34 శాతానికి పడిపోయింది. ఇప్పుడు ఇది మరింత ప్రమాదకరంగా ఉంది. పట్టణ కేంద్రాల్లోని చాలా మంది వలస కార్మికులు కేవలం నగరాల్లోనే ఉండి పని చేయాలనుకోవడం లేదు. తిరిగి స్వగ్రామాలకు వెళ్లాలని నిశ్చయించుకున్నారు. "కలో గంజో తాగి బతకచ్చు కానీ నగరాలకు మాత్రం తిరిగి రాకూడదు" అని ఆ క్షణాన వారు భావించారు అనిపిస్తుంది. అంతర్లీనంగా ఉన్న వాస్తవం ఏమంటే, పట్టణాలలో పేదలు, అట్టడుగున ఉన్న వలస కార్మికులను ఆదుకోవడంలో భారత ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది.

స్థిరమైన పట్టణీకరణ, అందరికీ గృహాలు, స్మార్ట్ సిటీలు, సమ్మిళిత వృద్ధి మొదలైన వాటి కోసం గతంలో చేసిన హామీల డొల్లతనాన్ని బహిర్గతం చేస్తుంది.

అయితే మెరుగైన జీవన ప్రమాణాలు, మెరుగైన ఉపాధి, విద్య, ఆరోగ్య సంరక్షణ మొదలైన ఆశలను ఆకాంక్షలను కలిగించిన నగరాలు ఒక వర్గం (సమూహం) ప్రజల పట్ల న్యూనతాభావం, వివక్ష, ద్వేషం రేకెత్తించే ప్రాంతాలుగా ఎందుకు మారాయి?

దాని గురించి మరింత లోతుగా తెలుసుకునేందుకు ప్రయత్నిద్దాం. అందుకు గత కొన్ని దశాబ్దాలుగా భారతదేశంలో పట్టణీకరణ, నగర అభివృద్ధి ప్రక్రియను మనం అర్థం చేసుకోవాలి.

## ప్రజా అవసరాల (సరుకులు) వ్యాపారీకరణ

నయా ఉదారవాద అనంతర కాలంలో పెట్టుబడిదారీ విధానం అంతర్జాతీయ పెట్టుబడి ఆధిపత్య స్వభావాన్ని సంతరించుకుంటుంది. దీని వల్ల లాభాల గరిష్టీకరణ ఉత్పత్తి క్రమం నుండి మాత్రమే కాకుండా ఇతర మూలధన దోపిడీ నుండి కూడా జరుగుతుంది. గృహ రుణాలను పెంచటం, సేవలను సరుకుగా మార్చడం వంటి మార్గాల ద్వారా కూడా ఆర్థికపరమైన దోపిడీ జరుగుతుంది.

ప్రపంచవ్యాప్తంగా మూడు దశాబ్దాల కాలంలో కొన్ని పెద్ద అంతర్జాతీయ కార్పొరేషన్ల పోర్ట్‌ఫోలియోలో ప్రధానంగా జరిగిన మార్పు, వారు తమ పెట్టుబడులను ఫైనాన్స్ నుండి అవసరాలు, సేవలకు మార్చారు. కొన్ని ముఖ్యమైన సేవలను అందిస్తున్న నగరాలను బలవంతంగా ఆ బాధ్యతల నుండి తప్పించడం, లేదా వారు ఆ పని చేయలేని విధంగా బలహీనపరచి, తద్వారా పెద్ద టిఎన్‌సిల ద్వారా ఆ సేవలు అమలుకు రంగం ఏర్పరిచారు. పెట్టుబడి సంచయం లేదా మిగులు ఉత్పత్తిలో అధిక భాగం ఈ రూపంలో ఏర్పడుతుంది. నగరాలు ఈ పనిని సులభతరం చేస్తున్నాయి.

విద్య, ఆరోగ్యం, సమాచార సాంకేతికత (IT) మొదలైన ప్రాథమిక సేవలను సరుకుగా మార్చడం దీనికి ఉదాహరణ. మిగులు విలువను భారీగా స్వాధీనం చేసుకోవడం ఈ చర్యలో మనకు కనబడుతుంది. (ఉర్సులా హ్యూస్ సోషలిస్ట్ రిజిస్టర్ పేజీ 65, 2019). కేంద్రీకరణ ప్రక్రియ వేగవంతమవుతున్నప్పుడు, వాస్తవానికి కొత్త ఉత్పత్తి, ఉపాధికల్పన వెనుకపట్టు పడుతుంది. కాబట్టి, మరో మాటలో చెప్పాలంటే, అతిపెద్ద టిఎన్‌సిలు తమ లాభాలను నిలబెట్టుకోవటానికి కారణం ఉత్పత్తి కాదు. గతంలో ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని కబళించివేయటం అసలు కారణం.

2006 నాటికి 100 అతిపెద్ద టిఎన్‌సిలలో, 20శాతం సేవా రంగంలోకి వచ్చాయి. గతంలో ఇది కేవలం 7 శాతం (1997) ఉండేది. యునైటెడ్ కింగ్డమ్‌లో 2008లో అవుట్‌సోర్సింగ్ చేసిన పబ్లిక్ సర్వీసెస్ మొత్తం జీడీపీలో దాదాపు 6 శాతం వాటాను కలిగి ఉంది. ఇది పైన పేర్కొన్నట్టు 1997తో పోలిస్తే 126 శాతం పెరిగింది.

## పెరుగుతున్న అసంఘటిత రంగం

అసమానతను పెంచిన భారతీయ నగరాల్లో ఈ రకమైన అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తుంది. ఈ అభివృద్ధి రూపానికి అనుగుణంగా, ఈ కాలంలో కార్మికవర్గం వారి రాజకీయాలు చిన్నాభిన్నం చేయబడ్డాయి. ఉత్పాదక మరియు సామాజిక రంగాలు చిన్నచిన్న శాఖలుగా చేయబడ్డాయి. అనధికారిక రంగం, అనధికారికీకరణ నగర వ్యవహారాలను నిర్దేశిస్తోంది.

**ఎక్కువ భాగం భారతీయ నగరాలు క్రింది లక్షణాలను కలిగి ఉన్నాయి**

1. విధి లేని పరిస్థితుల్లో వలసలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. వ్యవసాయ సంక్షోభం జనాభా సాంద్రతను పెంచింది. సంఘటిత రంగంలో ఉద్యోగాలు పొందటానికి బదులు నిర్మాణ రంగం, రిక్షా పుల్లర్లు, వీధి వ్యాపారులు మొదలైన ఉపాధి అవకాశాలు వెతక్కునే దశకు నెట్టబడ్డారు.

2 పదకొండు మిలియన్ల మంది వ్యవస్థీకృత రంగాలైన కర్మాగారాల్లో ఉన్నారు. ఇతర సంఘటిత రంగాలలో 30 మిలియన్ల మంది, ప్రైవేట్ రంగంలో 12 మిలియన్ల మంది ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వ రంగంలో రెగ్యులర్ ఉపాధి 2 మిలియన్లు తగ్గిపోయింది.

3. పెద్ద సంఖ్యలో ఉన్న నిరుద్యోగ సైన్యం, వేతనాల పెంపుదలను అరికట్టేందుకు పాలకవర్గానికి తోడ్పడుతోంది. వారి లాభం మరింత పెంచడానికి ఇదొక మార్గం.

4. వేతనాలను తగ్గించేందుకు వివిధ పద్ధతులను ఉపయోగిస్తున్నారు. కార్మికులను మరింత దోచుకోవడానికి కొత్త చట్టాలు తెస్తున్నారు. లేదా పాతవాటికి సవరణలు చేస్తున్నారు. పారిశ్రామిక వివాదాల చట్టం, కార్మిక సంఘాల చట్టం తదితర చట్టాలను పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం నిర్వీర్యం చేస్తున్నారు. అదేవిధంగా, సెజ్‌లు, ప్రత్యేక పెట్టుబడి ప్రాంతాలు మొదలైన చోట్ల యూనియన్‌ల ఏర్పాటును నిషేధించాయి. దానికి అదనంగా తాజాగా కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాల్లోని కొన్ని నిబంధనలను తొలగించేందుకు నిర్ణయం తీసుకున్నాయి.

5. కార్మికవర్గంలో మార్పు ముసుగులో దోపిడి కోసం అనేక కొత్త పద్ధతులు అవలంబిస్తున్నారు.

   (అ) సంఘటిత రంగంలో కూడా భారీ ఔట్‌సోర్సింగ్‌ను అమలు చేస్తున్నారు. జాబ్ ట్రైనీలు, లాంగ్ టర్మ్ ట్రైనీ ఉద్యోగులు (ఎల్‌టిటిఇ) మొదలైన అనేక కొత్త కేటగిరీలు ఏర్పడ్డాయి. జపాన్‌లోని ఒక సంస్థలో 1,080 మంది ట్రైనీలు ఉండగా కేవలం 73 మంది పర్మినెంట్ కార్మికులు ఉన్నారు. 2011-12లో సంఘటిత రంగంలోని 77.5 శాతం మందికి యజమానితో వ్రాతపూర్వక ఒప్పందం లేదు. 2.43

శాతం మందికి కేవలం ఒక సంవత్సరం మాత్రమే కాంట్రాక్టు ఉంది. మహిళా కార్మికుల పరిస్థితి దారుణంగా ఉంది. 91శాతం మందికి వ్రాతపూర్వక ఒప్పందం లేదు. సంఘటిత రంగంలో అనధికారికీకరణ (ఇన్ఫార్మలైజషన్) గణనీయంగా పెరిగింది. 2003-04 నుండి 2009-10 వరకు నేరుగా ఉపాధి పొందుతున్న కార్మికుల వాటా 5.4 శాతం పెరిగింది. అయితే కాంట్రాక్ట్ కార్మికుల వాటా 12.4 శాతంకి పెరిగింది ఇప్పుడు అది 30 శాతం పైగా ఉంది. ఔట్‌సోర్సింగ్ అనేది అధికారిక రంగంలో సర్వసాధారణంగా మారింది.

(ఆ) **అసంఘటిత రంగం :** ఇది మొత్తం కార్మికులలో 94 శాతం. ఇందులో వ్యవసాయ కార్మికులు కూడా ఉన్నారు. వారి పని వారి నైపుణ్యం, లింగం, కులం, పని స్థలం మొదలైనవాటిలో భిన్నంగా ఉంటుంది. అసంఘటిత రంగ కార్మికులకు వారి వేతనాలకు సంబంధించి చాలా తక్కువ రక్షణ ఉంటుంది. 2011-12లో 93 శాతం మంది క్యాజువల్ కార్మికులు సామాజిక భద్రతా ప్రయోజనాలకు అర్హులు కాదు. ఆరోగ్య సేవల ప్రైవేటీకరణ కారణంగా ఈ తరగతి కార్మికులు పెద్ద ఎత్తున అప్పులపాలయ్యారు.

(ఇ) గృహ ఆధారిత కార్మికులు, స్వయం ఉపాధి కార్మికులు, స్కీమ్ కార్మికులు అందరూ పాక్షికంగా ఉపాధి పొందుతున్నారు.

## పెరుగుతున్న అసమానతలు

భారతదేశంలో పట్టణ ప్రాంతాలలో ధనికులు, పేదల మధ్య కొంత కాలం పాటు అంతరం పెరిగింది. ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం, రెండేళ్ల క్రితం, గ్రామీణ భారతదేశంలోని ఎగువ 10 శాతం ధనవంతులు, దిగువ10 శాతం మధ్య వ్యత్యాసం 500 రెట్లు ఉంటే, పట్టణ భారతదేశంలో ఇది 50,000 రెట్లు ఎక్కువ. దేశంలో కేవలం 52 మంది వద్ద ఉన్న సంపద దేశం మొత్తం బడ్జెట్‌కు సమానం.

నగరాల్లో అసమానతలను ఎక్కువ చేసిన మూడు ప్రధాన అంశాలు ఉన్నాయి. మొదటిది, బేరసారాలాడేందుకు, కోల్పోయిన హక్కులను తిరిగి పొందేందుకు నగరాల్లో శ్రామిక ప్రజల సామర్థ్యాన్ని తగ్గించడం. రెండవది, ఆరోగ్యం, విద్య మొదలైన అవసరాలు, సేవల ప్రైవేటీకరణ. మూడవది శ్రామిక ప్రజలకు గృహనిర్మాణం కలగానే మిగిలిపోవటం.

పైన పేర్కొన్నట్లు, యజమాన్యం మరియు ప్రభుత్వంతో కార్మికుల బేరసారాల సామర్థ్యం గతంతో పోలిస్తే గణనీయంగా తగ్గింది. అజీజ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం ప్రచురించిన ఒక నివేదికలో, నగరాల్లో కార్మికుల ప్రమాదకరమైన పరిస్థితి ప్రముఖంగా చెప్పబడింది. "గత మూడు దశాబ్దాలలో దేశంలో ఉత్పత్తి చేయబడిన మొత్తం సంపదలో భారీ పెరుగుదల ఉంది. నగరాలు దానిలో దాదాపు 70శాతం వాటా కలిగి ఉన్నాయి. అయితే, వివిధ సామాజిక భద్రతల రూపంలో ఈ సంపద పంపిణీ బలహీనపడింది." అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటీ సెంటర్ ఫర్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ నివేదిక ప్రకారం, సాధారణ వేతన జీవులలో 57 శాతం కంటే ఎక్కువ మంది నెలకు రూ.10,000 కంటే తక్కువ సంపాదిస్తున్నారు. దాదాపు 59.3 శాతం మంది క్యాజువల్ కార్మికులు రూ. 5,000 లోపు వేతనం పొందుతున్నారు. రూ. 5,001–7,500 మధ్య వేతనానికి మరో 25 శాతం కలిపితే, దాదాపు 84.3 శాతం మంది క్యాజువల్ కార్మికులు రూ. 7,500 కంటే తక్కువ వేతనం పొందుతున్నారు." ఇది స్థిరమైన నగర అభివృద్ధి నమూనా కాదు. అసాధారణ అధిక అసమానతలకు దారితీసేందుకు తోడ్పడుతుంది.

ఆరోగ్యం, విద్య కొన్ని ఇతర సామాజిక భద్రతా సేవలు కూడా పట్టణ కార్మికుల పొదుపు సొమ్ము నుండి దోచుకున్నాయి. ముఖ్యంగా ఆరోగ్య రంగం బలహీనంగా మారింది. 2012–13లో ప్రజారోగ్యంపై ప్రభుత్వం ఖర్చుపెట్టింది జిడిపిలో 1.04 శాతం కన్నా తక్కువ. మధ్య ఆదాయ దేశాల సగటు కంటే కూడా ఇది చాలా తక్కువ. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుఓ) కనీసం 5 శాతం ఉండాలని సిఫార్సు చేసింది. మొత్తంమీద, ప్రజారోగ్య రంగం నిర్లక్ష్య స్థితిలో ఉంది. అయితే ప్రైవేట్ రంగం 80 శాతం ఔట్ పేషెంట్, 60 శాతం ఇన్ పేషెంట్ కేర్‌ను కలిగి ఉండి, భారతదేశాన్ని ప్రపంచంలోనే అత్యంత ప్రైవేటీకరించబడిన వ్యవస్థలలో ఒకటిగా చేసింది (ఎన్ఎస్ఎస్ఓ 2006). ఆరోగ్య సంరక్షణ కోసం జేబు ఖర్చుల భారాన్ని తగ్గించడానికి పబ్లిక్ రంగంలో ఫైనాన్స్ చేయబడిన ఆరోగ్య బీమా పథకాలు రూపొందించబడ్డాయి, అయితే ఈ కార్యక్రమాలు ప్రైవేట్ కంపెనీలు ఈ సదుపాయాన్ని ఉపయోగించుకునేందుకు బాహాటంగా అనుమతులు ఇచ్చాయి. ఆరోగ్య రంగం మూల ఉద్దేశ్యాన్ని పక్కదోవ పట్టిస్తూ, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణను నిర్లక్ష్యం చేస్తూ, ప్రైవేట్ ఆసుపత్రులు ఈ పబ్లిక్ ఫండింగ్ స్కీమ్‌ల నుండి ఎక్కువ ప్రయోజనం పొందుతున్నాయి. ఆరోగ్య బీమా లక్ష్యం రోగులను విపత్కర రోగాల నుండి రక్షించటం. కానీ వాస్తవంలో అమలు చాలా బలహీనంగా ఉంది.

కార్పొరేట్ ఆసుపత్రులు పుట్టగొడుగుల్లా పుట్టుకురావడం ఆరోగ్య సేవలను ప్రైవేట్ రంగానికి స్వాధీనం చేసారనేదానికి ఒక స్పష్టమైన ఉదాహరణ. ఇటీవలి సంవత్సరాలలో చెయిన్ హాస్పిటల్ ఆదాయాలు విపరీతంగా పెరిగాయి. ఉదాహరణకు, భారతదేశంలో అతిపెద్ద కార్పొరేట్ చైన్ అపోలో హాస్పిటల్ దేశవ్యాప్త ఆదాయం 2009లో రూ.16.1 బిలియన్ల నుండి 2012లో రూ. 31.5 బిలియన్లకు పెరిగింది (సుమారు 295 నుండి 580 మిలియన్ల అమెరికన్ డాలర్లు). కార్పొరేట్–స్నేహపూర్వక నిబంధనల ద్వారా ఒప్పందం నియమాలు ప్రజారోగ్యాన్ని ప్రోత్సహించటానికి బదులుగా కార్పొరేట్ల లాభాపేక్షను సాధ్యం చేసేందుకు అనుగుణంగా మారాయి.

అత్యధిక లాభాలను పొందేందుకు ఆరోగ్య రంగం ప్రాథమిక రంగాలలో ఒకటిగా మారుతోంది. విచారకరమైన అంశం ఏమిటంటే, పెద్ద సంఖ్యలో అవుట్‌డోర్, ఇండోర్ పేషెంట్లు ఉన్నప్పటికీ, మహమ్మారి సంక్షోభాన్ని ఎదుర్కోవలసి వచ్చినప్పుడు ప్రైవేట్ ఆరోగ్య రంగం పూర్తిగా చేతులెత్తేసింది.

90వ దశకం తరువాత, ప్రీ–స్కూల్ నుండి విశ్వవిద్యాలయం వరకు విద్యారంగం ప్రైవేట్ పెట్టుబడుల వేటకు బరిగా మారింది. ప్రయివేటు రంగంలో మూలధన సమీకరణకు, మధ్యతరగతి పేద వర్గాలను దోచుకోవడానికి ఇది ఒక ముఖ్యమైన కేంద్రంగా మారింది. ఇప్పుడు నూతన విద్యా విధానం ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేస్తోంది.

అదేవిధంగా, అత్యవసర సేవలపైన విధిస్తున్న సర్వీసు ఛార్జీలు తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. పట్టణ కార్మికులు ఆస్తులు తాకట్టుపెట్టుకుని జీవితం గడపవలసి వస్తోంది.

ఉదాహరణకు ప్రత్యక్ష, పరోక్ష నీటి ప్రైవేటీకరణను తీసుకోండి. పట్టణ సంస్కరణల ప్రక్రియలో, నగర ప్రభుత్వాలు వారి పౌరుల నీటి ఉత్పత్తి ఖర్చును భరించవలసి ఉంటుంది. నీటి ఉత్పత్తి ఖర్చు నగరం నుండి నగరానికి మారుతూ ఉంటుంది. దీని ధర ఒక పట్టణంలో కిలో లీటరుకు రూ. 10 ఉండవచ్చు. అదే పర్వత ప్రాంత పట్టణంలో ధర కిలో లీటరుకు రూ. 150కి కూడా పెరగవచ్చు. పౌరులు ఇంత భారీ ఖర్చును భరించడం అసాధ్యం. ఫలితంగా నీటి లభ్యతలో కూడా భారీ అసమానత ఏర్పడుతుంది. నీటి వినియోగంలో ప్రైవేటీకరణ, వ్యయ పెరుగుదల మరొక రూపం ఉంది. అది నీటిని శుద్ధి చేసే గృహోపకరణాలు, ఆర్ఓలు మొదలైనవాటిని విక్రయించే వ్యాపారం. ప్రతి ఇంటికి ఆరోగ్యకరమైన తాగునీటిని అందించటం ఆయా మునిసిపాలిటీల బాధ్యత అయినప్పటికీ, ఈనాటికీ అది ఒక

సమస్యగానే ఉండటంతో నీటి వ్యాపారం చేస్తున్న కంపెనీలు భారీ లాభాలను కూడగట్టుకుంటున్నాయి.

ఢిల్లీ నగరంలో నిర్వహించిన ఒక సర్వే ప్రకారం ఆర్ఓ వ్యాపారం సంవత్సరానికి రూ. 2,500 కోట్ల వరకు ఉంది. త్రాగునీటిని అందించే బాధ్యత నిత్యావసర సేవల కిందికి వస్తుంది. దీనిని అధికారకంగా పూర్తి స్థాయిలో అమలుచేసినట్లయితే, ప్రజల నుండి ఉత్పత్తి అయిన భారీ సంపదను ఆదా చేసుకోవచ్చు.

నగరాలు క్రమబద్ధంగా (నిలకడగా) అభివృద్ధి చెందకపోవటానికి మరో కారణం (లక్షణం) అక్కడి నివాస ప్రాంతాలు(హాబిటెట్). నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానంలో గృహ నిర్మాణం అనేది సార్వత్రిక హక్కుగా మారని ఒక సరుకు.

క్విటోలో 2016లో జరిగిన సదస్సులో జాతీయ, నగర ప్రభుత్వాలు "సరైన సంఖ్యలో గృహాల హక్కుపై కొత్త అర్బన్ ఎజెండా"ని ఆమోదిస్తూ పెద్ద ప్రకటనలు చేశాయి. కానీ వాస్తవం దీనికి భిన్నంగా ఉంది. ఎజెండాలోని 31వ పేరాలో ఈ విధంగా చెప్పబడింది : "సరైన జీవన ప్రమాణాల హక్కులో భాగంగా అందరికీ సరిపడా గృహాలు పొందే హక్కు అభివృద్ధికరమైన సాధనకు మద్దతు ఇచ్చే జాతీయ, ఉప-జాతీయ, స్థానిక గృహ విధానాలను ప్రోత్సహించడానికి మేము కట్టుబడి ఉన్నాము. అన్ని రకాల వివక్ష మరియు హింస, ఏకపక్ష బలవంతపు తొలగింపులను నిరోధించడం, నిరాశ్రయులైన వ్యక్తులు, నిస్సహాయ వ్యక్తులు, తక్కువ ఆదాయ వర్గాలు, వికలాంగుల అవసరాలపై దృష్టి సారిస్తాము. ఈ ప్రణాళిక అమలుకు జాతీయ చట్టాలు, ప్రమాణాల కనుగుణంగా కమ్యూనిటీలు, సంబంధిత లబ్ధిదారులను భాగస్వాములను చేయటం, పని కల్పించటం, నివాసాల సామాజిక ఉత్పత్తికి మద్దతు ఇవ్వడంతో సహా ఈ విధానాలను అమలు చేస్తాము."

## జెంట్రిఫికేషన్ మరొక రకమైన మినహాయింపు

జెంట్రిఫికేషన్ అనేది అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాలలోని నగరాలకు సుపరిచితమైన ప్రక్రియ. ఇది సాధారణంగా ధనిక బయటి వ్యక్తుల ద్వారా పేద వర్గాలను స్థానభ్రంశం చేయడంతో ముడిపడి ఉంటుంది. ధనవంతులు పొరుగు ప్రాంతాలకు వెళ్లడంతో, అద్దెలు, ఆస్తి విలువలలో పెరుగుదల, పొరుగువారి స్వభావం మరియు సంస్కృతిలో మార్పులు వచ్చాయి.

నేటి నగర ప్రణాళిక, అభివృద్ధి వేగంగా నవీకరణకు దారితీస్తోంది. తద్వారా సామాన్య ప్రజలకు, కార్మికులకు, ప్రత్యేకించి అనధికారిక రంగానికి గృహవసతి అందుబాటులో లేకుండా చేస్తోంది. ప్రధానంగా ఈ కారణంగానే మురికివాడల్లో నివసించే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. భారతదేశంలోని ప్రధాన మెట్రో నగరాలు, అనేక మొదటి, రెండవ శ్రేణి నగరాలలో మురికివాడల్లో నివసించే ప్రజలలో అధిక సంఖ్యలో ఉన్నారు. నగర జనాభాలో 25 శాతం నుండి 45 శాతం వరకు మురికివాడల్లో నివసిస్తున్నారు.

పబ్లిక్ భవనాలు, తక్కువ ధర సామాజిక గృహాలను రూపొందించడానికి వాస్తుశిల్పులను పోటీ ద్వారా అనుమతించిన భారతీయ వ్యవస్థ, పట్టణ రూపకల్పనకు మాత్రం ఎటువంటి ప్రమాణాలు పాటించకుండా బిల్డర్‌లకు ప్లాట్‌లను వేలం వేసే ప్రక్రియకు అప్పగించింది. దీనివల్ల అస్తవ్యస్తంగా అభివృద్ధి జరిగింది. దురదృష్టవశాత్తు, భారతదేశంలో నగర ప్రణాళికను ఎక్కువగా అంతర్జాతీయ కిరాయి కన్సల్టెన్సీ సంస్థలకు అప్పగించారు. వీరికి స్థానిక సమస్యలపై అవగాహన తక్కువ.

నవీకరణ (జెంట్రిఫికేషన్) అనేది పట్టణ పరిసరాలలో మూలధనాన్ని తిరిగి పెట్టుబడి పెట్టే ప్రక్రియ. పేద నివాసితులు, వారి సాంస్కృతిక ఉత్పత్తులు తొలగించబడి, వాటి స్థానంలో ధనవంతులు, వారి సౌందర్య పిపాస, సౌకర్యాలు చోటుచేసుకుంటాయి. పట్టణ మూలధన సంచితానికి రెండవ వనరుగా ఉన్న రియల్ ఎస్టేట్ ద్వితీయ స్థానం నుండి ప్రాథమిక స్థానంలోకి మారింది. ఈ మార్పే జెంట్రిఫికేషన్ యొక్క పుట్టుక.

భారతదేశంలో మూలధనం పోగుపడటం అనేది నిర్మూలన ప్రక్రియ ద్వారా జరుగుతుంది. పేదలను మురికివాడల నుండి తొలగించడం, ప్రజా ప్రయోజనాల కోసం ఉద్దేశించిన భూమిని రియల్ ఎస్టేట్ అభివృద్ధికి మార్చడం ప్రధాన సమస్యలు. ఉదాహరణకు ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాచరణ ప్రణాళికలో మార్పును ఉదాహరణగా తీసుకోండి:

1999లో డిడిఎ తన మొదటి వాణిజ్య వేలంపాటను ప్రారంభించింది, ఆదాయాన్ని సంపాదించడానికి, మూలధన పెట్టుబడులను ప్రోత్సహించడానికి ప్రజా ప్రయోజనాల కోసం సేకరించిన 'ఉపయోగంలో లేని' భూమిని (పార్కులు, ఖాళీ స్థలం) విక్రయించింది. 2000లో డిడిఎ తన ఫ్రీహోల్డ్ కన్వర్షన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది. ఇది లీజు హోల్డర్లు ఫ్రీహోల్డ్ హక్కులను పొందేందుకు

అనుమతించింది. తద్వారా ప్రైవేట్ ఆస్తి వ్యవస్థను ఏర్పాటు చేసింది. అంటే 1955లో డిడిఏ స్థాపించబడిన తరువాత మొదటిసారిగా భూమిని క్రమబద్ధీకరించని మార్కెట్‌లో కొనుగోలు చేసే, విక్రయించే వెసులుబాటు కల్పించింది. ఢిల్లీ మాస్టర్ ప్లాన్ 2007ను అప్డేట్ చేసే క్రమంలో, సమాజీకరించిన భూమి అమ్మకాల పాలసీలో పేర్కొన్నవిధంగా పట్టణ పేదలకు రిజర్వేషన్లను తప్పనిసరిగా అమలుచేయాలనే భాగాలను తొలగించడం ద్వారా సాంఘిక భూమి విధానపు అవశేషాలు పుస్తకాలలో కూడా లేకుండా తుడిచిపెట్టేసింది. యాభై సంవత్సరాల క్రితం ఢిల్లీ లీజు, ఫైనాన్స్ అనే డెవలపర్ యొక్క స్పెకులేటివ్ పద్ధతులను నిరోధించడానికి డిడిఏ ఏర్పాటుచేయబడింది. డిఎల్ఎఫ్ గా పిలవబడుతున్న అదే కంపెనీ, నేడు ఢిల్లీలో (భారతదేశం మొత్తంలో) అతిపెద్ద డెవలపర్‌గా మారింది. ఢిల్లీ శివారు ప్రాంతాన్ని పబ్లిక్ సిటీగా నిర్ధారిస్తూ, ఇది భారతదేశం అంతటా 'ఊహాజనిత పట్టణీకరణ' చాలా సాధారణమైన విషయంగా ప్రచారంలోకి తెచ్చింది (గోల్డ్‌మాన్ , 2011)."

1990ల తర్వాత చోటుచేసుకున్న పరిణామాలలో ప్రజలకు గృహ సౌకర్యం అందించడంలో భారత ప్రభుత్వం పాత్రను పరిమితం చేసి, రియల్ ఎస్టేట్ రంగానికి పగ్గాలు అందించడం కూడా ఒకటి. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ డెవలప్‌మెంట్‌కు చెందిన ఎస్సార్ రవి శ్రీవాస్తవ అభిప్రాయం ప్రకారం, "ఏ అభివృద్ధి చెందిన దేశంలో అయినా కనీసం 25 శాతం గృహాలను పబ్లిక్ హౌసింగ్ ద్వారా అందించాలి. మిగతా 75 శాతానికి గృహనిర్మాణం ప్రైవేట్ లేదా అనధికారిక హౌసింగ్ మార్కెటింగ్ ద్వారా జరుగుతుంది. అయితే, భారత దేశం పరిస్థితి చాలా ప్రమాదకరంగా తయారైంది. అంతేకాక మోడీ పరిపాలనలో గత 6 సంవత్సరాలలో అధికారిక గృహ నిర్మాణాల సంఖ్య 6 శాతం నుండి 3 శాతానికి పడిపోయింది.

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ సెటిల్‌మెంట్స్ సంస్థకు చెందిన గౌతమ్ భాన్ అందించిన సమాచారం ప్రకారం, మురికివాడలలోని (స్లమ్స్) 95 శాతం ఇళ్ళు కూల్చివేయాల్సిన అవసరం లేదు. చిన్న మార్పు చేర్పులతో కొనసాగవచ్చు. ప్రభుత్వం నిజంగానే మురికివాడలను క్రమబద్ధీకరించాలని అనుకుంటే, నగరాల్లోని పేదల ఇండ్ల సమస్యకు గొప్ప పరిష్కారం లభిస్తుంది. ఒకసారి గుడిసేవాసులకు భూ యాజమాన్య హక్కులు కల్పించబడినట్లైతే, పట్టణ కార్మికుల ఆర్థిక పరిస్థితుల్లో తగినంత అభివృద్ధి జరుగుతుంది.

పట్టణ అనధికారిక కార్మికుల మరొక ముఖ్యమైన లక్షణం, వారిలో అత్యధికులు ఇల్లు కానీ, నిలువనీడలేని నిరాశ్రయులు. IGSSS (ఇండో గ్లోబల్ సోషల్ సర్వీస్ సొసైటీ) ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో, ఢిల్లీలోని షెల్టర్ కేంద్రాలలో తలదాచుకునేవారిలో 90-95 శాతం మంది  కార్మికులు. వీరు బిచ్చగాళ్ళు కాదు. వీరిలో ఎక్కువ మంది భవన నిర్మాణ కార్మికులు, ఆతిథ్యం (హాస్పిటాలిటీ)  ఇతర పీస్‌మీల్ కార్మికులు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన PMAY దాని లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైంది. పబ్లిక్ గృహ నిర్మాణాలకు ఇది ప్రత్యామ్నాయం కాదు.

అటువంటి పరిస్థితుల్లో, బలమైన నిర్ణయాత్మక చర్యలు లేకుండా, నగరం యొక్క స్థిరత్వం కాగితాలపైనే ఉంటుంది కానీ, ఎప్పటికీ వాస్తవంగా మారదు. పాలసీ ద్వారా నగర అభివృద్ధి ప్రక్రియను బలోపేతం చేయడంలో అందరినీ భాగస్వాములను చేయటం వల్ల,  విధాన నిర్ణయాలలో విస్తృతమైన అభిప్రాయాలు వస్తాయి.  'నగరం కోసం హక్కు', కేవలం జనాకర్షణ  నినాదం కాదు. ఇది కార్యాచరణ కోసం. ఎక్కడైతే నగర ప్రణాళిక, అభివృద్ధి భాగస్వామ్య పద్ధతిలో జరుగుతుందో, ఆస్తులపై దావా వేయడంతో పాటు పట్టణ స్థలాలను తిరిగి పొందడంలో ఒక సాధారణ నివాసి కూడా ప్రణాళిక ప్రక్రియలో భాగం అవుతాడో అప్పుడే కార్యాచరణ సాధ్యపడుతుంది.

# References


- Irfan Habib, Peoples History of India.
- Kosambi DD 1965, A History of Its Culture and Civilization
- Hamly Gavin RG 1984, Town and Cities, Mughal India
- Parasher Aloka, 1991 Social Structure and Economy of Settlements in Central Deccan 200 BC-Ad 200)
- Ramchandran R 1989, Urbanization and Urban Systems in India
- Shaw Annapurna 2009 Indian Cities in Transition
- Himangshu 2007, Urban Poverty in India
- Mukhopadhyay Partha, 2011, Formality and Functionality in Indian Cities.
- Brugmann Jeb, 2009, Welcome to the Urban Revolution

- Harvey David, The Rebel City
- Nair Janki, 2007, Bangalore’s Twentieth Century
- Roy Ananya, 2008, Calcutta Requiem
- Sivam Alpana Role of State and Market in Housing Delivery in India, 2002
- Urban Age, 2007, Housing Typologies in Mumbai
- Bhagat R B 2009, Emerging Pattern of Urbanization and contribution of Migration in Urban Growth in India
- Dupont Veronique, 2004, Socio-Spatial Differentiation and Residential Segregation in Delhi
- Dyson Tim 2004, Migration and Urbanization
- Kosambi Meera 1986, Bombay in Transition
- Singh DP 2009, Poverty and Migration
- Satterthwaite David, 2010, Upgrading Slums EPW
- Neetha N 2011, Closely Woven: Domestic work and internal migration of women in India.
- R.s Shama – Urban Decay in India (C300.C 100-)
- R.Champakalakshmi- Trade ideology and urbanization South India 300 Bc-1300AD
- Gordon Childe – The urban revolution.

# పట్టణ ప్రాంతంలో విధానాలు - సమస్యలు

## I

### పరిచయం

పట్టణీకరణ పెట్టుబడి పెరుగుదల, అభివృద్ధితో కలిసి ఉంటుంది. మనదేశ స్వాతంత్ర్యం తర్వాత పాలకవర్గాలు భూస్వామ్య సంబంధాలను పూర్తిగా తొలగించకుండానే, పెట్టుబడిదారీ విధానం అభివృద్ధికి తోడ్పడే విధంగా చట్టాలను తీసుకువచ్చారు.

ఈ రాజీ ప్రభావం పట్టణ కేంద్రాల పెరుగుదల, పట్టణీకరణ విధానాలతో సహా అనేక అంశాలపై ప్రభావం చూపించింది.

ఈ 75 సంవత్సరాలకు పైగా వివిధ ప్రభుత్వాలు పట్టణ విధానాలలో చేసిన మార్పు పాలక వర్గాల మారుతున్న అవసరాలను ప్రతిబింబిస్తుంది. ఈ విధానాలు పెట్టుబడిదారీ అభివృద్ధి చక్రం నుండి ఏర్పడ్డాయి. నేడు భారతదేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద పట్టణ వ్యవస్థ కలిగివుంది. ప్రపంచ పట్టణ జనాభాలో 11 శాతానికి పైగా మన దేశంలో నివసిస్తున్నారు.

ప్రారంభ సంవత్సరాల్లో ప్రభుత్వం మిశ్రమ ఆర్థిక వ్యవస్థ ద్వారా (కొన్ని సంక్షేమ విధానాలకు కట్టుబడి ఉంది) మొత్తం ఆర్థికాభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించింది. పట్టణ విధానాలలో కూడా ఈ దృక్పథం ప్రతిబింబించింది. ఈ ధోరణి 1980ల వరకు విస్తృతంగా కొనసాగింది. 1980ల నుండి, ప్రభుత్వం రుణం కోసం IMF ని సంప్రదించి, దాని షరతులను అంగీకరించిన అనంతరం క్రమంగా మార్పు రావటం మనం చూస్తున్నాము. ప్రభుత్వం బహిరంగంగా నయా ఉదారవాద విధానాల అమలును ప్రారంభించిన 1990ల నుండి ఈ మార్పు నిర్ణయాత్మక మలుపు తీసుకుంది.

మన దేశ స్వాతంత్ర్యం యావత్తు సమాజం యొక్క సర్వతోముఖాభివృద్ధికి దారితీస్తుందని ప్రారంభంలో పొడచూపిన ఆశలు, ఆనందం పాలకవర్గాలు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు దేశాన్ని మరింత లోతుగా సంక్షోభంలోకి నెట్టడంతో మసకబారడం ప్రారంభించాయి. సంక్షోభం నుండి బయటపడటానికి పాలకవర్గాలు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, మిశ్రమ ఆర్థిక వ్యవస్థ చట్రంలో దానిని పరిష్కరించడంలో విఫలమయ్యాయి. ఫలితంగా, నయా ఉదారవాదాన్ని ప్రవేశపెట్టారు. ఇది పెట్టుబడిదారీ సంక్షోభాన్ని పరిష్కరించడానికి బదులుగా, సంక్షోభాలను మరింత తీవ్రతరం చేసింది.

ప్రజల కలలు, ఆశలు మసకబారడంతో, వారు తమ పాలనను సవాలు చేయకుండా ఉండటం కోసం పాలక వర్గాలు విభజన శక్తుల పెరుగుదలను ప్రోత్సహించాయి. 1980ల నుండి చూసిన వివిధ వేర్పాటువాద ఉద్యమాలు – ఖలిస్థాన్, అస్సాం ఉద్యమం మొదలైన వాటితోపాటు హిందూత్వ మతతత్వ శక్తులు బలపడ్డాయి. ప్రధానంగా పట్టణ కేంద్రాలలో నివసించే మధ్యతరగతి ప్రజలు ఇటువంటి విభజన శక్తుల సైద్ధాంతిక ప్రభావాలకు లొంగిపోయారు. నయా ఉదారవాద విధానాలు వేగంగా అమలవుతున్న కాలం కూడా హిందూత్వ మతోన్మాద శక్తుల పెరుగుదలకు సాక్షిగా నిలిచింది. నయా ఉదారవాదం, మతతత్వం రెండూ పట్టణ కేంద్రాలలో గణనీయమైన మద్దతును పొందాయి.

## II

## అర్బన్ విధానం - స్వాతంత్ర్యం తర్వాత కాలం

వివిధ స్థాయిల పరిపాలనలో పట్టణ రంగంలోని విధానాలు, కార్యక్రమాల పరిణామాన్ని సమీక్షించినట్లయితే, ఒక సమయంలో గణనీయమైన మార్పులకు గురయ్యాయని అర్థమవుతుంది.

### మిశ్రమ ఆర్థిక వ్యవస్థ కాలం

మూడవ పంచవర్ష ప్రణాళికలో (1961–66) ప్రభుత్వం మొదటిసారిగా ఒక అర్బన్ ప్లానింగ్, ల్యాండ్ పాలసీని రూపొందించింది. భారీ, మధ్య తరహా, చిన్న పరిశ్రమల మధ్య, గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య 'సమతుల్య అభివృద్ధి' అనే సురక్షితమైన 'విస్తృత లక్ష్యం'తో ఈ విధానం రూపొందించబడింది.

నాల్గవ ప్రణాళిక (1969–74) కాలంలో హౌసింగ్, అర్బన్ డెవలప్‌మెంట్

కార్పొరేషన్ (HUDCO) స్థాపించబడింది. హడ్కో గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణం కోసం మెట్రోపాలిటన్ అధికారులు, రాష్ట్ర హౌసింగ్ బోర్డులు మరియు ఇతర పట్టణ సంస్థలకు అధికారులు, రాష్ట్ర హౌసింగ్ బోర్డులు, ఇతర పట్టణ సంస్థలకు నిధులను అందిస్తుంది.

పారిశ్రామిక కార్మిక వర్గానికి వసతి కల్పించడానికి పెద్ద నగరాల కోసం ఎక్కువ శాతం నిధులు కేటాయించబడ్డాయి. ఈ కాలంలో అనేక భారీ పట్టణ ప్రాజెక్టులు కూడా ప్రారంభించబడ్డాయి.

ఆరవ ప్రణాళిక జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్) అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి, ఢిల్లీ ప్రధాన ప్రాంతం నుండి ప్రాంతీయ పట్టణాలలోకి ఆర్థిక కార్యకలాపాలను విస్తరించేందుకు కేంద్రీకరించింది. ఆరవ ప్రణాళిక (1980–85) వరకు, పంచవర్ష ప్రణాళిక ప్రాథమికంగా హౌసింగ్, స్లమ్స్, పౌర సౌకర్యాల ఏర్పాటు మొదలైన సమస్యలను పరిష్కరించాయి.

## III

### ఎ. నయా ఉదారవాద కాలం : పరివర్తన -1980ల మధ్య నుండి 1990ల వరకు

ఏడవ, ఎనిమిదవ ప్రణాళికలు మునుపటి వాటికన్నా భిన్నంగా ఉన్నాయి. పట్టణాభివృద్ధిలో ప్రభుత్వ పాత్రకు సంబంధించి వారు తమ గత ప్రణాళికలకు భిన్నమైన వైఖరి తీసుకున్నారు.

పట్టణీకరణపై జాతీయ కమిషన్ (1986) అత్యున్నత స్థాయిలో ఏర్పాటైంది. ఇది మొదటిసారిగా, పెద్ద సంఖ్యలో ఆర్థికంగా ఊపందుకుంటున్న, ప్రాంతం రీత్యా ప్రాధాన్యత కలిగిన పట్టణ ప్రాంతాలను ఆర్థిక వృద్ధితో అనుసంధానించే అంశాన్ని ముందుకు తెచ్చేందుకు ప్రయత్నించింది. ఇది ఏడవ, ఎనిమిదవ ప్రణాళిక (1987–97)లో ప్రతిబింబిస్తుంది. ఉపాధి కల్పన, పేదరికాన్ని తగ్గించే లక్ష్యాలకు నేరుగా దోహదపడే పట్టణ విధానాలను పేర్కొంది.

ఏది ఏమైనప్పటికీ మార్కెట్ ఆధారిత దృక్పథంలో ప్రాథమిక సేవలను అందించడం, మునిసిపల్ ఆర్థిక వ్యవస్థలో ఖర్చుని తిరిగి రాబట్టే యంత్రాంగాన్ని ఏర్పాటు చేయటానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడింది.

## డెబ్బయి నాలుగవ సవరణ, 1992

స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం ఉద్దేశించిన 74వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా అభివృద్ధి ప్రణాళిక బాధ్యతల వికేంద్రీకరణ ప్రారంభించబడింది. ఏదేమైనప్పటికీ, అధికారాలను పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వాల సుముఖత, చొరవ అన్ని రాష్ట్రాలలోను గణనీయంగా మారుతూ వచ్చాయి. ప్రస్తుత మూలధన వ్యయాలను తీర్చడానికి వనరుల సమీకరణ బాధ్యత కొంతవరకు స్థానిక సంస్థలకు అప్పగించబడింది. ఒకవైపు ఈ సంస్థల ఆర్థిక మూలాన్ని, వనరులను పెంచే సామర్థ్యాన్ని, మరోవైపు వాటి అవసరాలను పరిశీలించకుండానే ఈ నిర్ణయం జరిగింది. ఫలితంగా స్థానిక సంస్థల తలసరి ఆదాయంలో అసమానతలు పెరిగాయి.

74వ సవరణ లేఖలో వికేంద్రీకరణను తీసుకువచ్చింది, కానీ స్ఫూర్తితో కాదు. ఖాదీలకు పరిమితమైన లేదా ఆర్థిక మరియు ఆర్థిక స్వయంప్రతిపత్తి లేని కారణంగా గ్రాంట్‌లపై ఆధారపడటం పెరుగుతోంది (2007–08లో 44 శాతం నుండి 2017–18లో 51 శాతానికి యుఎల్‌బిల ఆదాయ వాటా). యుఎల్‌బిలలో బలహీనమైన సంస్థాగత, ఆర్థిక సామర్థ్యాలు సర్వీస్ డెలివరీని ప్రభావితం చేస్తున్నాయి. యుఎల్‌బిలలో కేవలం 1 శాతం మాత్రమే పెట్టుబడి గ్రేడ్ క్రెడిట్ రేటింగ్ A- మరియు అంతకంటే ఎక్కువ (MHUA 2017) కలిగి ఉన్నాయి. జనాభా యొక్క పెరుగుతున్న డిమాండ్లను తీర్చడానికి పట్టణ భారతదేశంలో పెట్టుబడి కోసం దాదాపు 840 బిలియన్ డాలర్లు అవసరమవుతాయని మరియు సంవత్సరానికి 55 బిలియన్ డాలర్లు అవసరమవుతాయని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది.

## వామపక్ష ప్రభుత్వాల ఆధ్వర్యంలో వికేంద్రీకరణ

వామపక్ష ప్రభుత్వాలు మాత్రమే స్థానిక సంస్థలకు అధికారాల వికేంద్రీకరణకు కట్టుబడి ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం స్థానిక సంస్థలకు అధికారాల వికేంద్రీకరణ గురించి తెలియజేసే 73డి, 74వ సవరణల అమలుకు మార్గం చూపింది. ప్రణాళికా ప్రక్రియలో ప్రజలు పాలుపంచుకునే ఏకైక రాష్ట్రం కేరళ మాత్రమే. ఇక్కడ స్థానిక సంస్థలకు కొన్ని అధికారాలు ఉన్నాయి. వామపక్షాల నేతృత్వంలోని ప్రభుత్వాలు మాత్రమే రాజ్యాంగ సవరణలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నాయి. అభివృద్ధి కార్యక్రమాలలో అట్టడుగు స్థాయి ప్రజలను భాగస్వామ్యం చేయడంపై దృష్టి సారిస్తున్నాయి. దీని ప్రకారం రాష్ట్ర బడ్జెట్లలో అవసరమైన ఆర్థిక కేటాయింపులు జరిగాయి. స్థానిక సంస్థలకు కూడా సక్రమంగా

ఎన్నికలు జరిగేలా చూసుకున్నారు.

వికేంద్రీకృత పాలనా యుగంలో కేంద్ర లేదా రాష్ట్ర సహాయం తగ్గిపోవటంతో, చిన్న, మధ్యతరహా పట్టణాలు, ముఖ్యంగా తక్కువ అభివృద్ధి చెందిన రాష్ట్రాలలో, మౌలిక సదుపాయాలు, ప్రాథమిక సేవలను మెరుగుపరచడానికి ఎటువంటి పెట్టుబడి పెట్టలేకపోతున్నాయి. ఇది కొత్త ఆర్థిక కార్యకలాపాలను ఆకర్షించటంలోను, వలసదారులను పనిలో ఇముడ్చుకోవటంలోను వారి సామర్థ్యాన్ని తగ్గించింది. ప్రభుత్వ మద్దతును ఉపసంహరించుకోవడం, ఈ ఏజెన్సీలు కఠినమైన ఆర్థిక నిబంధనలతో మార్కెట్ రుణాలపై ఆధారపడేలా చేయడంతో పట్టణ ప్రాంత కేంద్రాలన్నిటిలో తీవ్రమైన అసమానతను, సమస్యలను సృష్టించాయి.

**పట్టణ సంస్కరణలు, బాహ్య నిధుల ఏజెన్సీలు**

ఆర్థికవనరుల లేమి సమస్యను పరిష్కరించడానికి, యుఎల్‌బిలు ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంకు, డిఎఫ్ఐడి మొదలైన బయటి ఏజెన్సీల నుండి రుణాలు తీసుకునే దిశగా నెట్టబడ్డాయి. ఈ ఏజెన్సీలు అప్పులు ఇవ్వటానికి కొన్ని అంతర్గత షరతులు విధించాయి. ఫలితంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పథకాలలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకున్నాయి. అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు సిఫార్సు చేసిన సంస్కరణల ఆనవాళ్లు కనిపించటం మొదలైంది. నయా ఉదారవాదానికి తెరతీస్తోందనటానికి ఇది ఒక సంకేతం.

తొమ్మిదవ, పదవ ప్రణాళికల అమలు సమయంలో పట్టణ రంగంలో బయటి సంస్థల సహాయం ప్రధాన అంశంగా మారింది. ప్రపంచ బ్యాంక్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి) వంటి బహుముఖ రుణ ఏజెన్సీలు, అనేక ద్వైపాక్షిక ఏజెన్సీలు ఇందులో కీలక పాత్రధారులు. ఇక్కడ కూడా వీళ్ళ ప్రాముఖ్యత మెట్రోపాలిటన్, ఇతర మొదటి తరగతి నగరాలు మాత్రమే.

తొమ్మిదవ ప్రణాళిక (1997- 2002)లో పట్టణ రంగంలో స్థూలఆర్థిక వృద్ధి అనే ఆలోచన తీసుకురాబడింది. ఇది మార్కెట్ సమర్థత సూత్రం ఆధారంగా ఒక వ్యూహాన్ని ప్రతిపాదించింది. ఇందులో నగరాలు వృద్ధి చోదకశక్తి (ఇంజిన్)గా పనిచేస్తాయి. బడ్జెట్ కేటాయింపులలో గణనీయమైన తగ్గింపుతో ఆర్థిక సంస్థలు, ప్రైవేట్ కార్పొరేట్ రంగం నుండి వనరులను సమీకరించడం ద్వారా మౌలిక సదుపాయాల అభివృద్ధిని కూడా ఇది ముందుకు తెచ్చింది.

పదవ ప్రణాళిక (2002-07) విస్తృత సంస్కరణల అవసరాన్ని నొక్కిచెప్పడం

ద్వారా ఈ దృక్పథాన్ని మరింత బలోపేతం చేసింది. సంస్కరణల ఎజెండాకు అనుగుణంగా దాని చాలా కార్యక్రమాలకు కేంద్ర సహాయం తప్పనిసరి అని నిర్దేశించింది.

పదకొండవ ప్రణాళిక (2007-12) దేశంలో ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణను, అలాగే ఇప్పటికే ఉన్న చిన్న, మధ్య తరహా పట్టణాల చుట్టూ కొత్త అభివృద్ధి కేంద్రాల ఏర్పాటును ప్రధాన సవాలుగా పేర్కొంది. జిడిపిలో 9-10శాతం వృద్ధి లక్ష్యాన్ని సాధించాలంటే భారతీయ నగరాలను మరింత ఆర్థిక కార్యకలాపాలకు, పోటీతత్వానికి అనుకూలంగా మార్చడంపై ఆధారపడి ఉంటుంది. భూమిపై నియంత్రణ సడలించడం, అభివృద్ధి చేయడం ద్వారా నగరాల సామర్థ్యం, ఉత్పాదకతను పెంచడంపై దృష్టి సారించాలని" పదకొండవ ప్రణాళిక పేర్కొంది. పట్టణ మౌలిక సదుపాయాలపై ప్రభుత్వ రంగ గుత్తాధిపత్యాన్ని తొలగించడం, ప్రైవేట్ రంగ పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించాలని ప్రతిపాదించింది.

**మునిసిపల్ బాండ్లు :** బెంగళూరు మునిసిపల్ కార్పొరేషన్ 1990లలో స్టేట్ గ్యారెంటీ మద్దతుతో బాండ్లను జారీ చేయడం ద్వారా నిధులను సేకరించిన మొట్టమొదటి మున్సిపల్ కార్పొరేషన్. దీని తర్వాత అహ్మదాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ 2002లో రాష్ట్ర హామీలు లేకుండా మునిసిపల్ బాండ్లను విడుదల చేసింది. మునిసిపల్ బాండ్ల ద్వారా యుఎల్‌బిల కోసం నిధులను సేకరించడం అప్పటి నుండి వేగవంతమైంది. ఇప్పుడు, ఒక ఖూదీ తనంతట తానుగా వనరులను సేకరించడంలో విఫలమైతే, నిధులను సేకరించేందుకు కేంద్ర ప్రభుత్వం వివిధ ఖూదీలను కలిపి బాండ్లను జారీ చేయాలని సూచించింది. తమిళనాడు, కర్నాటక మున్సిపాలిటీలకు నిధులు సమీకరించేందుకు ఇప్పటికే పూలింగ్ చేస్తున్నాయి. ఖూదీల స్థాయిలో బలమైన ఆర్థిక పరిపాలనా యంత్రాంగం ఆధారంగా మాత్రమే మున్సిపల్ బాండ్‌లు జారీ చేయబడతాయి. మునిసిపల్ బాండ్ల ద్వారా నిధులను సేకరించేందుకు, ఆర్థికంగా బలోపేతం కావడానికి, వాటి వాస్తవ ఖర్చులను తిరిగి పొందేందుకు సేవలకు ఆర్థికంగా ధర నిర్ణయించడం సిఫార్సు చేయబడింది.

**ప్రపంచ బ్యాంకు పట్టణ వ్యూహం**

పట్టణ ప్రాంతంలో ప్రపంచ బ్యాంకు మొదటి కీలక వ్యూహం నగరాల

ప్రణాళికా వ్యవస్థలను, నగర ఆస్తులు, పట్టణ పరిసరాల మెరుగైన రూపకల్పన ప్రణాళిక , నిర్వహణకు స్థానిక సామర్థ్యాన్ని బలోపేతం చేయడం. పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రధాన భూమిని 'విముక్తి' చేసి మార్కెట్‌కు అందుబాటులో ఉంచేలా హామీ ఇస్తుంది. యుఎల్‌బిలు తమ మాస్టర్ ప్లాన్‌లకు తగిన సవరణలు చేయడం ద్వారా అటువంటి భూమిని మానిటైజేషన్ చేసి, తద్వారా ఆదాయాన్ని సంపాదించుకోవాలి.

రెండవ వ్యూహం, ఆర్థిక వ్యవస్థలను మెరుగుపరచడం ద్వారా నగరాలకు ఆర్థిక వనరుల విస్తృతిని పెంచడం, మౌలిక సదుపాయాలు, సర్వీసు డెలివరీ ఫైనాన్సింగ్, పెట్టుబడి అవసరాలను తీర్చడానికి వీలు కల్పిస్తుంది. ప్రైవేట్ ఫైనాన్స్‌తో సహా పలు మార్గాల నుండి ఆర్థిక వెసులుబాటును విస్తరించడంలో నగరాలకు సహాయం చేయడానికి బ్యాంక్ మంచి స్థానంలో ఉంది. అయితే దీర్ఘకాలికంగా కొనసాగించగలిగే విధంగా ఆర్థిక సామర్థ్యం, వ్యవస్థలను బలోపేతం చేయడానికి, ప్రైవేట్ రంగ భాగస్వామ్యం, ఫైనాన్సింగ్ కోసం అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి తగిన నియంత్రణ చట్రాన్ని కూడా నిర్దేశిస్తుంది. వినియోగదారులు పొందే సేవలకు వారు చార్జీ చెల్లించాలి అనే సూత్రం ప్రకారం సర్వీసు ఛార్జీల సేకరణను కూడా సూచించింది. ఆర్థిక వనరులు పెంచడానికి ఆస్తి పన్నులను పెంచాలనే మరో సూచనను కూడా చేసింది.

కాలం చెల్లిన, స్థిరమైన మాస్టర్ ప్లాన్‌లు సర్వీస్డ్ ల్యాండ్ నిర్మాణయోగ్యమైన స్థలాల సప్లైను స్థిరీకరిస్తాయని, తద్వారా సమర్థవంతమైన ఉత్పాదక అభివృద్ధిని అడ్డుకుంటాయని ప్రపంచ బ్యాంక్ అభిప్రాయపడింది. భూ పరిమితి మరియు అద్దె నియంత్రణలను తొలగించడానికి ముఖ్యమైన చట్టాలు ఉపసంహరించబడినప్పటికీ, ఆ సంస్కరణలను అమలు చేయడానికి అనేక చట్టపరమైన సాధనాలు ఇప్పటికీ లేవని భావిస్తోంది.

మరీ ముఖ్యంగా, భూ మార్కెట్లు, నిబంధనలలో వైఫల్యాలు, దీనికితోడు గృహ ఫైనాన్స్‌కు పరిమిత అవకాశం ఉండటం ఫలితంగా మురికివాడల విస్తరణ ఎక్కువగా ఉందని ప్రపంచ బ్యాంక్ భావించింది. స్థిరమైన మాస్టర్ ప్లాన్‌లు, నిర్బంధ జోనింగ్ నిబంధనలు భవన నిర్మాణానికి అవసరమైన భూమి లభ్యతను పరిమితం చేస్తాయని, మారుతున్న అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందడానికి నగరాల సామర్థ్యాలను కట్టడి చేస్తాయని పేర్కొంది. కాబట్టి భూమిని విముక్తం చేసి దానిని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా బలహీనమైన ఫైనాన్సింగ్ ఫ్రేమ్‌వర్క్‌లు మురికివాడల్లోని సమస్యలను పరిష్కరించడానికి యుఎల్‌బిలు తమ వనరులను

సమర్థవంతంగా నిర్వహించగల సామర్థ్యాన్ని పరిమితం చేశాయనే వాదన ముసుగులో ప్రపంచ బ్యాంక్ ప్రతిపాదించిన ఒక ప్రధాన సంస్కరణ ఇది.

బ్యాంక్ ప్రకారం, సరిగ్గా లేని FSI, జోనింగ్ విధానం, అభివృద్ధి నియంత్రించే నిబంధనలు అభివృద్ధిని నిరోధిస్తాయి. ప్రస్తుతం ఉన్న ప్రణాళికా రూపాలు మెట్రోపాలిటన్ ప్రాంతాలలో భూ వినియోగం, మౌలిక సదుపాయాల ప్రణాళిక, ఫైనాన్స్ మొదలైన వాటి కోసం ఏకీకృత ప్రణాళికను రూపొందించలేవని భావించింది. కాబట్టి ఈ రంగాలన్నింటిలో సంస్కరణను సమర్థించింది. ఈ రంగాలలో సంస్కరణలు లేకపోవడం వల్ల ప్రైవేట్ రంగం పోటీతత్వం, మౌలిక సదుపాయాల పెట్టుబడులకు ఆర్థిక సహాయం చేయడానికి భూమి ఆధారిత ఆర్థిక సాధనాలను ఉపయోగించుకునేందుకు ప్రభుత్వ రంగం సామర్థ్యానికి ఆటంకం కలుగుతోందని బ్యాంక్ అభిప్రాయపడింది.

మూడు అంచల పాలన వల్ల బాధ్యతల కేటాయింపు పైన తరచూ ఏర్పడే అస్పష్టత, సరైన జవాబుదారీతనం లేకపోవడం, సేవల పంపిణీలో వైఫల్యానికి కారణంగా నిలుస్తోందని కూడా ప్రపంచ బ్యాంకు అభిప్రాయపడింది. అంతేకాకుండా, భూ వినియోగ విధానాలను ప్లాన్ చేయడానికి మరియు నిర్వహించడానికి, మౌలిక సదుపాయాలను నిర్మించడానికి ఖుదీలకు అవసరమైన మానవ వనరుల నైపుణ్యం లేదని వాదించింది. కాబట్టి వారు సాంకేతిక నిపుణులతో పట్టణ పాలన వివిధ స్థాయిలలో 'సమర్థవంతమైన అర్థ ప్రభుత్వ (పారా స్టేటల్) సంస్థల ఏర్పాటును సమర్థించారు. ఈ పారా-స్టేటల్ బాడీలు ఎన్నుకోబడిన సంస్థలు కాదు. అందువల్ల ప్రజలకు జవాబుదారీగా ఉండవు. కానీ దాతలైన (డోనార్) ఏజెన్సీలకు మాత్రమే జవాబుదారీగా ఉంటాయి.

**బి) యుపిఎ హయాంలో నయా ఉదారవాద కాలం క్రమబద్ధమైన అమలు**

భారత ప్రభుత్వం డిసెంబర్ 2005లో జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యూవల్ మిషన్ (JNNURM) అనే పేరుతో ఒక ప్రధాన పట్టణ అభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించింది, జెఎన్ఎన్‌యుఆర్ఎమ్, స్మార్ట్ సిటీలు భారతీయ నగరాలను 'ప్రపంచ శ్రేణి'గా మార్చడానికి పెద్ద మౌలిక సదుపాయాలు డిజిటల్ టెక్నాలజీపై దృష్టి సారించాయి. కానీ నాణ్యమైన జీవితాన్ని అందించటంలో వాటి ప్రభావం చాలా తక్కువ.

2005లో, పదో ప్రణాళిక నాల్గవ సంవత్సరంలో మిషన్ మోడ్‌లో ఏర్పాటు

చేయబడిన జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎమ్ అనేది ఏడేళ్లలో 20 బిలియన్ల డాలర్ల పెట్టుబడితో నగర ఆధునీకరణ కోసం తీసుకువచ్చిన పథకం. పట్టణ ఆధునీకరణ లో పెట్టుబడులను పెంచడం, మెరుగైన పౌర సదుపాయాలను నిర్మించడం, సార్వత్రిక ప్రాథమిక అవసరాలకు (సేవలు) మొదలైనవాటికి హామీ ఇవ్వడంతోపాటు పట్టణ పేదలు, మురికివాడల నివాసులు, ఆర్థికంగా బలహీన వర్గాల ప్రజలకు సరసమైన గృహాలను నిర్మించడం కోసం JNNURM రూపొందించబడింది.

సంస్కరణ ప్రోత్సాహకం ఆధారంగా ఏడేళ్ల వ్యవధిలో తప్పనిసరి సంస్కరణను అనుసరించాలనే ఒప్పందంలో జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎమ్ అనేది ఒక భాగం. ఈ మిషన్ అమలుకు పెట్టే పెట్టుబడి రెండు ఉపలక్ష్యాలను కలిగి ఉంటుంది : (1) అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, గవర్నెన్స్ (యుఐజి), (పట్టణ మౌలిక వసతులు, పరిపాలన) (ఎ) నీరు, పారిశుద్ధ్యం, మురుగునీరు, పారుదల (బి) ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ (ఎస్‌డబ్ల్యుఎమ్) (సి) పట్టణ రవాణా (డి) వీధి దీపాలు (ఇ) పర్యావరణ పరిరక్షణ మొదలైన వాటితో సహా పెట్టుబడి పెట్టటం. (2) మురికివాడల సమగ్ర అభివృద్ధికి తోడ్పడే పెట్టుబడులతో పట్టణ పేదలకు ప్రాథమిక సేవలు (బిఎస్‌యుపి). మురికివాడల రహిత భారతదేశం లక్ష్యంగా పనిచేస్తున్న రాజీవ్ ఆవాస్ యోజన (ఆర్‌ఏవై) స్లమ్ ఫ్రీ సిటీ కార్యక్రమాన్ని కూడా ప్రభుత్వం ప్రారంభించింది. జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎమ్ రాష్ట్ర పట్టణ ప్రభుత్వాలను ఈ లక్ష్యాలను సాధించడానికి నిర్మాణాత్మక సంస్కరణలకు కట్టుబడి ఉండాలని ఒత్తిడి చేసింది.

పెట్టుబడులను ఆకర్షించేందుకు జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎమ్ ప్లేస్–మార్కెటింగ్ నియంత్రణ తగ్గించడంపై పోటీని ప్రోత్సహించింది. ఇందుకోసం రాష్ట్ర, నగర స్థాయిలో పాలక సంస్థలకు పలు షరతులు విధించింది. అవి : (1) వినియోగదారు రుసుమును ప్రవేశపెట్టడం ద్వారా పిపిపిల ద్వారా ప్రాథమిక సేవల ప్రైవేటీకరణ/ వాణిజ్యీకరణ పరిచయం (2) అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాలను రద్దు చేయడం ద్వారా భూమి, రియల్ ఎస్టేట్ మార్కెట్, సరళీకరణ, అద్దె నియంత్రణ చట్టాలలో మార్పు (3) హౌసింగ్, రియల్ ఎస్టేట్‌లో 100 శాతం ఎఫ్‌డిఐతో పాటు బలమైన తనఖా మార్కెట్ అభివృద్ధి (4) భూ వినియోగ మార్పిడి నిబంధనలను సులభతరం చేయడం (5) ఆస్తి పన్నులో సంస్కరణలు, స్టాంపు సుంకాల తగ్గింపు (6) 74వ సవరణ అమలు ద్వారా మునిసిపాలిటీల ఆర్థిక, పరిపాలనా పునర్నిర్మాణం (7) రేషనలైజేషన్, అవుట్‌సోర్సింగ్ (8) ఇ–గవర్నెన్స్ పరిచయం (9) ప్రైవేట్ సెక్టార్, ఎన్నికైన పౌర సంస్థలపై ప్రైవేట్ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీల మూల్యాంకన (విలువ

కట్టడం) (10) సమాచార హక్కు, పబ్లిక్ డిస్క్లోజర్ చట్టం, పౌరుల భాగస్వామ్య చట్టం మొదలైన ఉన్నతంగా కనిపించే రూల్స్ తీసుకురావడం ద్వారా మధ్యతరగతి వర్గాన్ని దగ్గర చేసుకోవడం (11) పే-అండ్-యూజ్ ఫ్రేమ్‌వర్క్ పరిధిలోకి పట్టణ పేదలను తీసుకురావడం. ఉదాహరణకు, ప్రాథమిక సేవల కోసం వినియోగదారు రుసుము మొదలైనవి.

ప్రాజెక్ట్ నిధుల పంపిణీకి సంబంధించిన విశ్లేషణ చాలా వనరులు సాపేక్షంగా పెద్ద పట్టణాలు, నగరాలకు వెళుతున్నట్లు స్పష్టం చేసింది. మిషన్ కింద నిధుల మంజూరు అనేది సిటీ డెవలప్‌మెంట్ ప్లాన్‌ల (సిడిపి) తయారీ, నగరాలపై దీర్ఘకాలిక దృష్టిని కలిగి ఉండటం, కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వివరణాత్మక ప్రాజెక్ట్ నివేదికలను కలిగి ఉండటం మొదలైన వాటిపై ఆధారపడి ఉంటుంది. సిడిపిల అమలు కోసం అవసరమైన వనరులలో ఎక్కువ భాగాన్ని ప్రభుత్వేతర మార్గాల నుండి సమీకరించాలి. రాష్ట్రాలు నిధులను పొందేందుకు మరో ముందస్తు షరతు ఏమిటంటే, ప్రాజెక్టుల మూల్యాంకనం, యుఎల్‌బిలు/పారాస్టేటల్ యూనిట్‌లకు నిధులను విడుదల చేయడం, అదే నిధుల నిర్వహణ, ప్రాజెక్ట్‌లను పర్యవేక్షించడం వంటి వాటికి బాధ్యత వహించే పారాస్టేటల్, ఎన్నుకోబడని నోడల్ ఏజెన్సీలను ఏర్పాటు చేయాలి. యుఎల్‌బిలు/పారాస్టేటల్ యూనిట్లు స్వయంగా సమర్పించిన ప్రాజెక్ట్‌ల కంటే ప్రైవేట్ రంగ భాగస్వామ్య ప్రాజెక్ట్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలి.

జెఎన్ఎన్‌యుఆర్ఎమ్ సంస్కరణ చర్యలు, ఎంపిక చేసిన మౌలిక సదుపాయాల పెట్టుబడి (ఎంపిక చేసిన 63 మిషన్ నగరాల్లో) ద్వారా మార్కెట్ ఆధారిత స్థూల-ఆర్థిక వృద్ధికి సరైన పరిస్థితులను సృష్టించడం, మునిసిపల్ బాడీల రుణఅర్హతను పెంపొందించడానికి తగిన ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటు చేయడం ముఖ్యమని భావించింది. వీటిలో ఎక్కువ భాగం నగర స్థాయిలో నీటి సరఫరా, పారిశుద్ధ్యం మరియు మురుగునీటి శుద్ధి వంటి సేవల సామర్థ్యాన్ని పెంచడానికి రూపొందించబడ్డాయి. నగరాల్లోని వెనుకబడిన ప్రాంతాలలో సౌకర్యాల సరఫరాను మెరుగుపరచడానికి లేదా పేదలకు వీటి అందుబాటును మెరుగుపరచడానికి అవసరమైన స్పష్టమైన ప్రతిపాదన (ప్రొవిజన్) లేదు.

ప్రతి సౌకర్యానికి సంస్కరణ, ఆర్థిక సామర్థ్యం, వ్యయాన్ని రాబట్టుకోవటం, మరియు ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం వంటి వాటిపై దృష్టి సారించటం వల్ల అన్నివిధాల సమృద్ధిగా ఉన్నవారికే మెరుగైన ప్రయోజనాలు పరిమితం చేయబడ్డాయి. మరోవైపు, మురికివాడల నివాసితులకు ప్రాథమిక సౌకర్యాలు, భూమి

మొదలైనవి అందించడానికి ఒక ఫ్రేమ్‌వర్క్ లేదా సంస్థాగత నిర్మాణాన్ని ప్రతిపాదించడానికి కూడా సిడిపిలు ప్రయత్నించలేదు. పట్టణ పేదల కోసం ప్రాథమిక సేవలు (బిఎస్‌యుపి) కాంపోనెంట్ కింద హౌసింగ్ కార్యకలాపాలపై (కొన్నిసార్లు ప్రాథమిక సేవలతో అనుసంధానించబడి) దృష్టి గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాలి. నగరస్థాయి మౌలిక సదుపాయాలు, ప్రాథమిక సేవలను పేదలకు అందుబాటులోకి తీసుకురావడానికి ఈ భాగం కింద పెట్టుబడిని ప్రతిపాదించడానికి బదులుగా ఈ పథకం బహుళ అంతస్తుల సముదాయాల్లో సబ్సిడీతో కూడిన, ఉచిత నివాస యూనిట్లను అందించడానికి ప్రయత్నిస్తున్నది.

మురికివాడల ప్రజలకు (కుటుంబాలకు) పునరావాసం కల్పించేందుకు స్థిరమైన పరిమిత స్థలాన్ని కేటాయించి, అదే ప్రదేశంలో కొంత భాగాన్ని అధిక ఎఫ్ఎస్ఐని ఉపయోగించడానికి అనుమతి ఇవ్వటం వలన బిల్డర్ తన లాభాన్ని పెంచుకోవటానికి (పబ్లిక్, ప్రైవేట్ లేదా ఎన్‌జిఓ అయినా), ఆ స్థలాన్ని వాణిజ్య కార్యకలాపాల కోసం ఉపయోగించుకునేందుకు వీలు కల్పిస్తోంది. రియల్ ఎస్టేట్ లాబీ తీవ్ర ఆసక్తిని కనబరిచింది: ప్రత్యేకించి ఇటువంటి పథకాల కింద ప్రభుత్వం నుండి ఆర్థిక, పరిపాలనా మద్దతు తీసుకునేటప్పుడు సామాజిక గృహాలు ఎన్నడూ లాభదాయకంగా ఉండవు. అయినప్పటికీ, అసలు నివాసితులను నిర్వాసితులను చేయడం, వారి కార్యకలాపాలను కొనసాగించడానికి వారికి అవసరమైన స్థల కేటాయింపు, ఇంటి నిర్వహణ ఖర్చులతో పాటు నెలవారీ వాయిదాలను కట్టగలిగే సామర్థ్యం, అద్దెదారుల ప్రయోజనాలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించబడనేలేదు. యూనిట్‌లను 'అర్హులైన' వారికి కేటాయించి, వారు వాటిని ఉంచుకునేలా చూడటంలో పబ్లిక్ ఏజెన్సీల సామర్థ్యం చాలా పరిమితం.

బిఎస్‌యుపి అనేది పరిపాలనాపరంగా లేదా రాజకీయంగా అనుబంధం కలిగిన కొంతమందికి సబ్సిడీతో కూడిన నివాస గృహాలను అందించడానికి ఉపయోగించబడుతుంది. అందువల్ల, పాలక పక్షం రాజకీయంగా ప్రయోజనం కలుగుతుందని భావించే కొన్ని సామాజిక సమూహాలతో పాట్రన్-క్లయింట్ సంబంధాన్ని ఏర్పాటు చేసుకోవడానికి ఈ పథకం ఉపయోగించబడుతుంది. సహజంగానే పెద్ద ఎత్తున అవినీతి బంధుప్రీతి ఈ ప్రాజెక్ట్‌లోకి ప్రవేశించాయి.

అనేక మెట్రోపాలిటన్ నగరాలు మాస్టర్ ప్లాన్‌ల స్థానంలో శీఘ్ర పరిష్కార సిడిపిలు లేదా విజన్ డాక్యుమెంట్‌లను కూడా సిద్ధం చేశాయి. పదకొండవ ప్రణాళిక డాక్యుమెంట్ జెఎన్ఎన్‌యుఆర్ఎమ్ క్రింద సిడిపిలను, చిన్న, మధ్యస్థ పట్టణాల

కోసం పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి పథకం (యుఐడిఎస్ఎస్ఎమ్‌టి)ని స్థానిక, రాష్ట్ర ప్రభుత్వాలకు విజన్ డాక్యుమెంట్‌గా తయారుచేసే బాధ్యతను అప్పగించింది. ప్రధాన ప్రాంతాలలో భూమి కొరత, మూలధన కొరత సమస్యలను పరిష్కరించడానికి, అనేక నగరాల్లో ఒక తెలివైన పద్ధతిని రూపొందించారు. ఫెడరల్ ప్రభుత్వం, అనేక అంతర్జాతీయ సంస్థలు సిఫార్సు చేసిన విధంగా స్థానిక ఏజెన్సీలు ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్ (ఎఫ్ఎస్ఐ)ని పెంచాయి. దీనివల్ల భూమి విలువ అధికంగా ఉన్న ప్రాంతాల్లో వ్యాపార భవనాలు, వాణిజ్య కార్యకలాపాలు, అధిక ఆదాయ వర్గాలకు నివాస యూనిట్లకు స్థలాన్ని అందించేందుకు అనుగుణంగా బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతి లభించింది. ఈ వ్యూహం స్థానిక సంస్థలకు తక్షణమే ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వనరులను సమకూర్చుకోవటానికి వీలు కల్పించింది. ఈ వ్యూహాన్ని అనుసరించటం వల్ల అదనపు ప్రోత్సాహం ఉంటుంది. ఎందుకంటే కొన్ని అంతర్జాతీయ ఏజెన్సీల ద్వారా రుణాల మంజూరు కావాలంటే అధిక ఎఫ్ఎస్ఐ స్థానిక అధికారుల ఆమోదంపై ఆధారపడి ఉంటుంది.

భూమి కొరత సమస్యను పరిష్కరించడానికి, ప్రధాన ప్రాంతాల్లో (ప్రైమ్ ఏరియా) ఉన్న అల్ప ఆదాయ, మురికివాడల కాలనీలు నగర శివార్లకు మార్చబడ్డాయి. మురికివాడల నివాసితుల తొలగింపు, హాకర్లు, పేవ్‌మెంట్లపై నివసించేవారు, రిక్షా పుల్లర్‌లను తొలగించడం ద్వారా ఈ మార్పు కొన్నిసార్లు ప్రత్యక్షంగా మనకు అర్ధమవుతుంది. అయినప్పటికీ, ఇది మురికివాడల అభివృద్ధి పథకాల పేరుతో పరోక్షంగా, కావాలని చేయబడుతుంది. వారికి నగర పరిధికి బయట పునరావాసం కల్పించబడుతుంది. ఆ విధంగా భవిష్యత్ వ్యాపార కార్యకలాపాల కోసం ప్రభుత్వం చొరవతో భూమార్కెట్ తెరిచి, వారికి భూమిని అందుబాటులో ఉంచారు. భూమి వినియోగాన్ని మార్చడానికి చట్టపరమైన, పరిపాలనాపరమైన విధానాలను సరళీకృతం చేయడం ద్వారా, అలాగే 'తక్కువ విలువ' కలిగిన కార్యకలాపాలను ఈ సైట్‌ల నుండి బయటకు పంపటం ద్వారా ఇది సులభతరం చేయబడింది.

**సి) నయా ఉదారవాద కాలం: బిజెపి హయాంలో దూకుడుగా అమలు**

కార్పొరేట్ మతోన్మాద కూటమి సంపూర్ణ మద్దతుతో, ప్రభుత్వం నయా ఉదారవాద సంస్కరణలను దూకుడుగా అమలు చేయటం మొదలుపెట్టింది. 2014లో అధికారం చేపట్టిన వెంటనే, ప్రణాళిక కమిషన్ రద్దు చేయబడి, దాని స్థానంలో ఎటువంటి బాధ్యతా లేని నిటి ఆయోగ్ అనే కొత్త సంస్థ సృష్టించబడింది. బిజెపి ప్రభుత్వం దాని అన్ని నయా ఉదారవాద కార్యక్రమాల వెనుక ఈ సంస్థ ఆలోచనా విధానమే (థింక్–ట్యాంక్) ఉంది.

2014లో ప్రభుత్వం మారిన తర్వాత, జెఎన్ఎన్ఆర్‌యుఎం స్థానంలో అదే తరహాలో మరో పథకం అమృత్ (AMRUT) వచ్చింది.

**AMRUT (అమృత్) :** అమృత్ 2015లో మొత్తం వ్యయం రూ. 1,00,000 కోట్లతో నీటిపైన కేంద్రీకరించే మిషన్‌గా మొదటి ప్రారంభించబడింది. పట్టణ జనాభాలో 60 శాతం మందిని కవర్ చేసే 500 ప్రధాన నగరాలకు ఈ మిషన్ సేవలు అందిస్తుంది. ప్రభుత్వ నివేదికల ప్రకారం రూ. 80,000 కోట్ల కంటే ఎక్కువ విలువైన ప్రాజెక్టులు రంగంలోకి దించబడ్డాయి. ప్రాజెక్ట్ అమలు కోసం రు.77,640 కోట్ల విలువైన నిధులు కేటాయించబడ్డాయి. రూ. 56,000 కోట్ల విలువైన పనులు జరగగా, మరో రు.48,000 కోట్ల పనులు విస్తరించబడ్డాయి. 1.14 కోట్ల నీటి కుళాయి కనెక్షన్లు అందించబడ్డాయి, అమృత్ నగరాల్లో మొత్తం కనెక్షన్ల సంఖ్య 4.14 కోట్లకు చేరుకుంది. 85 లక్షల మురుగునీటి కనెక్షన్లు, సెప్టేజీ సౌకర్యాల కింద ఉన్న కుటుంబాలతో సహా 2.32 కోట్లకు కవరేజీని అందించారు. అమృత్ ద్వారా 6,000 ఎంఎల్‌డి మురుగునీటి శుద్ధి సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాల్సి ఉండగా, ఇందులో 1,800 ఎంఎల్‌డి శుద్ధి సామర్థ్యం అభివృద్ధి చేయబడింది. ఇంకా, శుద్ధి చేసిన నీటిని రీసైకిల్/పునర్వినియోగం కోసం 907 ఎంఎల్‌డి సామర్థ్యం పెంచబడుతుంది. గ్రీన్‌స్పేసెస్ ప్రాజెక్టుల ద్వారా 3,850 ఎకరాల అనుమతించదగ్గ పచ్చని ప్రదేశాలు జోడించబడ్డాయి మరో 1,600 ఎకరాల పచ్చని ప్రాంతం కూడా దీనికి తోడవుతుంది. 2,200 వాటర్ లాగింగ్ పాయింట్లు తొలగించబడ్డాయి. కొనసాగుతున్న ప్రాజెక్టులలో మరో 1,500 వాటర్ లాగింగ్ పాయింట్లు కూడా తొలగించబడతాయి. 106 నీటి వనరుల సంస్థల పునరుద్ధరణ పనులు చేపట్టారు. 89 లక్షల సంప్రదాయ వీధిలైట్లు శక్తివంతమైన ఎల్ఇడి దీపాలతో భర్తీ చేయబడ్డాయి. దీనివల్ల సంవత్సరానికి 195 కోట్ల యూనిట్ల ఇంధనం ఆదా అవుతుంది. సంవత్సరానికి 15.6 లక్షల టన్నుల కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి ఉపయోగపడుతుంది.

అమృత్ మిషన్ నిర్దేశించిన సంస్కరణల ప్రకారం 470 నగరాల్లో క్రెడిట్ రేటింగ్ పనులు పూర్తయ్యాయి. వీటిలో, 164 నగరాలు ఇన్వెస్టిబుల్ గ్రేడ్ (పెట్టుబడి పెట్టదగ్గ) రేటింగ్ (ఐజిఆర్) పొందాయి. ఇందులో 'ఎ' లేదా అంతకంటే ఎక్కువ రేటింగ్ ఉన్న 36 నగరాలు ఉన్నాయి. అహ్మదాబాద్, అమరావతి, భోపాల్, ఘజియాబాద్, హైదరాబాద్, ఇండోర్, పూణే, సూరత్, విశాఖపట్నం, లక్నో వంటి 10 యుఎల్‌బిలు మున్సిపల్ బాండ్ల ద్వారా 3,840 కోట్ల డాలర్లు సేకరించాయి. ఈ యుఎల్‌బిలకు ప్రోత్సాహకంగా 227 కోట్ల డాలర్లు విడుదలయ్యాయి.

455 అమృత్ నగరాలతో సహా 2.471 నగరాల్లో ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్ వ్యవస్థ అమలు చేయబడింది. 20 నగరాలు, పట్టణాల్లో ప్రాజెక్టుల పనులు ఇంకా కొనసాగుతున్నాయి.

ప్రపంచ బ్యాంకు దాని డూయింగ్ బిజినెస్ రిపోర్ట్ (డిబిఆర్) 2020 ప్రకారం, ఈ మిషన్ ద్వారా అమలు చేయబడిన సంస్కరణల వల్ల ఈజ్ ఆఫ్ డూయింగ్ (వ్యాపారాలను సులభతరం చేయటం)లో నిర్మాణ అనుమతులను మెరుగు పరచటంలో భారతదేశం ర్యాంక్ 181 (2018) నుండి 27కి చేరుకుంది.

**అమృత్ 2.0 అటల్ మిషన్ ఫర్ రెజ్యూవనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్ఫర్మేషన్ :** ఇప్పుడు, ఈ మిషన్‌ను మరింత ముందుకు తీసుకువెళ్లడం ద్వారా, అమృత్ 2.0 సుమారు 4,700 పట్టణాలు/నగరాలను నీటి భద్రత కలిగినవిగా మార్చడం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది నీటి అవసరాలను తీర్చడానికి, నీటి వనరులను పునరుజ్జీవింపజేయడానికి, జలాశయాలను మెరుగ్గా నిర్వహించడానికి, శుద్ధి చేసిన మురుగునీటిని తిరిగి వినియోగించటానికి, తద్వారా నీటి ఆర్థిక వ్యవస్థ చక్రాన్ని ప్రోత్సహించడానికి అమృత్‌ను బలోపేతం చేస్తుంది.. అమృత్ 2.0 మొత్తం వ్యయం రు.2,97,000 కోట్లు, ఇందులో కేంద్ర వాటా రు.76,760 కోట్లు. మార్చి 2023 వరకు అమృత్ మిషన్‌కు ఆర్థిక సహాయాన్ని కొనసాగించడానికి రు.10,000 కోట్ల సెంట్రల్ వాటా, మరో రు.10,000 కోట్ల రాష్ట్రాల వాటా ఇందులో ఉంది. అమృత్ 2.0 లక్ష్యం దాదాపు 4,700 యుఎల్‌బిలలోని అన్ని గృహాలకు 100శాతం నీటి సరఫరాను అందించడం. 2.68 కోట్ల పట్టణ గృహ కుళాయి కనెక్షన్లను అందించటం ద్వారా దాదాపు 10.7 కోట్ల మంది ప్రజలు లబ్ధి పొందుతున్నారు. 500 అమృత్ నగరాల్లో 100 శాతం మురుగు, సెప్టేజీ కవరేజీని అందించడం, 2.64 కోట్ల మురుగునీటి కనెక్షన్లు / సెప్టేజ్ కనెక్షన్‌లను అందించడం ద్వారా సుమారు 10.6 కోట్ల మందికి ప్రయోజనం చేకూరుతోంది. స్థిరమైన మంచినీటి సరఫరాను పెంపొందించడానికి నీటి వనరుల పునరుజ్జీవనం పట్టణ జలాశయాల నిర్వహణ చేపట్టబడుతుంది. శుద్ధి చేయబడిన మురుగునీటిని రీసైకిల్ చేయడం, పునర్వినియోగం చేయడం వలన నగరాల మొత్తం నీటి అవసరాలలో 20 శాతం, పారిశ్రామిక డిమాండ్‌లో 40 శాతం తీర్చగలదని భావిస్తున్నారు. మిషన్ కింద, సహజ వనరులను స్థిరంగా ఉంచడానికి మంచినీటి వనరులు కలుషితం కాకుండా రక్షించబడతాయి.

అమృత్-2.0 లో అనేక గుర్తించదగ్గ అంశాలు ఉన్నాయి. వీటిలో అమృత్ కింద కవర్ చేయబడిన 500 నగరాల నుండి ఒక లక్ష జనాభాతో మొత్తం

4,372 నగరాలకు, 100 శాతం పట్టణ భారతదేశాన్ని కవర్ చేస్తుంది. ఇది ప్రతి నగరానికి సిటీ వాటర్ బ్యాలెన్స్ ప్లాన్‌ను రూపొందించడం ద్వారా నీటి సర్క్యులర్ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహిస్తుంది. శుద్ధి చేసిన మురుగునీటిని రీసైకిల్ చేయడం/ పునర్వినియోగం చేయడం, నీటి వనరుల పునరుజ్జీవనం, నీటి సంరక్షణపై దృష్టి సారిస్తుంది. డిజిటల్ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహిస్తారు. ఛాలెంజ్ ప్రక్రియ ద్వారా నీటి సమాన పంపిణీ, మురుగునీటి పునర్వినియోగం, నీటి పరిమాణం, నాణ్యతకు సంబంధించి నీటి వనరుల మ్యాపింగ్‌ను నిర్ధారించడాన్ని సవాలుగా తీసుకుని నగరాల్లో "పేజల్ సర్వేక్షణ్" నిర్వహించబడుతుంది.

ఈ మిషన్ సంస్కరణ ఎజెండాను కలిగి ఉంది. ప్రధాన సంస్కరణలు, నాన్ రెవిన్యూ వాటర్ (ఎన్ఆర్‌డబ్ల్యు) ను 20 శాతానికి తగ్గించడం, ఉపచట్టాలను రూపొందించడం ద్వారా బల్క్ వినియోగదారుల కోసం డ్యూయల్ పైపింగ్ సిస్టమ్, సరైన మాస్టర్ ప్లానింగ్ ద్వారా విలువను అన్‌లాక్ చేయడం, భూమి వినియోగ సామర్థ్యాన్ని, క్రెడిట్ రేటింగ్‌ను మెరుగుపరచడం, మార్కెట్ ఫైనాన్స్‌ను ఉపయోగించటం వంటివి ఉన్నాయి. మునిసిపల్ బాండ్‌లు, ఇఓడిబి కింద ఆన్‌లైన్ బిల్డింగ్ పర్మిషన్ సిస్టమ్ అమలు చేయబడుతుంది. సర్కిల్ రేట్లు, కాలానుగుణంగా పెరుగుతున్న ఆస్తి పన్నుపై నోటిఫికేషన్, ఓ & ఎమ్ ఖర్చులకు సంబంధించిన వినియోగదారు ఛార్జీలు అమృత్ 2.0 ప్రకారం తప్పకుండా చేయాల్సిన సంస్కరణ. ఈ నిర్బంధిత సంస్కరణల అమలుపైనే రెండో విడత కేంద్ర వాటా విడుదల చేయబడుతుంది.

అమృత్-2.0 మిషన్ పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పిపిపి)ని ప్రోత్సహిస్తుంది. మిలియన్ కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలు తమ మొత్తం ప్రాజెక్ట్ ఫండ్ కేటాయింపులో కనీసం 10 శాతం విలువైన పిపిపి ప్రాజెక్ట్‌లను చేపట్టడం తప్పనిసరి చేయబడింది. ఇది యాన్యుటీ/హైబ్రిడ్ యాన్యుటీ/బిఓటి మోడల్‌లో ఉండవచ్చు. రెండు మిషన్లలో వాటాదారులందరి పాత్ర, నిబంధనలను వివరిస్తూ, 4798 యుఎల్‌బిలు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంతో ఎంఓయూపై సంతకం చేశాయి.

జెఎన్ఎన్‌యుఆర్ఎమ్, అమృత్ వంటి అర్బన్ మిషన్‌లు నగరాల పర్యావరణ పరిస్థితులకు పెద్దగా సంబంధం లేకుండా మూలధన-ఇంటెన్సివ్, ఇంజనీరింగ్-కేంద్రీకృత పరిష్కారాలకు నిధులు సమకూరుస్తాయి. తుఫాను నీటి నిర్వహణ, వర్షపు నీటి సంరక్షణ లేదా మురుగునీటి శుద్ధి కోసం చిత్తడి నేలల వికేంద్రీకృత, సహజ పరిష్కారాల పద్ధతులు వంటివి విస్మరించబడ్డాయి. బెంగళూరు ఒకప్పుడు అంతర్గతంగా

కలిసి ఉన్న 2,500 సరస్సుల నగరంగా ఉండేది. దాని నిర్మాణ ప్రాంతాలను లైసెజ్-ఫెయిర్ పద్ధతిలో పది రెట్లు పెంచడం వల్ల నేడు ప్రకృతి దయ మీద ఆధారపడాల్సి వస్తోంది. ముంబై ప్రభుత్వం రోడ్లు, వాటర్‌వర్క్‌లు, తుఫాను డ్రైనేజీల అభివృద్ధికి వందల కోట్లు పెట్టుబడి పెడుతుంది. కానీ విచక్షణారహితంగా రియల్ ఎస్టేట్కుకు మంజూరు ద్వారా 300 కాలువలు, మడ అడవులతో కూడిన తన జీవ సహాయక వ్యవస్థను చేజేతులా చంపేసింది.

**SMART CITIES MISSION :** 2015లో ప్రారంభించబడిన స్మార్ట్ సిటీస్ మిషన్ భారత ప్రభుత్వ మొట్టమొదటి పథకం. ప్రణాళికాబద్ధమైన పట్టణీకరణ, సుస్థిర అభివృద్ధిపై దృష్టి సారించి, పొరుగు నగరాలకు సహాయక వ్యవస్థగా భారతదేశం అంతటా 100 స్మార్ట్ సిటీలను నిర్మించడంలో భారత ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం చేపట్టింది. ఇందులో ఐటి సౌలభ్యం వంటి అధికనాణ్యత కలిగిన మౌలిక సదుపాయాలతో పాటు విద్య, ఆరోగ్య సేవలు, డిజిటలైజేషన్, ఇ-గవర్నెన్స్, స్థిరమైన అభివృద్ధి, భద్రత మొదలైన ప్రాథమిక సౌకర్యాల అభివృద్ధి కూడా ఉంటుంది.

ఈ మిషన్ NUPF 2020కి ఒక ఉదాహరణ, ఇందులో ప్రత్యక్షంగా పని చేయడం ద్వారా నేర్చుకోవటాన్ని ప్రోత్సహించాలని కేంద్రప్రభుత్వం కోరుకుంటోంది. దీని అర్థం, మిషన్ ఒక "లైట్‌హౌస్". దాని మార్గదర్శకత్వంలో ఇతర నగరాలన్నీ స్మార్ట్ నగరాల అభివృద్ధిని అనుకరించటం ద్వారా నేర్చుకుంటాయి. కేంద్ర ప్రభుత్వం నగరాలకు ఏమి చేయాలో నేరుగా చెప్పదు, కానీ వారికి నిధులు కావాలంటే, స్మార్ట్ సిటీ చేస్తున్న విధంగా వారు అనుసరించాలి. అంటే, ఎన్‌యుపిఎఫ్ ప్రకారం ప్రభుత్వం చోదకశక్తి కాదు. కేవలం 'ఫెసిలిటేటర్'.

ఈ మిషన్‌లో రూ. 1,45,245 కోట్ల విలువైన 3,183 ప్రాజెక్టులు ఉన్నాయి. అయితే ఇప్పటివరకు రూ.4,960 కోట్ల విలువైన ప్రాజెక్టుల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. ఇది మొత్తం ప్రాజెక్టుల్లో కేవలం ఐదు శాతం మాత్రమే. నాలుగో రౌండ్‌లో ఎంపిక చేసిన నగరాల్లో ప్రాజెక్టుల అమలు కోసం 2019-20 నుంచి 2022-23 వరకు ప్రాజెక్టుల పూర్తి లక్ష్యాన్ని పొడిగించారు.

**PMAY (ప్రధానమంత్రి ఆవాస్ యోజనా) :** మార్చి 2022 నాటికి మురికివాడలలో నివసించే వారితో సహా పట్టణ పేదలకు సరసమైన ధరలకు 20 మిలియన్ల గృహాలను అందించడానికి 2015లో ఈ పథకం ప్రారంభించబడింది. లబ్ధిదారులలో ఆర్థికంగా బలహీన వర్గాలు (ఇడబ్ల్యుఎస్), తక్కువ ఆదాయ వర్గాలు (ఎల్ఐజి), మధ్య ఆదాయ సమూహాలు (ఎంఐజి) ఉన్నారు. పిఎమ్ఎవై (అర్బన్)

మరియు పిఎమ్ఎవై (గ్రామీణ) అనే రెండు భాగాలతో కేంద్ర ప్రాయోజిత పథకంగా అమలు చేయబడింది. ఈ మిషన్‌లో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ద్వారా అమలు చేసే ఏజెన్సీలకు కేంద్ర సహాయం అందించబడుతుంది.

కేంద్ర మంత్రిత్వ శాఖ లెక్కల ప్రకారం, గత 3 సంవత్సరాలలో ఒక కోటి గృహాలు అవసరం ఉండగా, కేవలం 51 లక్షల ఇళ్లు ఆమోదించబడ్డాయి. 28 లక్షలకు పైగా గృహాలు గ్రౌండింగ్, వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయి. 8 లక్షల ఇళ్లు పూర్తి చేయబడి లబ్ధిదారులు నివాసం ఉంటున్నారు.

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద అందరికీ ఇళ్లు ఇస్తామన్న హామీ ఎండమావిగా మిగిలిపోయింది. గృహనిర్మాణ రంగంలో 'పెట్టుబడి', 'సంస్కరణలు' తీసుకురావడానికి ప్రభుత్వం తీసుకున్న సత్వర చర్యలు నామమాత్రంగా మాత్రమే విజయవంతమయ్యాయి. చాలావరకు మధ్యతరగతి, అధిక ఆదాయ వర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా గత కొన్ని సంవత్సరాలుగా గృహనిర్మాణంపై దృష్టి సారించినప్పటికీ, 2019లో 1.8 కోట్ల గృహాల కొరత ఉండగా కేవలం 18 లక్షల ఇళ్లను మాత్రమే నిర్మించగలిగారు. ఇది మొత్తం పట్టణ గృహ అవసరాలలో 10 శాతం కంటే కూడా తక్కువ. పట్టణ కేంద్రాలలో ఇప్పుడు సర్వసాధారణమైన "భూమిని వనరుగా" చూపించే వ్యూహం పేద, ఇతర బలహీన వర్గాలను నగర శివార్లకు తరలించడానికి దారితీసింది. ఏ గృహనిర్మాణ కార్యక్రమమైనా ఇప్పటికే వ్యక్తులు స్వతంత్రంగా నిర్మించిన గృహాలను క్రమబద్ధీకరించి అధికారికం చేయాలి. మెరుగైన సేవలు, సౌకర్యాలను అందించడం, గృహాన్ని నివాసయోగ్యంగా మార్చడం అవసరం. ఈ కీలకమైన విషయాన్ని ప్రస్తుత పిఎంఎవై పథకం చాలా తెలివిగా నిర్లక్ష్యం చేస్తోంది.

**స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ (ఎస్‌బిఎమ్-యు) :** అన్ని చట్టబద్ధమైన పట్టణాల్లో బహిరంగ మలవిసర్జన నిర్మూలన - మున్సిపల్ ఘన వ్యర్థాలను 100 శాతం శాస్త్రీయంగా నిర్వహించడం తద్వారా అన్ని చట్టబద్ధమైన పట్టణాల్లో జన ఆందోళన్ ద్వారా ప్రవర్తన మార్పును తీసుకురావడం మిషన్ లక్ష్యాలు.

ప్రభుత్వం చెపుతున్న ప్రకారం ఈ మిషన్ కింద 70 లక్షలకు పైగా గృహాలు, కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్లు నిర్మించబడ్డాయి. మహిళలు, లింగమార్పిడి సంఘాలు మరియు వికలాంగుల అవసరాలకు మిషన్ ప్రాధాన్యతనిచ్చింది. పట్టణ భారతదేశం 2019లో బహిరంగ మలవిసర్జన రహితంగా ప్రకటించబడింది. 3,000 నగరాలు ODF+ గాను, 950 నగరాలు ODF++ గాను గుర్తించబడ్డాయి. కానీ వాస్తవం దీనికి

భిన్నంగా ఉంది. వివిధ కారణాల రీత్యా చాలా నగరాలు బహిరంగ మలవిసర్జనకు సాక్ష్యాలుగా కొనసాగుతున్నాయి.

ఇప్పుడు, ప్రభుత్వం ఎస్‌బిఎమ్–యు 2.0 ను ప్రకటించింది. రాబోయే 5 సంవత్సరాలలో పారిశుధ్యం, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ ఫలితాలను నిలబెట్టుకోవడంపై దృష్టి పెడుతుంది. తద్వారా పట్టణ భారతదేశాన్ని (అర్బన్ ఇండియా) 'స్వచ్ఛత' లో తర్వాతి స్థాయికి తీసుకువెళుతుంది.

రానున్న 5 సంవత్సరాలలో ఉపాధి, మెరుగైన అవకాశాల కోసం గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణ ప్రాంతాలకు వలస వచ్చే అదనపు జనాభాకు పూర్తి స్థాయిలో పారిశుధ్య సౌకర్యాలను అందించడంపై ఈ మిషన్ దృష్టి సారిస్తుంది. 3.5 లక్షలకు పైగా వ్యక్తిగత, కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణం ద్వారా ఇది అమలుచేయబడుతుంది. ఒక లక్ష కంటే తక్కువ జనాభా ఉన్న నగరాల్లో పూర్తి ద్రవ చెత్త నిర్వహణ- ఎస్‌బిఎమ్–అర్బన్ 2.0 కింద ప్రవేశపెట్టిన కొత్త అంశం. దీని ఉద్దేశ్యం మొత్తం మురుగునీటిని సురక్షితంగా ఉంచడం, సేకరించడం, తద్వారా మురుగునీరు నీటి వనరులను కలుషితం చేయకుండా రవాణా చేయడం. శుద్ధి చేయడం ద్వారా స్థిరమైన ఘన వ్యర్థాల నిర్వహణకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. మెటీరియల్ రికవరీ సౌకర్యాలు, వ్యర్థాల ప్రాసెసింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయటం ద్వారా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను దశలవారీగా నిర్మూలించడంపై దృష్టి సారిస్తుంది. నిర్మాణ అలాగే కూల్చివేత పనుల వ్యర్థాల ప్రాసెసింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయబడతాయి. నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ నగరాల్లో 5 లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాల్లో మెకానికల్ స్వీపర్‌లను ఉపయోగంలోకి తెస్తారు.

స్వచ్ఛ భారత్ మిషన్–అర్బన్ 2.0 కింద, అన్ని చట్టబద్ధమైన పట్టణాలు కనీసం ODF+గా మారుతాయని అంచనా వేయబడింది. అలాగే ఒక లక్ష కంటే ఎక్కువ జనాభా ఉన్న అన్ని నగరాలు ODF++ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో, SBM-U 2.0 కింద అన్ని నగరాలు కనీసం 3–స్టార్ గార్బేజ్ ఫ్రీ సర్టిఫికేషన్‌ను సాధించగలవని భావిస్తున్నారు. SBM-U 2.0 కోసం రూ. 1,41,600 కోట్ల ఆర్థిక వ్యయం ఖరారు చేయబడింది. ఇందులో 2021–22 నుండి 2025–26 మధ్య కాలంలో రూ. 36,465 కోట్ల కేంద్ర వాటాతో సహా, ఇది మిషన్ ముగింపు దశలో అయిన రూ. 62,009 కోట్ల ఆర్థిక వ్యయం కంటే 2.5 రెట్లు ఎక్కువ.

ఎస్‌బిఎం విజయం మరుగుదొడ్ల నిర్మాణానికి మాత్రమే పరిమితం చేయబడింది కాని వాస్తవ వినియోగంలో కాదు. భౌతిక మౌలిక సదుపాయాలు

విస్తరించినప్పటికీ, మురుగు కాలువల కొరత వల్ల, అవి భూమిని, నీటి వనరులను ఎలా కలుషితం చేస్తాయనే దానిపై ఆలోచనలో లోపం ఉంది. మాన్యువల్ స్కావెంజింగ్, రూపం మార్చుకున్నప్పటికీ, మిలియన్ల కొద్దీ సెప్టిక్ ట్యాంక్‌లు శుభ్రం చేయకుండా ఏ విధంగా పడివున్నాయనే విషయం విస్మరించబడింది. మరుగుదొడ్లు విషయం పక్కన పెడితే, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సవాలు మనల్ని భయపెడుతూనే ఉంది. ఇప్పుడు కూడా సగానికి పైగా వ్యర్థాలను ఖాళీ ప్రదేశాల్లో పడేస్తున్నారు. మరీ ముఖ్యంగా మెకానికల్ స్వీపర్ల పేరుతో లక్షలాది మంది మున్సిపల్ కార్మికులకు ఉపాధి లేకుండా పోతుంది.

**హెరిటేజ్ సిటీ డెవలప్‌మెంట్ అండ్ ఆగ్మెంటేషన్ యోజన (HCDY)**: ఇది కేంద్ర ప్రభుత్వం నుండి 100 శాతం నిధులతో నిర్వహించే కేంద్ర పథకం. ప్రాజెక్ట్ వ్యవధి 2014 నుండి నాలుగు సంవత్సరాలు. దీని అమలు బాధ్యత స్పెషల్ పర్పస్ వెహికల్స్ (ఎస్‌పివి), సెంట్రల్ పబ్లిక్ సెక్టార్ యూనిట్లు, స్టేట్ పారా-స్టేటల్స్, ఎన్‌జిఓలకు అప్పగించారు. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన మొత్తం 12 నగరాలు హిందూత్వ ఎజెండాతో ముడిపడి ఉన్నాయి. వాటిలో చాలా వరకు హిందూ దేవాలయాలు, వాస్తు శిల్పాలను కలిగి ఉన్నాయి.

**తీర్థయాత్ర పునరుజ్జీవనం, ఆధ్యాత్మిక వృద్ధి డ్రైవ్ (PRASAD)**: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మరొక సంబంధిత పథకం PRASAD. ఇది పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2014-2015 సంవత్సరంలో ప్రారంభించబడింది. ఈ పథకం మతపరమైన పర్యాటకం కోసం భారతదేశం అంతటా పుణ్యక్షేత్రాలను అభివృద్ధి చేయడం మరియు గుర్తించడంపై దృష్టి సారిస్తుంది. ఇందులో గుర్తించబడిన 12 నగరాలు కూడా హృదయ్‌లో వలెనే ఉంటాయి. ఈ పథకం ప్రధానంగా హిందూ తీర్థ యాత్రా కేంద్రాలను, మతపరమైన పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి ఉద్దేశించబడింది.

**నేషనల్ అర్బన్ పాలసీ 2020 :** బీజేపీ నాయకత్వంలోని ప్రభుత్వం 2020లో తన అర్బన్ పాలసీని ప్రకటించింది. ఇది మన దేశాన్ని 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే లక్ష్యాన్ని సాధించడంలో ప్రభుత్వానికి సహాయపడుతుందని భావిస్తున్నారు. దాని ప్రకారం, తయారీ కేంద్రాలు, ప్రాంతీయ వృద్ధి కేంద్రాలు, రవాణా కేంద్రాలు లేదా నౌకాశ్రయాలు, పర్యాటక ప్రదేశాలు, రాజధాని నగరాలు, ఆర్థిక మండళ్ళు లేదా ఆర్థిక, విద్య, ఐటీ హబ్ మొదలైన అభివృద్ధి చెందిన పట్టణ ప్రాంతాలు ఈ మార్పుకు దోహదపడబోతున్నాయి.

ఫలితాల మదింపును బట్టి ప్రాజెక్ట్ ఆధారితంగా నిధులను కేటాయించే ప్రస్తుత పద్ధతికి భిన్నంగా అర్బన్ పాలసిలో మార్పు ఉండాలని అర్బన్ పాలసీ 2020 గట్టిగా పేర్కొంది. ఈ సూత్రం ఆధారంగానే పట్టణ స్థానిక సంస్థలకు వనరులను అందజేస్తామని ప్రకటించింది. ఒక కొత్త 'ఫార్ములా' ప్రభుత్వ కేటాయింపుకు ఆధారం అవుతుంది. ఇది 'రాష్ట్రం పట్టణ జనాభా దాని వార్షిక జనాభా పెరుగుదల రేటు, రాష్ట్ర తలసరి ఆదాయం లేదా కేంద్రం, రాష్ట్రాల మధ్య ఒప్పందం ద్వారా ఏర్పడిన ఏదైనా ఇతర సూత్రాల' ఆధారంగా ఉంటుంది.

దేశాన్నీ పట్టణీకరించే క్రమంలో అవసరమైన అన్ని పెట్టుబడులకు భారత ప్రభుత్వం నిధులు సమకూర్చలేనందున, అది 'స్వయం సహాయక (ఆర్థిక) పట్టణ వృద్ధిని ప్రోత్సహిస్తుంది' అని కేంద్ర ప్రభుత్వం బహిరంగంగా ప్రకటించింది. ఇందుకోసం, ఇది 'మరింత పెంచండి, మరింత పొందండి' (రైజ్ మోర్, గైన్ మోర్) అనే నినాదంతో వాణిజ్య ఫైనాన్సింగ్‌ను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపింది. అటువంటి స్వీయ-ఫైనాన్సింగ్‌ను 'ప్రోత్సహించడం కోసం ప్రభుత్వం కమర్షియల్ ఫైనాన్సింగ్‌ను అమలు చేసే రాష్ట్రాలు, నగరాలకు క్రెడిట్ మార్కెట్‌లో ధరలను తగ్గించడం, వడ్డీ రేట్లలో మినహాయింపులు, పాక్షిక క్రెడిట్ గ్యారంటీలు ఇవ్వటం మొదలైన విషయాలలో జోక్యం చేసుకుని అదనపు ప్రోత్సాహకాలు ఇస్తుంది.

యుఎల్‌బిలు కలిగి ఉన్న పబ్లిక్ ఆస్తులను విక్రయించడం ద్వారా లేదా కనీసం వాటిని ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇవ్వడం ద్వారా ఆదాయాన్ని పొందవచ్చని ఎన్‌యుపిఎఫ్ పేర్కొంది. వాల్యూ క్యాప్చర్ ఫైనాన్స్ (విసిఎఫ్) మరొక పద్ధతి కూడా సూచించబడింది. ఇది కన్వర్షన్ ఛార్జీలు, బెటర్‌మెంట్ ఛార్జీలు, ఇంపాక్ట్ ఫీజులు, డెవలప్‌మెంట్ ఛార్జీల ద్వారా ఆదాయం పొందే విధానం. వీటన్నింటికీ పట్టణ ప్రణాళికను క్రమబద్ధీకరించడం, బలమైన డేటాను నిర్వహించడం అవసరం.

మొట్టమొదటిసారిగా, రాష్ట్రాలు, నగరాలకు మద్దతు ఇవ్వడానికి, ప్రజలకు 'ఫలితాలు' అందించటం కేంద్రం లక్ష్యంగా పట్టణ ప్రణాళిక, నిధులు రెండు ఒక దగ్గరకు తీసుకురాబడ్డాయి. ఫలితాల కచ్చితమైన కొలమానం ఈ ప్రక్రియకు చాలా అవసరం కాబట్టి, ప్రభుత్వం 'డేటా-ఆధారిత పాలన' పేరుతో దాన్ని ప్రోత్సహిస్తోంది. ఈ విధానం ప్రకారం, నగరంలో నివసించే జనాభా, వారికి అందించబడుతున్న సేవలు మొదలైన వివరాలు సేకరించి, భద్రపరుస్తారు. ఈ డేటాను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తారు. ఈ డేటాను ఉపయోగించి, నగరాలు పౌరులందరి రిజిస్టర్‌ను నిర్వహించాలని, వారికి అందించిన సేవలకు అనుగుణంగా పన్నులు, వినియోగదారు ఛార్జీలను విధించాలని ప్రభుత్వం కోరుకుంటోంది. వనరులను పెంచుకోడానికి

'స్వయం–ఫైనాన్సింగ్' (ఆర్థిక స్వయంసమృద్ధి) నగరంగా మారడానికి ఇది చాలా ముఖ్యం. భవిష్యత్తులో నిర్దిష్ట నగరానికి కేటాయించబడే నిధులను వనరుల సేకరణ ఫలితాలు నిర్ణయిస్తాయి. అలాగే ఆ నగర క్రెడిట్ రేటింగ్‌ను నిర్ణయించడంలో కూడా సహాయపడుతుంది. గతంలో ప్రకటించిన స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ ప్రభుత్వ వ్యూహాత్మక దృక్పథానికి అనుకూలంగా ఉందన్న విషయం ఇక్కడ మనకు బోధపడుతుంది.

ఫలితాలను నిధులతో ముడిపెట్టి, కేంద్ర ప్రభుత్వం, ఆర్థిక వనరుల సేకరణలో నగరాలు, రాష్ట్రాలు ఒకదానితో ఒకటి పోటీ పడేలా చేస్తోంది. జూన్ 2023లో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు, నగరాల నుండి ఆశించిన ఫలితాలు లేదా పనితీరు ఆధారంగా నిధులను కేటాయించే విధానాన్ని వివరిస్తాయి.

**అర్బన్ ప్లానింగ్‌పై దృష్టి :** మన దేశంలోని 65 శాతం పట్టణ నివాసాలకు మాస్టర్ ప్లాన్ లేదని ప్రభుత్వం పేర్కొంది. అన్ని స్థాయిలలో ప్రైవేట్ రంగాన్ని భాగస్వామ్యం చేయడానికి, అన్ని పట్టణ కేంద్రాలకు మాస్టర్ ప్లాన్‌ను అభివృద్ధి చేయడం అవసరమని గ్రహించటం వల్ల ఇది ప్రాధన్యతను సంతరించుకుంది. నితి ఆయోగ్ 2021లో భారతదేశంలో పట్టణ ప్రణాళికా సామర్థ్యంలో సంస్కరణలపై ఒక నివేదికను తీసుకువచ్చింది. ఈ నివేదిక ననుసరించి ప్రభుత్వం మరొక ఉన్నత స్థాయి ప్యానెల్‌ను ఏర్పాటు చేసింది. ఏప్రిల్ 2023లో ఈ కమిటీ విస్తృత సిఫార్సులతో 'అమృత్ కాల్‌కు మార్గాలు' పేరుతో 84 పేజీల నివేదికను సమర్పించింది. ఈ రెండు నివేదికలు ప్రైవేట్ సెక్టార్‌తో బలమైన భాగస్వామ్యాన్ని, పట్టణ ప్రణాళిక ప్రాథమిక అంశాలలో సమూల సవరణను సూచిస్తున్నాయి. స్మార్ట్ సిటీలు, అమృత్ మొదలైన గత అన్ని పథకాల ఆలోచనలను ఏకీకృతం చేస్తూ, నగరాల ప్రణాళికా విధానంలో ప్రాథమిక మార్పు కోసం కమిటీ పిలుపునిచ్చింది.

అర్బన్ ప్లానింగ్ రంగంలో ఐఎఎస్, ఐపిఎస్ లాంటి సర్వీస్‌ను ఏర్పాటు చేయాలని, ప్రధానమంత్రి నేతృత్వంలో జాతీయ, ప్రాంతీయ పట్టణ ప్రణాళికా సంస్థను ఏర్పాటు చేయాలని, రాష్ట్రాలు, నగరాల్లో అర్హత కలిగిన అర్బన్ ప్లానర్ల నియామకానికి కేంద్ర మద్దతు, రాష్ట్ర పట్టణ ప్రణాళిక చట్టాల ఆధునీకరణ మొదలైన సిఫార్సులు చేసింది. కోటి జనాభా దాటిన అన్ని నగరాల్లో ఆర్థికాభివృద్ధి మండలి ఏర్పాటు చేయాలని, కోటి కంటే తక్కువ జనాభా ఉన్న అన్ని నగరాల్లో జిల్లా ఆర్థికాభివృద్ధి మండలిని ఏర్పాటు చేయాలని కమిటీ పిలుపునిచ్చింది. పట్టణ ప్రణాళికా రంగంలో సంస్కరణల కోసం, ప్రతి యూనిట్‌కు సుమారు బడ్జెట్‌తో 11 సిఫార్సులు చేసింది. వీటిలో10 ఈ సంవత్సరం నుండి వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని

భావిస్తున్నారు. జూన్ 2023లో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులో ఈ సిఫార్సులు ఉన్నాయి.

రాష్ట్ర నియామక నియమాల ఆధునీకరణ, రాష్ట్ర పట్టణ ప్రణాళిక చట్టాల ఆధునీకరణ, జాతీయ పట్టణ పరిశోధన, ఆవిష్కరణల నిధి, ఆల్ ఇండియా అర్బన్ ప్లానింగ్ సర్వీస్, టౌన్ అండ్ కంట్రీ ప్లానర్స్ బిల్లు తక్షణ చర్య కోసం సిఫార్సులు చేయబడ్డాయి. ఒక మధ్యంతర సిఫార్సు ఏమిటంటే, కేంద్ర స్థాయిలో పట్టణ ప్రణాళికా సంస్థాగత క్రమబద్ధీకరణ 2024 నాటికి ప్రారంభించబడాలి.

కేంద్ర, రాష్ట్ర, జిల్లా పరిపాలన పరిధిలోని 50,000 మంది అధికారులను కవర్ చేసే నిర్మాణాత్మక జాతీయ పట్టణ ఒరవడి కార్యక్రమాన్ని. ప్రధానమంత్రి ప్రారంభించాలని కూడా కమిటీ సిఫార్సు చేసింది. జూనియర్ స్థాయిలో 2,000 మంది అర్బన్ ప్లానర్లను, మధ్య స్థాయిలో 850 మందిని, 350 మంది బహుళ శాఖలలో నిపుణులైన వారిని నియమించుకునేందుకు ఐదేళ్ల వ్యవధిలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు నిధులు కేటాయించాలనే సూచనతో అర్బన్ ప్లానర్ల భారీ నియామకాలను కమిటీ నిర్దేశించింది. MOHLUA అర్బన్ ప్లానర్లు, డిజైనర్ల నియామక, సర్వీసు నిబంధనలను ఆధునికరించటానికి రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్యానెల్ పేర్కొంది.

కేంద్ర ప్రభుత్వం తన ఆర్థిక అధికారాన్ని ఉపయోగించి, లోపాయకారిగా సంస్కరణల అమలుకు ఒత్తిడి తెస్తోంది. గతంలో ప్రతి పట్టణ కేంద్రం లేదా నగరం/పట్టణానికి ఉన్న ప్రత్యేకత, విభిన్నతల ఆధారంగా అభివృద్ధి కార్యక్రమాలు తీసుకోబడేవి. ఇప్పుడు ఆ దృక్పథం కొరవడింది. కేంద్రీకృతం, యూనిఫామ్ (ఏకరూప) అభివృద్ధి మోడల్ బలవంతంగా రుద్దబడుతోంది. ఒక పట్టణము ఏ విధంగా రూపొందించాలి, భూమిని ఏవిధంగా ఉపయోగించాలి, ఏ రీతిలో మురికివాడలు అభివృద్ధి చేయబడాలి, ఇళ్లు, రోడ్లు ఎలా నిర్మించాలి, నీటి, మురుగు పారుదల మొదలైన వాటిని ఏ విధంగా ఉపయోగించాలి, ఏ రకమైన రవాణాను ఉపయోగించాలి మొదలైన విషయాలలో కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణితో హెటెరోజెనిటీ (విజాతీయత) స్థానంలో హెూమోజెనెటీ (సజాతీయత) చోటుచేసుకుంది. ఈ బహిరంగ కేంద్రీకరణ నయా ఉదారవాద అజెండా అమలును సులభతరం చేయటానికి ఉద్దేశించబడింది.

కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ప్రస్తుత మార్గదర్శకాలు ఈ నేపథ్యంలో వచ్చినవే.

ప్లానర్‌గా ఎవరిని నియమించాలనే దాన్ని నిర్దేశించటం ద్వారా, ప్రభుత్వం కాంట్రాక్ట్ బేస్డ్ నియామకాలు చేపట్టవచ్చని, ప్రైవేట్ నిపుణులని ఉపయోగించాలని సూచిస్తుంది. ప్రైవేట్ డెవలపర్‌లు, బిల్డర్‌ల కోసం పని చేస్తున్న వ్యక్తులను ప్లానర్‌లుగా నియమించుకోవాలనే దానికి ఇది పరోక్ష సూచన. ప్రైవేట్ బిల్డర్‌లు/డెవలపర్‌లకు మార్గం సులభతరం చేయడానికి నగరాలను రూపొందించే విధానంలో ఏకమొత్తంగా మార్పును ప్రతిపాదించారు. పట్టణ ప్రణాళికపై సమగ్ర దృక్పథాన్ని కలిగి ఉండాల్సిన యుఎల్‌బి లచే నిర్వచించబడిన మొత్తం నిబంధనలను ప్రైవేట్ బిల్డర్లు నిర్ధారించటానికి బదులు, ప్రైవేట్ బిల్డర్లు వారి అవసరాలకు అనుగుణంగా నగర అభివృద్ధిని రూపొందిస్తారు. ఇది నగరాలపై ప్రజల ఉమ్మడి హక్కును లాగేసుకుని, ప్రైవేట్ డెవలపర్ల చేతుల్లో ఉంచుతోంది.

పట్టణ ప్రణాళిక లేదా అభివృద్ధిని ప్రైవేటు వ్యక్తులకే వదిలేయాలని కేంద్ర ప్రభుత్వం బలంగా కోరుకుంటోంది. ప్లానర్‌ల రిక్రూట్‌మెంట్‌కు అనుసరించే మార్గదర్శకాల శ్రేణిలో, యుఎల్‌బిలు రాష్ట్ర ప్రభుత్వాలు టౌన్‌షిప్ విధానం, భూ వినియోగ విధానం, బిల్డింగ్ బై-లాస్ మొదలైనవాటిని మార్చాలని, మానిటైజేషన్ కోసం ఉచిత భూమిని వినియోగించాలని కోరుతోంది. ఇది కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ మానిటైజేషన్ పైప్‌లైన్, ల్యాండ్ మానిటైజేషన్ పాలసీ విధానానికి అనుగుణంగా ఉంది. సాధ్యమైనంత ఎక్కువ భూమిని విడిపించి, దానిని పూల్ చేసి, ప్రైవేట్ సంస్థల అభివృద్ధికి అందుబాటులో ఉంచడం వీరి లక్ష్యం. 2050 నాటికి గల పట్టణ జనాభాలో 50 శాతం మంది అవసరాలను తీర్చడానికి పట్టణ విస్తరణ చేస్తున్నామనే ముసుగులో ఇదంతా జరుగుతోంది.

నయా ఉదారవాదం ప్రస్తుత దశలో, భూమి చాలా విలువైన ఆస్తి. భూమి చుట్టూ కేంద్రీకృతమై ఉన్న అన్ని ఆర్థిక కార్యకలాపాలు అదృష్టాన్ని (లాభాలను) నిర్మించుకోవడానికి మార్గాలుగా చూడబడతాయి. ఈ అనిశ్చిత కాలంలో రియల్ ఎస్టేట్, స్పెక్యులేషన్, బిల్డింగ్, అద్దె స్థలాలు అన్నీ ప్రధాన ఆదాయ వనరులుగా పరిగణించబడతాయి. మనుషులు జీవించి ఉన్నంత కాలం వారికి తల దాచుకునేందుకు నీడ కావాలి. ఈ అవసరాన్ని భూ తిమింగలాలు ఉపయోగించుకుంటున్నాయి. కేంద్ర ప్రభుత్వం తన సంస్కరణ ఎజెండా ద్వారా ప్రోత్సహిస్తోంది. అభివృద్ధి పేరుతో భూమిని ప్రైవేట్ అవసరాలకు ఎలా కైవసం చేసుకోవచ్చో చెప్పటానికి అహ్మదాబాద్‌లోని సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ (2003) చక్కని ఉదాహరణ. రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ నుండి సేకరించిన భూమిలో దాదాపు 74 శాతం ప్రైవేటీకరించబడిందని అంచనా.

ఇదే విధమైన కేటాయింపులు దేశవ్యాప్తంగా పునరావృతం చేయాలని కోరుతున్నారు.

మురికివాడల అభివృద్ధిని ప్రోత్సహించే పేరుతో ఉన్నప్రాంతంలోనే అభివృద్ధి చేసి సమాంతర (వర్టికల్ గ్రోత్) చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. అంటే మురికివాడలలో నివాసించేవారి కోసం బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం చేయడం. మురికివాడలలో ప్రస్తుతం ఇళ్ళు సమాంతరంగా ఎక్కువ భూమిని ఆక్రమించి ఉంటాయి. వాటిని తీసేసి విస్తారమైన ఆ భూములను ప్రైవేట్ డెవలపర్‌లకు హస్తగతం చేస్తారు. తొలగించబడిన మురికివాడల ప్రజల కోసం బహుళ అంతస్థుల ఇళ్లను నిర్మించే పని కూడా వారికే అప్పగిస్తారు. ప్రైవేట్ డెవలపర్లు మురికివాడల నివాసితులకు ఇళ్లను నిర్మించడానికి 'తగినంత పెట్టుబడి కలిగి ఉంటారు' కాబట్టి, వారికి కేటాయించిన భూమిని డబ్బు ఆర్జించడానికి, ఈ విధంగా సేకరించిన వనరుల నుండి, స్లమ్స్ నివాసులకు ఇళ్లను నిర్మించడానికి వారికి అనుమతి ఇస్తారు. ఒకవేళ భూమిని చేజిక్కించుకున్న తర్వాత ప్రైవేట్ డెవలపర్లు తొలగించబడిన మురికివాడల నివాసితులకు ఇళ్లను నిర్మించడానికి తగిన వనరులను సేకరించలేమని కనుక వాదిస్తే ఏమి జరుగుతుందో తేలికగా అంచనా వేయవచ్చు.

ప్రైవేట్ బిల్డర్లు వారికి బదిలీ చేసిన భూమిని డబ్బు ఆర్జించేందుకు ఉపయోగించేందుకు వీలుగా బిల్డింగ్ ఉపచట్టాలలో మార్పు చేయాలని మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. సెట్‌బ్యాక్ ఏరియా, గ్రౌండ్ కవరేజీ, అనుమతించదగిన ఎత్తు, ఎఫ్ఎస్ఐ, అన్నీ వారి అభిరుచులకు అనుగుణంగా మార్చబడతాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కోవిడ్ టైమ్ స్కీమ్‌లలో మరొకటి– సరసమైన అద్దె హౌసింగ్ కాంప్లెక్స్‌ల (ఏఆర్‌హెచ్‌సి) నిర్మాణంలో ప్రైవేట్ డెవలపర్‌లు అటువంటి ప్రోత్సాహకాలతో ఎలా లాభపడ్డారో ఇక్కడ గుర్తుచేసుకోవటం అసందర్భం ఏమి కాదు.

**అనేక రాయితీలు మినహాయింపులు ఇవ్వబడిన ప్రైవేట్ సంస్థలచేత ఈ ఏఆర్‌హెచ్‌సిలు అభివృద్ధి చేయబడాలి :** ఏఆర్‌హెచ్‌సిల ఆపరేషన్ ద్వారా ఆర్జించిన లాభాల పైన ఆదాయపు పన్ను మరియు జివిస్టీ నుండి మినహాయింపు; ఎవిఫ్‌హెచ్ క్రింద హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు (HFC), ప్రాధాన్యతా రంగం రుణాలు (PSL) మరియు కమర్షియల్ బ్యాంక్‌ల నుండి ప్రాజెక్ట్ ఫైనాన్స్ / రుణాలపై వడ్డీ రేట్లలో రాయితీలు ; అనుమతులలో మార్పులు; అవసరమైతే అదనంగా 50 శాతం ఎఫ్ఎఆర్/ఎఫ్ఎస్ఐ; సింగిల్ విండో విధానం ద్వారా (30 రోజుల లోపు) ARHC ప్రాజెక్ట్‌లకు ఉచితంగా విధానపరమైన అనుమతులు; ప్రాజెక్ట్ స్థలం వరకు మౌలిక సదుపాయాల నిర్వహణ; నివాస గృహ ఆస్తులతో సమానంగా మునిసిపల్ చార్జీలు." ప్రస్తుత మార్గదర్శకాల వల్ల వీటితో పాటుగా రాబోయే రోజుల్లో ప్రైవేట్

డెవలపర్లు మరిన్ని బోనస్‌లు పొందనున్నారు.

చిన్న ప్రైవేట్ యజమానుల చేతుల నుండి ఏఆర్‌హెచ్‌సిలు అద్దె మార్కెట్‌ను స్వాధీనం చేసుకుని కార్పొరేట్ల చేతుల్లోకి మార్చడానికి నియమించబడ్డారు. అద్దెదారుల విషయంలో ప్రభుత్వం పాత్ర ఎక్కువగా 'వోచర్లు' ఇవ్వడం. ఎందుకంటే ప్రైవేట్ ఇళ్ల నిర్మాణానికి సబ్సిడీ ఇవ్వడం కంటే దీని ద్వారానే ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చు. ప్రభుత్వం ఏఆర్‌హెచ్‌సీఎస్‌ను ప్రోత్సహించాలని కోరుకోవడానికి ఇది మరో కారణం.

ఎస్‌బిఎంయు, స్మార్ట్ నగరాలు మొదలైన పథకాలు వచ్చిన తర్వాత అర్బన్ శానిటేషన్ పాలసీ (ఎన్‌యుఎస్‌పి), హెరిటేజ్ సిటీ డెవలప్‌మెంట్ అండ్ ఆగ్మెంటేషన్ యోజన (హృదయ్) వంటి ఇతర పట్టణ అభివృద్ధి పథకాలు ఉపసంహరించబడ్డాయి. పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు సంబంధించిన ఏకైక పథకం నేషనల్ అర్బన్ లైవ్లీహుడ్స్ మిషన్ (ఎన్‌యుఎల్‌ఎం), ఇది 2013లో ప్రారంభించబడింది. ఇది పట్టణ పేద కుటుంబాల పేదరికం, దయనీయ పరిస్థితులను తగ్గించడానికి ఒక జీవనోపాధిని ప్రోత్సహించే కార్యక్రమం. స్వయం ఉపాధి పొందడం మరియు నైపుణ్యం కలిగిన వేతన ఉపాధి అవకాశాలు ద్వారా వారి జీవనోపాధిని మెరుగుపరుస్తుంది. ఇది పట్టణ వీధి వ్యాపారుల జీవనోపాధి సమస్యలను కూడా పరిష్కరిస్తుంది. ఈ పథకం 790 నగరాల్లో అమలు చేయబడింది. కానీ ముఖ్యంగా, ఈ పథకాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం వనరులను కేటాయించలేదు. లేదా అందుకు తగ్గ రాజకీయ సంకల్పం లేదు.

**ముగింపు :** పట్టణీకరణ విధానాలు ఎల్లప్పుడూ పాలక వర్గాల ప్రయోజనాలకు, ప్రత్యేకించి పెట్టుబడిదారీ వర్గానికి ఉపయోగపడతాయి. వారి అవసరాలకు అనుగుణంగా నగరాల ప్రణాళిక మరియు రూపకల్పన కూడా జరిగింది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో మార్పులు మరియు సంక్షోభాలతో, మన GDPలో ప్రధాన భాగాన్ని ఉత్పత్తి చేసే పట్టణ ప్రాంతాలలో పాలన రూపాంతరం చెందింది. భూమిని మోనటైజేషన్ చేయడం, ప్రభుత్వ స్థలాలను ప్రైవేట్ భూములుగా మార్చడం, నీరు మరియు పారిశుధ్యం వంటి ప్రాథమిక సేవలను అందించడానికి ఛార్జీలు వసూలు చేయడం వంటివి కొత్త ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఏ వికేంద్రీకరణను ప్రతిపాదించినా, ఆర్థిక లేదా పరిపాలనా అధికారాలపై నియంత్రణ ఉండదు. కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత స్థాయి వ్యక్తులు (ప్రస్తుతం పెరుగుతున్న కేంద్ర ప్రభుత్వం) – యుఎల్‌బిలపై అపారమైన నియంత్రణను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ వస్తువుల ప్రైవేటీకరణ వేగం పుంజుకుంది. మన దేశంలో విస్తరించిన అసమానతలకు నగరాలు ప్రత్యక్ష నమూనాలుగా మారాయి. ఈ నేపథ్యంలో, మన దేశంలో పట్టణీకరణకు సంబంధించిన విధానాలలో వస్తున్న మార్పులను మనం అధ్యయనం

చేయడం, అర్థం చేసుకోవడం మాత్రమే కాదు, పౌరులకు అవగాహన కల్పించడానికి, ప్రతిఘటనలో వారిని సమీకరించడానికి కూడా ప్రయత్నించాలి.

IV

## పట్టణీకరణ సమస్యలు

సేవలను అందించడంలో భారతదేశంలోని అనేక పట్టణాలు వెనకబడి ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం పట్టణాలలోని 70% ప్రజలకు మాత్రమే పైపుల ద్వారా తాగునీరు అందుబాటులో ఉంటున్నది. 33% మంది మాత్రమే మల విసర్జనలను పైపుల ద్వారా తొలగించుకునే వెసులుబాటు కలిగి ఉన్నారు. 38% సెప్టిక్ ట్యాంక్‌ల ద్వారా తొలగించుకోగలుగుతున్నారు. 2030 నాటికి భారతదేశంలో అవసరం అయ్యే నీటిలో సగం మాత్రమే అందుబాటులో ఉంటుంది. అంటే, పెద్ద ఎత్తున నీటికి ఏర్పడుతుంది; దాదాపు స్థూల జాతీయోత్పత్తిలో 6% తరుగు ఏర్పడబోతున్నది. పట్టణ ప్రాంతాల్లో దాదాపు 20% మంది ప్రజలు కచ్చా పచ్చా స్థిరనివాసాలలో ఉంటారు. ప్రజా రవాణా కోసం 2,60,000 బస్సులు అవసరం కాగా అందులో ఆరవ వంతు అందుబాటులో ఉంటాయి. 2030 నాటికీ భారతదేశంలో మౌలిక వసతుల కల్పనకు $ 1.2 ట్రిలియన్లు జొప్పించవలసిన అవసరం ఉంది.

**సరుకులుగా మార్చడం :** గతంలో అనేక ప్రభుత్వ సేవలు, ఎటువంటి చెల్లింపుల అవసరం లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండేవి. అందువలన కార్మికులు తమ వేతనాలను మౌలిక జీవనావసరాలకు వినియోగించుకునే వారు. ఇల్లు, నీరు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం వంటి సేవలకు జీతాలు వినియోగించుకోవలసి వస్తే, వచ్చే జీతాలు కనీసావసరాలు తీరడానికి కూడా సరిపోవు. నయా–ఉదారవాద విధానాలు అమలవుతున్న నేటి తరుణంలో ప్రభుత్వాలు నివాసప్రాంతాల్లో కనీసావసరాలు తీర్చే బాధ్యత నుండి వైదొలగి వాటిని ప్రైవేటువారికి అప్పగిస్తున్నది. ఇప్పుడిక గృహాలు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం నీరు, ఇతర సేవలన్నీ సరకులుగా మారిపోయాయి. అవన్నీ ప్రైవేటు వారి ఆధీనంలోకి వెళ్లిపోయాయి. వారికి లాభాలు తెచ్చిపెట్టే మార్గాలుగా మారాయి. అందువలన కార్మికులు తమ వేతనాలలో అధికభాగం అత్యవసర సేవలు ఖరీదు చేయడానికి వెచ్చించవలసి వస్తున్నది. ఇది కింది, మధ్యతరగతి ప్రజలకు పెనుభారంగా మారింది.

ప్రజాసేవలన్నిటిని లాభాల కోసం సరుకుగా మార్చడాన్ని మనం సూత్రబద్ధంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉంది. సేవలను వినియోగించుకోవడానికి

చేసే వసూళ్ళ భారానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయాల్సి ఉంది.

**వినిమయ సేవల వసూళ్లు :** ఈనాటి పెట్టుబడిదారీ వ్యవస్థలో, పట్టణీకరణలో అతి ప్రధానమైన అంశం, ప్రతి నిత్యావసర సేవను అమ్మకానికి పెట్టడం, నీటి సరఫరా పై మీటర్లు బిగించడం, చెత్తను సేకరించేందుకు పన్ను వేయడం, మలవిసర్జనలను తొలగించడానికి, రోడ్లు వేయడానికి, పార్కులు కట్టడానికి, ఇతర సాధారణ ప్రజలు ఉపయోగించుకునే సేవలనన్నిటిని ప్రైవేటుపరం చేయడం. ఎన్‌యుపిఎఫ్ (నేషనల్ అర్బన్ పోలిసి ఫ్రేమ్ వర్క్) 2020 అమలు చేయడంలో యూజర్ చార్జీలు వేయడం మరింత వేగంగా అమలవుతున్నది. దీని ఉద్దేశం ఏ నగరానికి ఆ నగరం తనకు కావలసిన వనరులను సమీకరించుకోవాలని చెప్పడం. దీని ప్రకారం నీటి సరఫరాలో, నిర్వహణలో 30–35%, పారిశుధ్య నిర్వహణలో 50% మాత్రమే వసూలు చేస్తున్నట్టు ఎన్‌యుపిఎఫ్ చెబుతున్నది. ఇది స్థానిక సంస్థలు సమర్థవంతంగా పనిచేయడానికి అవసరమని వాదిస్తున్నది.

**తాగునీరు, పారిశుద్యం :** పట్టణ ప్రాంతాలన్నిటిలో పారిశుధ్యం, తాగునీటి కొరత స్పష్టంగా కనిపిస్తుంది. మున్సిపాలిటీలు, స్థానిక ప్రభుత్వాలు తీవ్రమైన నిధుల కొరత ఎదుర్కొంటున్నాయి. అందువలన పారిశుధ్యం కొరవడుతుంటుంది. సూయెర్స్ ఎక్కడపడితే అక్కడ పొంగి ప్రవహిస్తుంటుంది. వాటిని దగ్గరలో నున్న నదులలోకి, కాలువలలోకి, సముద్రంలోకి మళ్లిస్తున్నారు. ఫలితంగా టైఫాయిడ్, డిసెంట్రీ, ప్లేగు, విరేచనాలు వంటి రోగాలు వేగంగా వ్యాపిస్తున్నాయి. వాటి వలన ప్రజలు చనిపోతున్నారు కూడా.

పట్టణాల చుట్టూ నీటి సరఫరా కొరత ఉంటుంది. అక్కడ నివసిస్తున్న ప్రజల ఒత్తిడి ఎక్కువగా ఉండటంవలన సరఫరాలో కొరత ఏర్పడుతుంది. అత్యంత పేదలు నివసించే ప్రాంతాలలో నీటి కొరత, పారిశుధ్య లోటు అతి ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు తాగునీరు, పారిశుధ్యం తగినంత అందుబాటులో ఉండవు. లెట్రిన్లు, సెప్టిక్ ట్యాంకులు నిండి వెలుపలికి పారుతుండడంతో ఆ ప్రాంతాలు కలుషితం అవుతుంటాయి. అందువలన వారి ఆరోగ్యాలు పాడవుతుంటాయి. మురికి వాడల్లో నివసించే ప్రజలు, పట్టణప్రాంతాలలో పేద ప్రజలుండే ప్రాంతాలు అత్యవసరమైన ప్రభుత్వ సేవలకు దూరమవుతున్నారు.

పట్టణ ప్రాంతాల్లో ఉండే అనేక నదులు ఈ విధంగా కాలుష్యానికి గురవుతుండడం వలన దాని ప్రభావం అక్కడి జనాభాపై విపరీతంగా ఉంటుంది – ఆ నీరు తాగేందుకు, వ్యవసాయానికి ఉపయోగపడకుండా పోతుంది. ఇళ్లలోని వ్యర్థాలు, వాణిజ్య, పారిశ్రామిక వాడల వ్యర్థాలుకూడా నదులలోకి వదిలేస్తుంటారు. మానవ

విసర్జనల లోని వ్యర్థాలలో సేంద్రీయ పదార్థాలు, పోషకాలు ఉంటాయి; కానీ పారిశ్రామిక వ్యర్థాలలో విషపదార్థాలు ఉంటాయి. ఇవి నీటిని మనుషుల వాడుకకు పనికి రాకుండా చేస్తాయి. పైగా ఈ వ్యర్థాలు భూమిలోకి కిందికి ఇంకి భూగర్భ నీటిని కూడా కలుషితం చేస్తాయి.

**వ్యర్థాలు :** పట్టణ ప్రాంతాలు అక్కడ నివసించే వారి వ్యర్థాలను – సేంద్రియ పదార్థాలు, ప్యాకేజిలు, నిర్మాణ పదార్థాలు – విసర్జించవలసి ఉంటుంది. చాలా పట్టణాలలో ఘనవ్యర్థాలు సరైన పద్దతులలో విసర్జించేందుకు అవకాశాలు ఉండవు లేదా అసమర్థవంతంగా ఉంటాయి – ఘన వ్యర్థనలు సరైన రీతిలో విసర్జించడం అంటే – సేకరించడం, ఒకచోటినుండి వేరొక చోటికి మార్చడం, తిరిగి వినియోగించగలిగిన మార్గాల వైపు మళ్లించడం; మార్పుచేయలేని వ్యర్థాలు, ప్లాస్టిక్, ఎలక్ట్రికల్ పరికరాలు వగైరాలు. ఈ వ్యర్థాల్లో, పరిశ్రమల నుండి వెలువడేవి, హాస్పిటల్‌ల నుండి వెలువడేవి కూడా ఉంటాయి. వీటిలో హానికరమైనవి, విషతుల్యమైనవి ఉంటాయి. ఇటువంటి వ్యర్థాలను విసర్జించడానికి ప్రత్యేక శ్రద్ధ అవసరం. పట్టణాలలో వ్యర్థాలు సాధారణంగా వీధుల చివర్లలో, బహిరంగ ప్రదేశాలలో, వృధాగా పడి ఉన్న స్థలాల్లో, కాలువలలో, నదులలో పడేస్తుంటారు. పట్టణాలకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో, ఖాళీ స్థలాలు అందుబాటులో ఉండడం వలన ఇలా జరుగుతుంటుంది. ఇది భూగర్భ జలాలను కాలుష్యమయం చేస్తుంది. అంతేకాదు, ఈ వ్యర్థాలను కాల్చడం ద్వారా వాతావరణం కలుషితం అవుతుంది.

**ఆరోగ్యం :** కిక్కిరిసి ఉన్న పట్టణ ప్రాంతాలల్లో, ప్రజలకు గృహవసతి, జీవనం దుర్భరమయ్యాయి. ఆరోగ్య సేవలు, పారిశుధ్యం నీటి సరఫరా, అందుబాటులో లేకుండా పోయాయి. తాగు నీరు కలుషితం అయ్యింది. అంటువ్యాధులకు ఆలవాలాలయ్యాయి. పట్టణ కాలుష్యం కారణంగా అలెర్జిలు, ఆస్తమాలు, సంతానలేమి, ఆహారం విష తుల్యమవడం, కాన్సర్, అకాలమరణాలు సంభవించడం జరుగుతున్నాయి. ప్రభుత్వం ఆరోగ్య రంగం నుండి తప్పుకుని ప్రైవేటురంగానికి అప్పచెప్పేయడం వలన ప్రజలకి తమ ఆరోగ్యరక్షణ పెనుభారంగా మారింది.

**విద్య :** ప్రైవేటీకరించబడడం, వ్యాపారీకరించబడడం వలన పేదపిల్లల కుటుంబాలకు విద్య పెను భారంగా మారింది. పట్టణాలలోని స్థానిక సంస్థలలో నిధులు కొరత తీవ్రంగా ఉండడంతో విద్యకి నిధులకేటాయింపుకి ప్రాధాన్యత తగ్గుతుంది.

**మౌలిక సదుపాయాలు :** రోడ్లు, వీధి దీపాలు, నడకదారులు, బహిరంగ ప్రదేశాలు, మురుగు కాలువలు, పారిశుద్యం వంటి మౌలిక సదుపాయాలు మృగ్యంగా

మారాయి. ఉదాహరణకి వానలు పడగానే పాడుపడిన ఇళ్ళు కూలిపోతూ ఉంటాయి; నీళ్లు ఎక్కడికక్కడ నిలబడిపోతుంటాయి. వరదలు వచ్చి జనజీవనం అస్తవ్యస్తం అవుతుంటుంది.

**మురికి వాడలు :** భారతదేశంలో 13.7 మిలియన్ల మురికివాడల్లో 65.49 మిలియన్ల ప్రజలు జీవిస్తున్నారు. భారతదేశంలోని నగరాలనానుకుని 65% మురికివాడలున్నాయి. నగరాలలోని పేదలు ఈ మురికివాడలలోనే జీవిస్తూ ఉంటారు. మురికి వాడలు ప్రజలతో కిక్కిరిసి ఉంటాయి. జీవనం దుర్భరంగా ఉంటుంది. అనేక సమస్యలు ఉంటాయి.

మురికివాడలలో ఇళ్ళు ఇరుకుగా ఉంటాయి. నాణ్యతలేని చవకబారు పదార్థాలనుపయోగించి ఒక ఇంటి మీద ఒకటి కడతారు. రవాణా సదుపాయాలు, విద్యుత్ సరఫరా, నీటి సరఫరా, పారిశుధ్య వసతులు సరిగ్గా ఉండవు. ఘనవ్యర్థాల విసర్జన సదుపాయాలు ఉండకపోవడం వలన కాలుష్యం తీవ్రతరం అవుతుంది; చర్మవ్యాధులు ఎక్కువగా ఉంటాయి; చావులు కూడా అధికంగా ఉంటాయి; అనిశ్చిత జీవన పరిస్థితులు ఉండడం వలన, బలవంతంగా ఉద్యోగాల నుండి తొలగించబడతామనే భయంతోనే నిరంతరం బతుకులు వెళ్లదీయాల్సిన పరిస్థితి ఉంటుంది.

నిరుద్యోగం, అధిక ధరలు మురికివాడల వ్యాప్తికి, కబ్జాలు చేసి గుడిసెలు వేసుకోవలసిన పరిస్థితికి దోహదపడతాయి. పారిశ్రామికీకరణ వేగం పుంజుకుంటున్న కొద్దీ, మురికివాడల వ్యాప్తి వేగం పెరుగుతుంది. అభివృద్ధి చెందిన ఇంటి స్థలాలు లేకపోవడం, గ్రామాలలో ఉద్యోగాలు లేక అక్కడి నుంచి పట్టణాలకు మెరుగైన జీవనాన్ని వెతుక్కుంటూ పెద్ద సంఖ్యలో వలసలు రావడం వలన కూడా మురికివాడలు పెరుగుతాయి. పట్టణాలలో నివసించే నిరుపేదలు కూడా ఈ మురికి వాడలకి తరలిపోతుంటారు. నగరాలు ఎదుర్కొనే అతిపెద్ద సమస్య పేదరికం. నగరాలలోని పేదరికం, భౌతికంగాను, సామాజికంగానూ, పర్యావరణాన్ని దిగజారుస్తుంది. పట్టణాలలో నిరుద్యోగం అధికం; అందులోనూ విద్యావంతులలో ఈ నిరుద్యోగ శాతం మరింత అధికం.

పెట్టుబడిదారీ సమాజం ఉత్పత్తిచేసే సామాజిక సాంస్కృతిక అణచివేతే, అది నిరంతరంగా గోనసాగేలా చేస్తుంది; ప్రజలుండే అట్టడుగు సామాజిక ఆర్థిక అట్టడుగు స్థాయినుండి వారిని పైకి లేవనివ్వకుండా చేస్తుంది. మురికివాడల్లో నివసించే వారిని గురించి చేసిన పరిశోధనలో, అక్కడ నివసించే అత్యధికులు షెడ్యూల్ కులాలకు చెందిన వారని, జాతి సామాజిక నిర్మాణంలో అత్యధమ స్థాయిలో ఉన్నవారని తేలింది. పట్టణాలలో ఉండే షెడ్యూల్ కులాలలో 17% మురికివాడల్లో నివసిస్తారు. అది వారి

సామాజిక పొందిక కంటే చాలా ఎక్కువ. అంటే వారంతా వెలివాడలలో విసిరేయబడ్డారన్నమాట. అదేవిధంగా పట్టణాలలో నివసించే ముస్లింలలో 26% మంది తమ మతంవారు 80% కన్నా ఎక్కువగా నివసించే ప్రాంతాలలోనే నివసిస్తున్నారు. ఈ ప్రాంతాలు కూడా అత్యంత పేదలు నివసించే ప్రాంతాలే. ఈ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు అతి తక్కువగా ఉంటాయి. నయా-ఉదారవాద విధానాల ద్వారా ఏర్పడే అభివృద్ధి కార్యక్రమాలకు అణగారిన ప్రజానీకం దూరంగా పెట్టబడుతున్నారు. మురికివాడలలో నివసించడం అంటే, పేదరికంలో నెట్టివేయబడడం, మురికివాడలేతర పట్టణ ప్రాంతం అభివృద్ధి చెందినా, ఇవి మాత్రం ఆ ఆభివృధికి ఆమడ దూరంలో ఉంటాయి.

ఈ విధంగా మురికివాడలు ఆర్థిక ప్రగతి నుండి ప్రత్యేకంగా దూరంగా ఉంచబడడడమే కాదు, అభివృద్ధి క్రమానికి తప్పనిసరిగా దూరంగా ఉంచివేయబడాల్సిన అవసరం ఉందని భావించడం కూడా జరుగుతుంటుంది. అభివృద్ధి, స్వేచ్ఛా వ్యాపారం కొనసాగాలంటే కష్టాలు, పేదరికం తప్పనిసరిగా ఏర్పడే పరిస్థితులని, సమస్యాత్మక మురికివాడలలో నివసించేవారే, తమ దుర్భర జీవన పరిస్థితుల భారాన్ని మోయాలని, ప్రభుత్వం జోక్యం ఏమాత్రం లేకుండానే తమ స్థితి నుండి తామే బయటపడాలని దీనర్ధం.

అధికారులు, నగరాలలో నివసించే మధ్యతరగతివారు, నగరాలలో నివసించే పేదల పట్ల శత్రు వైఖరి కలిగి ఉండడం స్పష్టంగా కనిపిస్తుంది. నగరాల సుందరీకరణ, మౌలిక సదుపాయాలు కల్పన, ప్రైవేటు పెట్టుబడులు ఆకర్షించడానికి సరికొత్త నగరీకరణలో భాగంగా మారింది. ఇప్పుడు మురికివాడలు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంలో పునర్నిర్మించబడుతున్నాయి . తిరిగి పేద లను నగర శివార్లలోకి తరలించడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని ప్రధాన నగర ప్రాంతాలలో విస్తరించడం జరుగుతున్నది. మురికివాడల పునర్ ప్రతిష్టించడం వారిని సమాజం నుండి మరింత వెలివేయడానికి ఉపయోగ పడుతున్నది; అక్కడ ప్రజలను మతాలవారి, కులాల వారి విభజించడం జరుగుతున్నది. శబరిమల నది ముఖ ద్వారం అభివృద్ధి చేసే క్రమంలో అహమ్మదాబాద్‌లో జరిగినది ఇదే.

**గృహాలు :** ఉత్పత్తి ఒకే చోట, అదికూడా పట్టణ పరిధిలో జరగాలంటే, కార్మికులు ఆ చుట్టుపక్కలే ఉండడం అవసరం. మొదట్లో పెట్టుబడిదారులు పని ప్రదేశాల పక్కనే కార్మికులకు ఇళ్ళు కట్టించి ఇచ్చి ఈ సమస్యను పరిష్కరించుకున్నారు. కానీ నయా-ఉదారవాద విధానాలు అమలవడం మొదలయినప్పటి నుండి ఈ విధానానికి స్వస్తి పలికారు. కార్మికులు తమకు తాము, తమకు అందుబాటులో

ఉన్న ధరలకు ఇళ్లను వెతుక్కోవాల్సి వచ్చింది. కార్మికులు ఇళ్లకి అద్దె చెల్లించగల స్తోమత, తమ శక్తి, సామాజిక సంబంధాల ఆధారంగా ఇళ్లను వెతుక్కుంటారు. అందువలన ఇళ్ల అద్దెలు ప్రజల ఖర్చులలో పెద్ద భాగాన్ని ఆక్రమించాయి.

ద్రవ్య పెట్టుబడి రియల్ ఎస్టేట్, ఇళ్ల నిర్మాణంలో పెద్ద ఎత్తున జొరపడింది. గేటెడ్ కమ్యూనిటీస్, బహుళ అంతస్తుల భవనాలు, ఆకాశహర్మ్యాలు ఇబ్బడిముబ్బిడిగా తయారయ్యాయి. సాధారణ ప్రజానీకానికి భూముల ధరలు అందుబాటులో లేకుండా పోయాయి. అభివృద్ధి పేరుతో పేదలు తమ నివాసాల నుండి తొలగించబడ్డారు. నగరాల అంచులకు తరిమేయబడ్డారు. మురికివాడలను నిర్మూలించారు. ప్రభుత్వాల సహాయంతో ఆ భూములు కార్పొరేట్లు కాజేశారు. పేదలను నగరాల మధ్య నుండి పొలిమేరలకి తరిమేయడానికి ఇదో సాధనంగా మారింది.

**భూమి ఉపయోగం, సంపద పన్ను వేయడంలో మార్పులు, నిర్మాణ రంగం నియమాలలో మార్పులు :** భూములని ఉపయోగించే విధానాలలో చేసిన మార్పుల వలన, పేదలకి సొంత ఇంటి కల కనడం కూడా కష్టంగా ఉన్నది.

**అద్దెలు :** ద్రవ్య పెట్టుబడి/సట్టా వ్యాపారాన్ని ప్రోత్సహించే విధానాలు భూ మార్కెట్లో అమలుచేయడం వలన భూమి ధరలు విపరీతంగా పెరిగిపోయి పేదలకి కాదు కదా మధ్యతరగతి వారికి  కూడా సొంత ఇంటిని కలిగి ఉండడం కష్టతరం అయింది. ఇదివరకు పేదలు పని ప్రదేశాలకు పక్కనున్న ప్రభుత్వ భూములలో పాకలు వేసుకునే వారు; ఈ పాకాలన్నీ పీకేస్తుండడం వలన పేదలు నిరాశ్రయులయ్యారు. ప్రభుత్వాలు నిర్మిస్తున్న పేదల ఇల్లు ఏమాత్రం సరిపోవడం లేదు. పైగా అవి నాణ్యంగా కూడా ఉండడం లేదు. దానికి తోడుగా నానాటికి పెరుగుతున్న పేదరికం ఇళ్ళు లేని వారిని పెంచుకుంటూ పోతున్నది. పేదలు అద్దె ఇళ్లపై ఆధారపడవలసి పరిస్థితి ఏర్పడింది. పట్టణాలలో దాదాపు 33% ప్రజలు అద్దె ఇళ్లలో నివసిస్తున్నారని అంచనా. ఆర్థికంగా బలహీనగా ఉండే తరగతులలో, అల్పాదాయ సమూహాలలో 95% మంది అద్దె ఇళ్లలో ఉంటున్నారు. భూమి వ్యాపారీకరించబడడం వలన, నగరాలలో అద్దెలు పెరిగాయి; సొంత ఇళ్లు లేకుండా పోయాయి; నడకదారులలో నివసిస్తున్న ప్రజానీకం సంఖ్య పెరిగింది. ఫలితంగా ఇళ్ల యజమానులకు, అద్దె చెల్లిస్తున్నవారికి మధ్య బేధాలు పెరిగాయి. క్రమంగా ఇది పెట్టుబడికి బడా వ్యాపారంగా మారింది.

**అప్పులు :** నగరీకరణే సమాజాన్ని అప్పుల సాలెగూడులోకి నెడుతుంది. కార్మికులలో, వారి కుటుంబ సభ్యులలో చాలామంది అప్పుల ఊబిలో కూరుకు పోతున్నారు. దీనివలన కార్మికుల ఆదాయాలలో ఒక భాగం పెట్టుబడికి తిరిగి మరలిపోతున్నది. ఒకసారి అప్పులు తీసుకోవడం మొదలయితే, దాని నుండి బయటపడే మార్గాలే ఉండవు.  జీవితమంతా అప్పులు తీసుకోవడం కిస్తీలు కట్టడంతో సరిపోతుంది.

**కాలుష్యం :** పట్టణీకరణ వలన తీవ్రంగా ప్రభావితమయ్యేది వాయుకాలుష్యం. ప్రపంచంలోని అత్యధిక జనాభా గల 10 పట్టణాలలో 6 భారతదేశంలోనే ఉన్నాయి. పట్టణాలలో పరిశ్రమలు, వాహనాలు అత్యధిక సంఖ్యలో ఉన్నాయి. అవి గాలిని అత్యధికంగా కాలుష్యానికి గురిచేస్తుంటాయి. ఈ కాలుష్యాల వలన ఆరోగ్యసమస్యలు తలెత్తుతుంటాయి – ఊపిరితిత్తుల వ్యాధులు, గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వగైరా. రవాణా, పరిశ్రమల వలన వెలువడే శబ్ద కాలుష్యం కూడా ఒత్తిడిని పెంచుతుంది. అనేక మానసిక ఆరోగ్య సమస్యలను తెచ్చిపెడతాయి – నిద్రలేమి, అధిక రక్తపోటు, ఇతర తీవ్రమైన ఆరోగ్య సమస్యలు నగరవాసులను ఇబ్బందులకు గురిచేస్తాయి. నీటి కాలుష్యంకూడా ఒక తీవ్రమైన సమస్యే. మానవ మలాల ద్వారా, పరిశ్రమలు విడుదల చేసే విషపూరిత వ్యర్థాల ద్వారా నీరు కలుషితం అవడం ఒక తీవ్రమైన సమస్య. ఇది కూడా అనారోగ్యాల పాలు కావడం పెరగడంలో దోహదకారి అవుతుంది.

**ప్రజాపయోగ స్థలాల కుదింపు :** భూమి పెద్ద ఎత్తున వ్యాపారీకరించబడడం వలన ప్రజలందరూ ఉపయోగించుగలిగే ప్రభుత్వ స్థలాలు, లేక్స్, ఆకుపచ్చ చెట్లు ఉండే స్థలాలు కుంచించుకు పోయాయి. నీరు నిల్వ ఉండే చెరువులన్నీ ఆక్రమణలకు గురయ్యాయి; ప్రకృతి సిద్ధంగా ఉండే పర్యావరణ సమతుల్యత దెబ్బతినింది. అందువలన నీటికి కొరత ఏర్పడింది; వాతావరణం ధ్వంసం అయింది. అదే విధంగా పార్కులు కూడా అక్రమణలకి గురయ్యాయి. పట్టణాలలో కాస్తంతయినా చల్లగాలులకు కారణమైన ఏ కాస్తంత పచ్చదనం హరించుకుపోయింది.

**పర్యావరణం – పచ్చదనం :** పట్టణీకరించబడడంతో పచ్చదనం మాయమవుతుంది. ఇళ్లకోసం, పరిశ్రమల కోసం, భూమిని వినియోగించడంతో పచ్చదనాన్ని పెంపొందించే అవకాశాలు తరిగిపోయాయి. ఇదివరకు పార్కులు లాంటి స్థలాలలో ప్రజలు గుమిగూడగలిగేవారు. ఇప్పుడు అక్కడంతా మాల్స్ వచ్చి చేరాయి. ఇది వినిమయ సంస్కృతి పెంచడంలో భాగమే. మాల్స్ వినోద, సాంస్కృతిక కేంద్రాలుగా కూడా మలచబడ్డాయి. ఇదివరకు టౌన్ హాళ్లు, కమ్యూనిటీ కేంద్రాలు, ఇటువంటి ఇతర కేంద్రాలు ప్రజలందరికి అందుబాటులో ఉండేవి. ఇవన్నీ ప్రైవేటీకరించడంతో వాటి వినియోగం పరిమితం చేయబడింది. పేద మధ్యతరగతి ప్రజలు తాము వినోదం పొందేందుకు ఎక్కడికయినా బయటికి వెళ్ళడానికి ఎటువంటి అవకాశాలు ఉండడం లేదని బాధపడుతున్నారు. అందువలన వారు టి.వి.లకు, కంప్యూటర్లకు లేదా మొబైల్ ఫోన్‌లకు అతుక్కుపోవలసి వస్తున్నది.

**మార్కెట్లు :** మన చుట్టూ ఉండే మార్కెట్లు, ఈనాడు మాల్స్ లేదా షాపింగ్ కాంప్లెక్స్‌లతో నిండిపోయాయి. పరిశుభ్రతని పెంపొందించే పేరుతో ఇదివరకటి దుకాణాలన్నీ ఊరవతలకి నెట్టేయబడ్డాయి. వాళ్ళ చేత ఖాళీ చేయించిన ఈ స్థలాలు ప్రైవేటు డెవెలపర్స్‌కి ఇచ్చి మాల్స్ కట్టిస్తున్నారు. వీధులలో అమ్ముకునేవారు, చిన్న వర్తకులు అనేక యిబ్బందులకు గురవుతున్నారు. స్థానిక సంస్థల నుండి, పోలీసుల నుండి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్కొక్కసారి వాళ్ళకి ప్రత్యామ్నాయ మార్గాలు చూపుతున్నారు. అయినా వారి అవసరాలకి అవి అనుగుణంగా ఉండడం లేదు.

**ట్రాఫిక్ ఇబ్బందులు :** నగరాలలో అతి పెద్ద సమస్య ట్రాఫిక్ సమస్య. ఇది ప్రజల సమయాన్ని, శక్తిని వృధా చేస్తుంది. పర్యావరణాన్ని కాలుష్యానికి గురి చేస్తుంది. ఆక్సిడెంట్‌లకి దారి తీస్తుంది.

**నేరాలు, హింస :** హింసాత్మక నేరాలు పట్టణాలలో విపరీతంగా కనిపిస్తుంటాయి. అవి ప్రజల జీవితాలను, వారి ప్రయాణాలను, కదలికలను బాగా ప్రభావితం చేస్తాయి. ఈ నేరాలు పట్టణవాసులను అభద్రతకు గురిచేస్తాయి.

**పరిపాలన :** పట్టణాలలో స్థానిక సంస్థలు అవినీతికి, లంచగొండితనానికి, ఆశ్రిత పక్షపాతానికి, అనిర్వాహకతకి, వనరుల లేమికి గురవుతుంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలు అంతర్జాతీయ సంస్థల్ని ప్రోత్సహించే విధంగా, ప్రైవేటు పెట్టుబడికి ఆలంబనగా ఉంటాయి కానీ, స్థానిక ఉత్పత్తిదారులను, పేదకార్మికులను ప్రోత్సహించేవిగా ఉండవు.అన్ని పట్టణాలు, నగరాలూ మౌలిక వసతులు లేక, కాలుష్యవాతావరణంతో, సేవల కొరతతో, లంచగొండి పాలనతో, నిధుల కొరతతో సతమతమవుతూ ఉంటాయి. వాటిలోకూడా ధనికులు నివసించే ప్రాంతాలలో కాస్త మెరుగైన సేవలు అందుబాటులో ఉంటాయి గానీ, పేదలు నివసించే ప్రాంతాలు అశ్రద్ధకు గురవుతుంటాయి.

## ముగింపు

మనం పట్టణ స్థానిక సంస్థల సాధికారికతను డిమాండ్ చేయాలి – నిధులు, నిర్వహణ, నిర్వాహకులు. ఇది స్థానిక ప్రజలకి, సమాజానికి ఆ ప్రాంత అభివృద్ధిపై నియంత్రణ కలిగిస్తుంది. స్థానిక సంస్థలకి మరింత అధిక మొత్తాలలో నిధులు సమకూర్చినందువలన వారు ఆ ప్రాంతంలో గృహ వసతులు, రవాణా, వంటి

మౌలికాభివృద్ధి చేసుకోగలుగుతారు. అదేవిధంగా నిర్వహణను, నిర్వాహకులను స్థానిక సంస్థల అధీనంలో ఉండడం వలన వారు సమర్ధవంతంగా ప్రణాళికలను రచించుకోగలుగుతారు; ఆ ప్రణాళికలను అమలుచేసుకోగలుగుతారు; వారి ప్రత్యేకమైన అవసరాలను తీర్చుకోగలుగుతారు.

పట్టణస్థానిక సంస్థలకి క్రమం తప్పకుండా ఎన్నికలు నిర్వహించవలసి ఉంటుంది. అక్కడి ప్రణాళికలలో, అమలులో పౌరుల భాగస్వామ్యం ఉండేటట్టు చూసుకోవాల్సి ఉంటుంది.

74 అధికరణం సవరణను పునఃపరిశీలించిన జాతీయ కార్యనిర్వాహక వర్గం, ప్రజలకు అధికారాలు ఇవ్వాలని, పట్టణ ప్రభుత్వ ఉద్యోగ్యాలకు బదిలీలు చేయాలనీ, వసూలుచేసిన ఆదాయపన్నులో 10% నగరాల పాలనకు బదిలీ చేయాలనీ, ఈ మొత్తాన్ని నగరాల మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలని ప్రతిపాదించింది.

భూమి కేవలం ప్రజల ప్రయోజనాలకు మాత్రమే వినియోగించాలని ప్రైవేటు దోపిడికి అనుకూలంగా బదిలీ చేయరాదని సూచించింది. మురికి వాడల అభివృద్ధికి, అందులో మౌలిక సదుపాయాలు కల్పనకు పరిమితమైన కాలానికి, మానవ ప్రత్యామ్నాయంగా ఉండాలి. ప్రజల ప్రయోజనాలు, పచ్చదనం కాపాడడం, అభివృద్ధి చేయడం నిరంతరంగా జరుగుతుండాలి.

మన పార్టీ ఆధ్వర్యంలోని స్థానిక సంస్థలు, ఇన్ని పరిమితులలో కూడా స్థానిక పాలనకు ఆదర్శంగా ఉండాలి. మన స్థానిక సంస్థల ప్రతినిధులు ప్రజలతో నిత్యా సంబంధాలు కలిగి ఉండాలి. స్థానిక సమస్యల పరిష్కారం విషయంలో వారి నమ్మకాన్ని చూరగొనాలి. వారు స్థానికులతో సమస్యల గురించి మాత్రమే చర్చించడం కాదు, వారిని పరిష్కారాలలో కూడా భాగస్వాములను చేయాలి. ప్రజల అభివృద్ధి అవసరాలను గమనించాలి. మన ప్రజాసంఘాలను కూడా అందులో భాగస్వాములను చేయాలి. మన ప్రతినిధులు అవినీతిలో కూరుకుపోకుండా ఉండడానికి, సామర్ధ్యవంతమైన పాలన అందించడానికి కృషి చేయాలి. వార్డు కమిటీలు వేయడానికి ప్రాధాన్యత నివ్వాలి.

## మనం చేయాల్సిన పనులు

* ప్రజాప్రయోజనాలు కల ప్రణాళికలను అమలుచేయడంలో మన జోక్యం ఉండాలి. వాటికోసం పోరాడాలి.

* వర్గ ప్రయోజనాలను ప్రజల ముందు ఉంచాలి; పట్టణీకరణ విధానాలు లాభాల కోసమే తయారు చేయబడతాయి గాని ప్రజా ప్రయోజనాల కోసం కాదని తెలిసేటట్టు చేయాలి.
* ప్రత్యామ్నాయ విధానాల కోసం, కార్యక్రమాల కోసం ప్రచారం చేయాలి, ఆందోళన చేయాలి.

# పట్టణాల్లో పని యెడల పార్టీ దృక్పథం

పట్టణ ప్రాంతాలలో పార్టీ పని, కార్మిక వర్గ ఉద్యమం గురించి సైద్ధాంతిక అవగాహన కల్పించే ప్రయత్నంలో భాగంగా ఈ నోట్ తయారుచేయబడింది.

## పరిచయం

ప్రపంచ బ్యాంకు 2021 నాటికీ భారతదేశ పట్టణ జనాభా 49.8 కోట్లు ఉంటుందని అంచనా వేసింది. ఇది మొత్తం జనాభాలో 35.4%; 2035 నాటికి పట్టణ జనాభా 67.5 కోట్లకు పెరుగుతుందని కూడా అంచనా వేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారం, పది లక్షలు దాటిన పట్టణాలు భారతదేశంలో 52 ఉన్నాయి. 5 రాష్ట్రాలలో 40% మంది ప్రజలు పట్టణ ప్రాంతాలలోనే నివసిస్తున్నారు. 2019లో స్థూల జాతీయోత్పత్తిలో 63% వనరులు పట్టణ ఆర్థిక వ్యవస్థ నుండి సమకూరుతున్నాయి. 2030 నాటికి ఇది 75% నికి చేరవచ్చని నీతి ఆయోగ్ అంచనావేస్తున్నది. మధ్యతరగతి, కార్మిక వర్గంలో అత్యధిక భాగం పట్టణాలలో నివసిస్తున్నారు. ఈనాడు మతతత్వ శక్తులకు ప్రధాన సైద్ధాంతిక మూలాలుగా ఉన్నది ఈ మధ్యతరగతి వర్గమే. పట్టణీకరణని ప్రధాన అభివృద్ధికి కారకంగా చేస్తున్న క్రమంలో పట్టణీకరణకు ప్రాధాన్యత మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. అందువలన పెట్టుబడిదారీ వ్యవస్థలో, ప్రజాఉద్యమాలు నిర్మించడంలో, పట్టణీకరణ పాత్ర ప్రాధాన్యతను మనం గుర్తించాలి.

విప్లవోద్యమంలో పట్టణీకరణ ప్రాధాన్యతను క్లుప్తంగా ఈ విధంగా చెప్పుకోవచ్చు : పెట్టుబడి సంచయన క్రమంలో పట్టణికరణ ఒక అంతర్గత భాగం. పెట్టుబడిదారీ వ్యవస్థకు ముందు, పట్టణాలు చేతివృత్తులు చేసేవారికి, వ్యాపారులకు, తమ ఉత్పత్తులను అమ్ముకునే కేంద్రాలుగా ఉండేవి. కానీ, పెట్టుబడిదారీ వ్యవస్థ

అభివృద్ధిచెందడంతో పారిశ్రామికీకరణ పెరిగింది, దానితో పాటుగా పట్టణాలు పెరిగాయి; కొత్త పట్టణకేంద్రాలు వెలిసాయి. అవన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థతో పాటుగా పెరిగాయి. పెట్టుబడితో పాటు క్రియాశీల కార్మికవర్గ సైన్యం పెరిగింది; వారంతా పట్టణ ప్రాంతాలలో కేంద్రీకృతం అయ్యారు; అదనపు లాభాలను రాబట్టుకోడానికి పెట్టుబడిదారునికి అవసరమైన కార్మిక శక్తిని సరఫరా చేసే కేంద్రాలుగా పట్టణ కేంద్రాలు తయారయ్యాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో నివాస ప్రదేశం, పని ప్రదేశం వేర్వేరు అయ్యాయి. ఈ రెండు కేంద్రాలు పెట్టుబడిదారీ వ్యవస్థ పునరుత్పత్తికి, పెట్టుబడిదారీ వర్గ అధిపత్య దృఢ వ్యక్తీకరణకు కూడా అవసరమైనవి. వర్గ ప్రయోజనాల వైరుధ్యం పని ప్రదేశాలలోనే కాదు, నివాస ప్రాంతాల్లో కూడా ఉంటుంది. పెట్టుబడిదారీ వ్యతిరేక పోరాటాలు రెండు ప్రదేశాలలో చేయాల్సిందే. ఒకచోట చేసి వేరొక చోట విస్మరించలేము. అందువలన చైతన్యవంతమైన విప్లవోద్యమాన్ని సమగ్రంగా నిర్మించడానికి రెండు ప్రదేశాలలోనూ కృషి చేయాల్సి ఉంటుంది.

౨

## పట్టణీకరణ అంటే ఏమిటి ?

పట్టణీకరణని వ్యవసాయేతర జనాభా, వ్యవసాయేతర వృత్తులు, అంటే పాలన, వాణిజ్యం, పరిశ్రమలు వంటి కార్యక్రమాల్లో పాల్గొంటూ ఒక చోట కేంద్రీకరించి నివసించే ప్రాంతంగా నిర్వచించుకోవచ్చు.

కానీ ప్రధానంగా ఇది ఒక వర్గ సంబంధితమైనది. పట్టణీకరణకు మూలం అదనపు ఉత్పత్తి లభ్యం అవడం, దానిని ఉత్పత్తిలో భాగస్వామి కాని వారు సొంతం చేసుకోవడం; అదికూడా కేంద్రీకరించబడిన ఒక భౌగోళిక ప్రాంతంలో జరగడం. పట్టణీకరణకి, అదనపు ఉత్పత్తి ఆధారంగా రాజ్యం ఏర్పడడానికి, అభివృద్ధి చెందడానికి, సంబంధం ఉంది. రాజ్య సాధనాలు ఏర్పడిన ప్రాంతాలే మొట్టమొదటి పట్టణ కేంద్రాలయ్యాయి. చారిత్రికంగా చూస్తే, మొదట రాజకీయ కేంద్రాలుగా ఉన్నవే ఆ తరువాత కాలంలో వాణిజ్య కేంద్రాలుగాను, ఆ తరువాతి కాలంలో పట్టణ పారిశ్రామిక కేంద్రాలుగాను వరుస క్రమంలో మారాయి. వాణిజ్య వ్యాపార కార్యకలాపాలు, వృత్తుల కార్యకలాపాలు, పుణ్యతీర్థాల కేంద్రాలు, వేదాంత చర్చల కేంద్రాలు సాంప్రదాయకంగా పట్టణ కేంద్రాలే. పెట్టుబడిదారీ సమాజాలకు ముందు కాలంలో పట్టణ కేంద్రాలు, మిగులు ఉత్పత్తుల వినిమయ కేంద్రాలు. పెట్టుబడిదారీ

విధానంలో ఈ పట్టణీకరణ క్రమానికి, పారిశ్రామికరణ ద్వారా ఉత్పత్తిలో చేరిన అదనపు విలువతో దగ్గర సంబంధం కలిగిన ఉండడం అనే ఒక కొత్త మౌలిక గుణాత్మక అంశం చేరింది.

ఆ) "బూర్జువాజి దేశాన్ని పట్టణాలకు అనుగుణంగా మార్చింది. పెద్ద పెద్ద నగరాలను నిర్మించింది, గ్రామీణ ప్రాంతంకంటే పట్టణాలలో నివసించేవారు సంఖ్య విపరీతంగా పెరిగింది;" (కమ్యూనిస్ట్ మేనిఫెస్టో) పెట్టుబడిదారీ విధానం, పట్టణీకరణ ఒకదానితో ఒకటి కలిసి ఉంటాయి. పట్టణీకరణ పెట్టుబడిదారీ విధాన స్వాభావిక స్వరూపం.

బి

## ఉత్పత్తి కేంద్రాలు, విలువ గ్రహించడం

పెట్టుబడిదారీ వ్యవస్థలో పట్టణాలు ఉత్పత్తి కేంద్రాలు, విలువలను గుర్తించే కేంద్రాలు. అదనపు విలువ ఉత్పత్తి కేంద్రాలలో ఏర్పడుతుంది; దానిని మార్కెట్లో మాత్రమే గ్రహించడం జరుగుతుంది. వ్యవసాయంలో అదనపు విలువ గ్రామీణ ప్రాంతాలలో తయారవుతుంది; అది కూడా పెట్టుబడిదారీ వ్యవసాయ పద్ధతుల ద్వారా, బడా వ్యవసాయ వ్యాపారాల ద్వారా. అదనపు విలువ గ్రహించబడకపోతే, పెట్టుబడిదారీ క్రమం ఆగిపోతుంది; సంక్షోభం ఏర్పడుతుంది. అందువలన పంపిణీకి, రవాణాకు, సమాచారాలకి, సరుకు గిడ్డంగులకి కేంద్రాలుగా ఉన్న పట్టణాలు, నగరాలు అదనపు విలువ గ్రహించే కార్యకలాపాలకు కేంద్రాలుగా ఉండి ప్రధాన పాత్ర పోషిస్తాయి.

## పట్టణాల పెరుగుదల పై ప్రత్యేక శ్రద్ధ

వస్తు ఉత్పత్తి, పంపిణీ, మారకం, వినిమయం, కార్మికశక్తి పునరుత్పత్తికి పెద్ద ఎత్తున, భౌతిక, సామాజిక, మౌలిక వసతుల కల్పన అవసరం ఉంటుంది. పెట్టుబడిదారుడు ఉత్పత్తి సాధనాలను, కార్మికుడిని ఒక చోటికి చేరుస్తాడు; కార్మికులను యంత్రాలపై పనికి పెడతాడు; వస్తుత్పత్తికి అవసరమైన ముడిసరుకులు సమకూరుస్తాడు. ఒకే చోట ఉత్పత్తి కార్యక్రమాలు చేయడం ద్వారా సమకూరే అదనపు ఆర్థిక ప్రయోజనాలు పొంది, మరిన్ని ఎక్కువ ఉత్పత్తి శక్తులను పెద్ద ఎత్తున ఒకే ప్రాంతంలో పోగేస్తాడు. భారీ పరిశ్రమల, వాణిజ్య అవసరాలకు అనుకూలంగా, ఉత్పత్తిదారుల, పంపిణీదారుల సౌలభ్యం కోసం, ఒకే ప్రాంతంలో ఉత్పత్తి, రవాణా,

గిడ్డంగులు, సమాచార నెట్‌వర్క్, వ్యాపారం, వాణిజ్యం, బ్యాంకు వ్యవహారాలు నడుపుకోడానికి అనుకూలంగా సౌకర్యాలు ఏర్పాటు చేయబడుతుంటాయి. అందువలన పట్టణాలలో నగరాలలో నిర్మాణాలు పెద్ద ఎత్తున కనిపిస్తాయి.

## పట్టణీకరణకు ఒక వర్గతత్త్వం ఉంది

వర్గ ప్రయోజనాలు కేవలం ఉత్పత్తి జరిగే స్థలంలోనే కాదు కార్మికులు జీవించే ప్రదేశాలలో కూడా కనిపిస్తుంది. అంటే వర్గ పోరాటాలు ఉత్పత్తి జరిగే చోట, కార్మికుడు జీవించే చోట కూడా జరుగుతాయి.

పట్టణ స్థానిక సంస్థలు, నిర్మాణ వాతావరణం, వర్గ శక్తుల ప్రయోజనాలను ప్రతిఫలిస్తుంటాయి. ధనికులు పేదలు వేర్వేరు ప్రాంతాలలో విభజించబడి, విభిన్న రకాల భౌతిక సామాజిక మౌలిక సదుపాయాలు కలిగి ఉంటారు. అవి కంటికి స్పష్టంగా కనిపిస్తూ ఉంటాయి. ఈనాడు నగరాలలో గేటెడ్ కమ్యూనిటీస్ ఉన్నాయి; అక్కడ నిఘా కలిగిన దారులు, ఆడంబరాలతో కూడిన షాపింగ్ మాల్స్, ప్రత్యేకమైన క్లబ్బులు ఉంటాయి. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, సైన్స్ పార్కులు, విలాసవంతమైన హోటళ్లు, విమాన కేంద్రాలు, కంటయినర్ పోర్టులు, గేటెడ్ కమ్యూనిటీలు, గోల్ఫ్ కోర్టులు నగర స్వరూప స్వభావాలను మార్చేస్తాయి. నగరాలలో ధనికులున్న ప్రాంతాలలో నిర్మాణాలలో అనూహ్యమైన మెరుగుదల కనిపిస్తుంది. కానీ మరో వైపు పెద్ద ఎత్తున మురికివాడలు పెరుగుతుంటాయి. ఎక్కువమంది తాటాకు గుడిసెల్లో నివసించాల్సిన పరిస్థితి ఉంటుంది. అక్కడ నీటి సరఫరా ఉండదు. పారిశుధ్య సదుపాయాలు ఉండవు. నగరాలలో పారేసిన అన్నం మెతుకుల కోసం అర్రులుచాచేవారి సంఖ్య పెరుగుతుంది. ప్రతిరోజూ వేలాదిమంది వారి నివాసిత ప్రాంతాల నుండి గెంటేయబడుతుంటారు. ఎప్పటికప్పుడు సుదూర ప్రాంతాలకు తరలించ బడుతున్నవారు వలస కార్మికులు, నీడలేనివారు, పేద కార్మిక వర్గానికి చెందిన వారు. పట్టణాలలో కళ్లు మిరుమిట్లు గొలిపే ధనికులతో పాటుగా కటిక పేదరికంలో మగ్గేవారు సమాంతరంగా జీవిస్తుంటారు.

## సి

## కార్మిక వర్గ మూలాలు, మేళవింపు

పెట్టుబడిదారీ ఆర్థిక కార్యకలాపాలకు ఒక ప్రత్యేకమైన వస్తు - కార్మిక శక్తి మేళవింపు కావాలి. పెట్టుబడికి నిరంతరంగా సరఫరాకు సిద్ధంగా కార్మిక సైన్యం

ఉండాలి. దానిని పెట్టుబడిదారీ పూర్వపు ఆర్థిక రంగాల నుండి ఎప్పటికప్పుడు భర్తీ చేయగలగాలి. గ్రామీణ ప్రాంతాల నుండి ప్రజలు తరలి రావడం ద్వారా ఇది సాధ్యపడుతుంది. ప్రధానంగా ఏ జీవనోపాధి లేకుండా, బాధలు పడేవారు, ఏ ఆధారం లేనివారు, వ్యవసాయ పనుల నుండి బయటికి నెట్టబడినవారు, పనులు లేని వృత్తిదారులు; వీరంతా పట్టణాలలోని పారిశ్రామిక, ఆర్థిక వ్యవస్థలోకి కార్మిక శక్తిగా ప్రవేశించక తప్పని పరిస్థితులు ఏర్పడతాయి. పట్టణ ప్రాంతాలకు వలసలు, ఈ ప్రజలు తమ జీవితాలను వెతుక్కుంటూ వెళ్లడాన్ని సూచిస్తాయి. సహజంగానే వారు పట్టణ జనాభాలో చేరి వైవిధ్యాన్ని చేకూరుస్తారు. కులాలు, భాషలు, మతాలు, ప్రాంతాలు కలగలిసిపోతాయి.

పట్టణంలో ఉత్పత్తి కార్యక్రమాలలో పాల్గొన్న కార్మికులు ఏ కాలంలో అయినా తక్కువ సంఖ్యలోనే ఉంటారు. వాటి అనుబంధ సంస్థలలో పనిచేసేవారి అధికశాతం ఉంటుంది. వారే పట్టణ ప్రజలకి అవసరమైన సేవలను అందిస్తుంటారు. పెట్టుబడిదారునికి ఎప్పుడు కావాలన్నా అందుబాటులో కార్మిక శక్తి తగిన స్థాయిలో ఉండాలంటే, పట్టణాలలో భారీగా రిజర్వు జనాభా ఉండాలి – నిరుద్యోగులు, చిరుద్యోగులు, కాలాల కనుగుణంగా పనులు చేసేవారు, ఉద్యోగాల కోసం వేచిచూస్తున్న సైన్యం. వీరేకాక చిన్న పిల్లలు, వృద్ధులు – చెప్పుకోదగినంత మంది ఉన్నారు. ఇప్పుడు జీవన ప్రమాణాలు పెరుగుతుండడంతో వయోజనుల సంఖ్య పెరుగుతున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ వేళ్లూనుకుంటున్న కొద్దీ, విస్తరిస్తున్న కొద్దీ, మరింత ఎక్కువమంది పట్టణాలకు చేరతారు.

### డి

## పని ప్రదేశం, ఇల్లు వేర్పడడం

పెట్టుబడిదారీ వ్యవస్థ పని ప్రదేశాన్ని, నివాసాన్ని వేరు చేస్తూ స్థాపించబడినది. మొదట్లో వ్యవసాయేతర ఉత్పత్తి, ఇంటినుండి జరిగేది– (చేతివృత్తుల). పెట్టుబడిదారీ వ్యవస్థలో, పరిశ్రమల రాకతో ఈ సంబంధం తెగి, పని ప్రదేశం, వసతి రెండు వేర్వేరు స్థలాలలో జరగడం మొదలయింది.

పనిప్రదేశం, జీవన ప్రదేశం వేరుగా ఉండడం, పట్టణాల, నగరాల ప్రధాన స్వరూపం. ఉత్పత్తి, సంబంధిత ఇతర కార్యకలాపాలు కొన్ని ప్రాంతాలకు పరిమితమవుతాయి; కార్మికులు ఇతరులు ఇతర నివాస ప్రాంతాలలో నివసిస్తారు.

పారిశ్రామిక ప్రదేశంలో ఉత్పత్తికి సంబంధించిన అన్ని కార్యకలాపాలు జరుగుతాయి. నివాస ప్రాంతాలలో పునరుత్పత్తికి సంబంధించిన కార్యకలాపాలు జరుగుతాయి. ఈ పునరుత్పత్తి అంటే కార్మిక శక్తి ఉత్పత్తి ఇక్కడ జరుగుతుంది. ఇది భౌతికంగా, సైద్ధాంతికపరంగా కూడా నిల్వ కార్మిక శక్తి సైన్యం సిద్ధం చేయడానికి జరిగే ప్రక్రియ. అందువలన పెట్టుబడిదారునికి పరిశ్రమల పై నియంత్రణ ఎంత ప్రధానమైనదో, పునరుత్పత్తికి కేంద్రాలైన నివాస ప్రాంతాల నియంత్రణ కూడా అంటే ప్రధానమైనది.

## పనిప్రదేశాలు, నివాసప్రాంతాలు - మారుతున్న పరిస్థితులు

కార్మిక ప్రపంచంలో కార్మికులే ఉత్పత్తిదారులు; కానీ సాధారణ ప్రపంచంలో వారు వినిమయదారులు కూడా. వారు పనిచేసి, జీతాలు/ఆదాయాలు పొందుతారు; దానిని నివాస ప్రాంతాల్లో ఖర్చు చేస్తారు. పనిలో వారు పెట్టుబడిదారుని నియంత్రణలో ఉంటారు. నివాస ప్రాంతాలలో వారు పెట్టుబడిదారుని ప్రత్యక్ష నియంత్రణలో ఉండరు.

పెట్టుబడిదారీ సమాజంలో పని ప్రదేశంలో స్థానమే మౌలికమైనది; అదే వర్గంలో వారి స్థానాన్ని తెలియచేస్తుంది. అయితే నివసించే ప్రాంతం కూడా ప్రాధాన్యత కలిగినదే; అది నిరంతరంగా కార్మిక శక్తిని తయారుచేసే ప్రక్రియకి ఆలవాలం. కార్మికునికి సంబంధించినంత వరకు రెండు ప్రాంతాలు ప్రధానమైనవి – పని ప్రదేశం, నివాస ప్రదేశం కూడా.

పని ప్రదేశానికి, నివాస ప్రదేశానికి మధ్య సంబంధాలు అనేక రూపాలలో ఉంటుంది; పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి ఏ దశలో ఉన్నదో, దానిని బట్టి వాటి మధ్య సంబంధం మారుతుంటుంది. ఉదాహరణకి, పశ్చిమ దేశాలలో 19, 20 శతాబ్దాలలో పెద్ద పెద్ద పరిశ్రమలు, మిల్లులు పట్టణాల మధ్యలో ఉండేవి. భారతదేశంలో కూడా 20వ శతాబ్దంలో పారిశ్రామీకరణ జరిగింది; అప్పుడు అతి ప్రధానమైన వస్త్ర పరిశ్రమ, ఇతర పరిశ్రమలు ముంబై, అహమ్మదాబాద్ , కాన్పూర్, కలకత్తా, మద్రాస్ నగరాల మధ్యలో ఉండేవి. 1970ల వరకు ఇదే వరస. ఆ తరువాత ఉత్పత్తి విధానం, పరిశ్రమల స్వభావాలు మారిపోగానే, పెద్ద పెద్ద వస్త్ర పరిశ్రమలు, ఇతర పరిశ్రమలు మూతలు పడ్డాయిబీ లేదా ఊరి చివరకి మార్చబడ్డాయి; లేదా ప్రత్యేకమైన పారిశ్రామిక వాడలు వెలిసాయి. మొదటి దశలో కార్మిక వాడలు ఉండేవి; మురికివాడలు పని ప్రదేశాల పక్కనే ఉండేవి. ఇది రాజకీయ, సంఘ నిర్మాణ పనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడానికి అవకాశం కల్పించింది.

నయా–ఉదారవాద విధానాలు అమలవడంతో, పెట్టుబడిదారీ ఉత్పత్తి

నిర్మాణంలోనే మార్పులు వచ్చాయి; అవి నానా రకాల పని విధానాలకు దారితీసాయి. మొదటిది, బడా పరిశ్రమలు ఊరి మధ్యనుండి తొలగించబడ్డాయి; రెండవది, పెద్ద పెద్ద ఫ్యాక్టరీలలో కూడా అత్యధికులు కాంట్రాక్టు కార్మికులు, క్యాజువల్ కార్మికులే. అనేక రకాల ఉత్పత్తులు ఇతర చిన్న అనుబంధ పరిశ్రమలకి గుత్తకి ఇవ్వడం జరిగుతున్నది. ఆ పనులన్నీ ఇళ్లలో జరుగుతున్నాయి; పీస్ రేట్‌కి జరుగుతున్నాయి; అందులో ఎక్కువ భాగం మహిళలు చేస్తున్నారు. అందువలవ యజమాని, కార్మికుడి సంబంధంలో మార్పు రావడమే కాదు, చాలామందికి పని ప్రదేశం అంటూ ప్రత్యేకంగా ఏదీ లేదు; వారి పని ప్రదేశం వారి నివాస స్థలమే అయి ఉండవచ్చు కూడా.

భారతదేశంలోని పెట్టుబడిదారీ వ్యవస్థ ఈ దశను మనం గమనించాలి. కార్మిక వర్గంలోని అధిక సంఖ్యాకులు అసంఘటిత రంగంలో ఉన్నారు; వారంతా నివాసిత ప్రాంతాలలోనే నివసిస్తున్నారు. కలకత్తా ప్లీనం నివేదికలో సూచించినట్టు కార్మికులు ప్రధానంగా ఎక్కడ నివసిస్తున్నారన్నది సంఘాల ఏర్పాటుకు – కార్మిక సంఘాలు, యువజన సంఘాలు, మహిళా సంఘాలు ఇతర ప్రజా సంఘాల ఏర్పాటుకు ముఖ్యం. నివాసిత ప్రాంతాలలో మమేకమైన సైద్ధాంతిక, సాంస్కృతిక అంశాలు పాత, కొత్త బూర్జువా సిద్ధాంతాల ప్రభావంలో ఉంటాయి. వెనుకబాటుతనం, ఆలోచనలు, అలవాట్లు, కార్మికవర్గ ఆధ్యాత్మిక, సామాజిక ఆలోచనల్లో, అలవాట్లలో జొరబడి ఉంటాయి. ఇవి ఇప్పటికే బలహీనంగా ఉన్న కార్మికుల చైతన్యాన్ని మరింత నిరాశ పరుస్తాయి. అదేసమయంలో బూర్జువా సిద్ధాంతం ప్రచార మాధ్యమాల ద్వారా, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా వ్యాప్తి చెంది ఉంటుంది.

## దోపిడీ, హరణం (స్వాధీనం చేసుకోవడం )

పని ప్రదేశాలలో కార్మికులు దోపిడీకి గురవుతారు – సాధ్యమైనంత అదనపు విలువ గుంజుకోవడానికి ప్రయత్నించబడుతుంటుంది. నివాస స్థలంలో కూడా, పెట్టుబడిదారులకు తమ లాభాలు ఏమాత్రం తగ్గకుండా ఉండేందుకు, కార్మికుల ఆదాయాలలో అధిక భాగం అనేక రూపాలలో కాజేయడానికి ప్రయత్నిస్తుంటారు. బలవంతపు వసూళ్లు చేయడం, మోసాలు చేయడం, కబ్జాలు చేయడం, అసమాన మారకం చేయడం, అనైతిక కార్యకలాపాలు – లంచాలు, కల్తీలు – చేస్తుంటారు. వీటన్నటిద్వారా వారికిచ్చే జీతాలతో కొంత భాగాన్ని తిరిగి వసూలు చేసుకుంటారు. ఇవే కాకుండా, అప్పులిచ్చి, ధరలను పెంచి కూడా కార్మికుల వేతనాలలో నుంచి కొంత భాగాన్ని తిరిగి తీసుకుంటారు.

పెట్టుబడి పని ప్రదేశంలో దోపిడీ చేస్తుంది. నివాస ప్రాంతాలలో హరిస్తుంది.

ఈ రెండు అదనపు విలువని స్వాధీనపరచుకునే మార్గాలే. తేడా అల్లా పని ప్రదేశంలోని దోపిడీ స్పష్టంగా కంటికి కనిపిస్తుంది – ప్రత్యక్షంగా ఉంటుంది, నివాస ప్రాంతాలలోని హరణం కంటికి కనిపించదు – పరోక్షంగా ఉంటుంది.

పట్టణీకరణతో పాటుగా వచ్చే అనేక సమస్యలకు మూలం పెట్టుబడిదారులు అత్యాశతో లాభాలను పోగేసుకోనే వెతుకులాట వలన ఏర్పడ్డవే. అంతేకాని చాలామంది వాదించేటట్టు తప్పుడు పాలనా పద్ధతులు కాదు; తప్పుడు యాజమాన్య పద్ధతులు కూడా కాదు. ప్రభుత్వాలు పట్టణాలను అభివృద్ధి చేయడం తమ లక్ష్యమని ఘనంగా చెప్పే విధానాలలో చాలావరకు, పెట్టుబడి అత్యధికంగా లాభాలు సమకూర్చడాన్ని గొప్పగా చూపడానికి ఉపయోగపడేవే. మనం సంస్కరణలు, లాభాలు పరిమితంగా ఉంచేందుకు పోరాడవలసి ఉంటుంది. ఈ పని, పోరాటాలు పట్టణ కార్మిక వర్గాన్ని ఉద్యమంలోకి ఆకర్షిస్తాయి; వారికి రాజకీయ చైతన్యం కలిగించేందుకు మనకు అవకాశం కల్పిస్తుంది. పట్టణీకరణ విధానాలైనా, పౌరులకు అందించవలసిన సేవలైనా, మనోల్లాసం కలిగించే విషయాలైనా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకునే సదుపాయాలైనా, పేద ప్రజల జీవితాలను మెరుగుపరుచుకునేందుకు ఉపకరించే ఏ సదుపాయాల కోసమైన మనం పోరాడవలసి ఉంటుంది.

అందువలన పెట్టుబడికి వ్యతిరేకంగా చేయాల్సిన ఏ పోరాటం అయినా ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇ

## పట్టణీకరణ ఒక సామాజిక నియంత్రణగా : వర్గ చైతన్యం కోసం పోరాటాలు

పెట్టుబడి సూత్రాల ఆధ్వర్యంలో పట్టణీకరణ జరగడం అంటే, ప్రజల జీవితాలపై మరింత నియంత్రణ సంపాదించుకోవడమే. పట్టాణాభివృద్ధి విధానంలో పెట్టుబడి, 'కార్మికుల' జీవన విధానం పైన, కార్మిక శక్తిపైనా, వారి సాంస్కృతిక, రాజకీయ విలువల పైనా, వారి ప్రాపంచిక దృక్పథం పైన తమ పట్టును మరింత గట్టిగా బిగించి ఉంచుతుంది. పట్టణ జీవన విధానం ఇప్పటికే పని ప్రదేశాలలో తమ అనుభవాల ద్వారా పట్టణాలలో ఏర్పడిన వర్గ చైతన్యాన్ని నీరుగారుస్తున్నది. అది పాక్షిక కార్మికవర్గంలో, ఇతర సంబంధిత కార్మిక వర్గాలలో, వర్గ/ప్రజాతంత్ర చైతన్యాన్ని అడ్డుకుంటుంది.

వీరందరిలో, వారి నివాస ప్రాంతాలలో వారికున్న అన్య సైద్ధాంతిక

వాదనలను ఎదుర్కోకుండా ఉంటే, మనం వర్గ ఐక్యతని, రకరకాల తరగతులలోని కష్టజీవులందరితో విశాల ప్రజాతంత్ర ఐక్యతని నిర్మించలేము.

బూర్జువా తమ సైద్ధాంతిక ఆధిపత్యాన్ని సాధారణ ప్రజానీకంపై ఎలా రుద్దుతుందో ఈ క్రింది ఉదాహరణలతో చూడవచ్చు :

ఇదివరకు కార్మికులు పరిశ్రమకు అనుకుని ఉన్న కాలనీలలో, పెద్ద పెద్ద సమూహాలుగా నివసించేవారు. ఆ కాలనీల నిర్వహణ ఖర్చులను కంపెనీలు భరించేవి. అంటే కార్మికులు పని ప్రదేశంలోనే కాదు నివాస ప్రాంతంలో కూడా ఐక్యంగా ఒకేచోట నివసించేవారు; ఒకే విధమైన సామాజిక జీవితాన్ని గడిపేవారు. అందువలన వారి మధ్య ఐక్యత మరింత బలపడేది. ఇప్పుడు, కార్మికులు చెదిరిపోయి ఉన్నారు; నివాస ప్రాంతంలోని కాలనీలలో అనేక రకాల జాతులతో కలగలిసి ఉన్నారు. అందువలన ఇదివరకున్న ఒకేవిధమైన జీవన విధానం ఇప్పుడు లేదు. ఈ పరిస్థితిలో వర్గ చైతన్యం దానంతట అదే పెరిగే అవకాశాలు ఉండవు.

చెదరగొట్టి ఉంచే విధానం, చిన్న పట్టణాలుగా ఉంచడం అనే పద్ధతులను అవలంభించడం ద్వారా కొన్ని ప్రాంతాలలో కార్మిక వర్గం 'భయంకరమైన తరగతి'గా ఒక చోటే చేరే అవకాశాలు లేకుండా చేయాలని, తద్వారా వర్గ పోరాటాలకు అడ్డుకట్ట వేయవచ్చని భావించడం జరుగుతున్నది. పట్టణాల పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయడం, అల్పాదాయ వర్గాలకు ఇంటి యజమాన్యం కల్పించడం, రవాణాలు పెంచి పని ప్రదేశాలకు చేరుకునేటట్టు చేయడం, తద్వారా వారి జీవన స్థితిగతులు మెరుగుపడేటట్టు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి; అయితే ఇవన్నీ వర్గ వైరుధ్యాన్ని నిలువరించేందుకు చేసే ప్రయత్నాలే.

అనేక పద్ధతుల ద్వారా ప్రజలను, ముఖ్యంగా పేద ప్రజలను, అనేక విధాలుగా అప్పులు తీసుకునే పద్ధతులలోకి నెట్టడం ద్వారా వారిని రాజకీయాలకు దూరం చేసారు; కేవలం తమ గురించి మాత్రమే తాము ఆలోచించుకునేటట్టు చేసారు.

మార్కెట్ శక్తులు సృష్టించిన అభద్రత, ఆందోళన; పెరుగుతున్న వయోజనుల సంఖ్య - ఇవన్నీ ప్రజల సంస్కృతిలో, ఆధ్యాత్మికత జీవనంలో ధార్మిక చింతన, ఛాందసత్వం వ్యాపించడానికి తోడ్పడుతున్నాయి. అన్ని రకాల మతతత్వ శక్తులు, దేవుడిని అమ్ముకునేవారు, వీటిని తమ రాజకీయ, వ్యాపార ప్రయోజనాల కోసం ఉపయోగించుకుని మతతత్వాన్ని ధార్మికతను పెంచుతున్నారు.

శ్రామిక శక్తి వద్ద మిగిలిన ఏ కొద్ది తీరిక సమయాలనైనా కార్పొరేట్ పెట్టుబడి, ఆధునిక సమాచార మాధ్యమాల ద్వారా, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా, తమకు

బందీలుగా చేసుకుంటున్నది. సాంకేతిక పరిజ్ఞానం ప్రజల ఖాళీ సమయాన్ని మొత్తంగా లాగేసుకుంది; వారిని ఒంటరిపాటుకు గురిచేస్తూన్నది; ఒకరితో ఒకరికి సంబంధాలు లేకుండా చేసి, వారి మనసులను పాలకవర్గ ఆలోచనలతో, విలువలతో నింపుతున్నది.

నయా ఉదారవాద విధానాల్లోని ప్రైవేటీకరణ, వ్యాపారీకరణ, ద్రవ్యీకరణ, డిజిటలీకరణ, డబ్బు సామాజిక శక్తిని విపరీతంగా పెంచింది; ఈ శక్తి ప్రజల జీవితాలను, వారి సైద్ధాంతిక ఆలోచనలతో సహా ఉడుంపట్టులా పట్టుకుంది.

భౌతిక సరిహద్దుల ఆధారంగా ఏర్పడ్డ బూర్జువా పార్లమెంటరీ విధానంలో, ప్రధాన రాజకీయ కార్యకలాపాలన్నీ నివాస ప్రాంతాలలోనే ఉంటాయి. బూర్జువా పార్టీలు తమ రాజకీయ కుయుక్తులన్నీ ఇక్కడే కేంద్రీకరించి పని చేస్తుంటారు. అంటే, రోజువారీ బూర్జువా రాజకీయాలు ఇక్కడే జరుగుతుంటాయి. ప్రభుత్వ పథకాలు, ఓట్లు దండుకోడానికి చేసే సంక్షేమ కార్యక్రమాలు ఇక్కడే అమలవుతుంటాయి. స్థానికంగా మనం పనిలో లేకపోతే, మనం బూర్జువా పార్టీలను రాజకీయంగా ఎదుర్కోడంలో మన సమర్థతను పరిమితం చేసుకుని, వారిని ఒంటరిపాటుకు గురి చేయడంలో విఫలమవుతాము; ప్రజలను వారి ప్రభావానికి వదిలేసిన వారమవుతాము.

రకరకాల కార్యక్రమాలు, పోరాటాల ద్వారా, మూలాల కంటా శక్తివంతమైన సంఘటిత సంస్థలను నిర్మించడం ద్వారా మాత్రమే సామాజిక మాధ్యమాల అభిసంధానాలను, డబ్బు ప్రభావాన్ని, పాలక పార్టీల సైద్ధాంతిక శక్తిని తట్టుకుని, ప్రజల రాజకీయ సాంఘిక చైతన్యాన్ని పెంచగలం.

## ఎఫ్

## పట్టణాలలో పని, పార్టీ విధానం

### నివాస ప్రాంతాల్లో పోరాటాలు – పెట్టుబడిదారీ వ్యతిరేక పోరాటాలలో భాగం

'ఉత్పత్తి' సామాజిక జీవితంలో కీలకమైన అంశం అని మార్క్సిజం భావించడం, వాటి కేంద్రంగానే వర్గ పోరాటాలు ఉండాలనేది వాస్తవమే అయినప్పటికీ, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో చలనం, వినిమయం కూడా అదనపు విలువలను గ్రహించడంలో, పెట్టుబడి పునరుత్పత్తి చక్రం పూర్తిచేయడంలో కీలకం. నిజ జీవితంలో వాటిని వేరు చేయలేము. అందువలన ఈ అన్ని పార్శ్వాలలో కూడా పోరాటాలకు తగిన స్థానం ఉంది. మనం వాటి మధ్య ఎంపిక చేసుకోకూడదు. కార్మికుల పని ప్రదేశాలలో పని ఎంత ప్రధాన స్థానాన్ని ఆక్రమిస్తుందో, సర్క్యులేషన్, వినిమయం

కూడా ప్రజల జీవితాలలో నివాస ప్రాంతాలలో అంతటి ప్రధాన స్థానాన్ని ఆక్రమిస్థాయి.

భారతదేశంలో మరో ప్రధానమైన అంశం నివాస స్థానాలు వివక్షతతో విభజించబడి ఉండడం. దళితులు నివసించే ప్రాంతాలు ప్రత్యేకంగా ఉంటాయి. ముస్లింలు పట్టణంలోని ఒక ప్రాంతానికే పరిమితమై ఉంటారు. ఈ ప్రాంతాలలో పౌర సదుపాయాలు, ఇతర ప్రాంతాల కన్నా చాల తక్కువ స్థాయిలో ఉంటాయి లేదా నిర్లక్ష్యం చేయబడతాయి. అంటే ధనికులు పేదలు అన్న బేధాలే కాకుండా, కుల మతాల ప్రాతిపదికన కూడా ప్రజలు వేరుచేయబడి ఉంటారు. అందువలన పట్టణ ప్రజాస్వామ్య జీవితం కొరకు చేసే పోరాటాలలో, కార్మిక వర్గం నిత్యా జీవితంలో ఎదుర్కొనే కుల, మత, ఇతర అన్ని రకాల వివక్షతలకు వ్యతిరేకంగా చేసే పోరాటాలు కూడా ఉండాలి.

మరో ముఖ్యమైన అంశం, మహిళల పట్ల వివక్షత, పట్టణ ప్రాంతాలలో మహిళల హక్కులు కాలరాయబడడం. పేద మహిళలు, జీవన వసతులు, పౌర సదుపాయాలు లేక, మరింత దుర్భరమైన వివక్షతను ఎదుర్కొంటుంటారు. మురికివాడల్లో మహిళలకి మరుగుదొడ్లు ఉండవు; పసిపిల్లలను చూసుకునే సౌకర్యాలు ఉండవు. ఇది వారిని తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తుంది. మహిళల పట్ల పెరుగుతున్న హింస, ఆడపిల్లలకి భద్రత కరువవడం, రక్షణ లేకపోవడం వారిని బాధిస్తుంది. మహిళలకి ప్రజలంతా వినియోగించుకోవలసిన ప్రదేశాలు అందుబాటులో ఉండవు. అవి వినియోగించుకోడానికి రక్షణ పెద్ద అడ్డంకిగా ఉంటుంది.

సంక్షోభం కేవలం కార్మిక వర్గాన్ని మాత్రమే ప్రభావితం చేయదు; ఇతర అన్ని తరగతుల ప్రజలు కూడా అనేక విధాలుగా విపరీతంగా ప్రభావితం చేస్తుంది. అసంఘటిత రంగంలో పనిచేసేవారు, దిగువ మధ్య తరగతిలోని ప్రజలు కూడా ప్రభావితమవుతారు. ఇది నివాస ప్రాంతాలలో మనం ప్రజలను, పని ప్రదేశాలతో పాటుగా నివాస ప్రాంతాలలో కూడా సంఘటితం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెపుతుంది. రాజకీయ పోరాటాలు సఫలం కావడానికి ఇది కీలకం.

నయా ఉదారవాద యుగంలో, దోపిడీకి సంబంధించిన సమస్య – అదనపు విలువని వెలికితీయడంతో పాటుగా, వేతనాల కేటాయింపులు, పెట్టుబడి ఆదాయాలను ఆక్రమించుకోవడం కూడా ప్రధాన సమస్యలుగా ఉంటాయి.

పట్టణాలలో అమలవుతున్న నయా ఉదారవాద విధానాల వలన అక్కడ నివసించే పేద, దిగువ మధ్య తరగతి ప్రజల జీవితాలు దుర్భరంగా మారాయి. వారు నివసించే ప్రాంతాలలో పౌర సదుపాయాలు దిగజారాయి; ప్రైవేటీకరించడం వలన,

యూసర్ ఛార్జీల వలన జీవన వ్యయాలు పెరిగాయి. సంస్కరణల వలన స్థానిక సంస్థలకు ప్రభుత్వాలు అందించవలసిన నిధులలో కూడా కోత విధించడం జరిగింది. అందువలన స్థానిక సంస్థలకి నిజమైన అధికార బదలాయింపు జరగలేదు. వీటిని విస్మరించడం అంటే పెట్టుబడికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంలో ఒక ప్రధాన అంశాన్ని విస్మరించడం అవుతుంది.

నయా ఉదారవాద విధానాలలో, పట్టణ ప్రాంతాలలో అందరికి అందుబాటులో ఉండవలసిన వసతులు – పార్కులు, సాధారణ ప్రజానీకం ఉపయోగించుకునే బహిరంగ ప్రదేశాలు, నీళ్ల చెరువులు, తటాకాలు వగైరాలు – ప్రైవేటుపరం అవుతున్నాయి. ఇదే సమస్య ఇతర సౌకర్యాలు – ఆరోగ్యం, బడులు, రవాణా, తాగునీరు వగైరాలకు కూడా వర్తిస్తుంది. అందువలన ప్రజలకు అందుబాటులో ఉండవలసిన ఈ మౌలిక సదుపాయాల గురించి పోరాటాలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

నయా ఉదారవాద పట్టణీకరణ ద్వారా కొద్దిపాటిగా ఉండే ధనికులకు అవసరమైనవి సమకూర్చి, అసంఖ్యాక ప్రజలను అభద్రతలోకి, అప్పుల ఊబిలోకి, పేదరికంలోకి నెట్టి, పొదుపు చర్యల ద్వారా సంక్షోభాన్ని మరింత పెంచింది. ఈ పరిస్థితులలో అది రూపొందించిన నగర, పట్టణీకరణ క్రమాలు రాజకీయ, సామాజిక, వర్గ పోరాటాలకు కేంద్రంగా మారతాయి.

# పట్టణ పని విధానంలో కొన్ని పార్శ్వాలు

## I

### పట్టణాల్లో పని ప్రాధాన్యత

నయా ఉదారవాద విధానాల అమలు, మతతత్వ పోకడల నేపథ్యంలో పట్టణ నివాస ప్రాంతాలలో మనం స్థిరంగా పనిచేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. త్వర త్వరగా పెరుగుతున్న పట్టణ జనాభా కూడా పట్టణాలలో మన పని, కార్యక్రమాల ప్రాధాన్యత, పెంచుకోవాల్సిన అవసరాన్ని తెలియచేస్తుంది.

అది :

1. హిందూత్వ శక్తుల బెదిరింపులకు అడ్డుకట్ట వేస్తుంది. ఆర్.ఎస్.ఎస్., దాని అనుబంధ సంస్థలు, ప్రధానంగా నివాస ప్రాంతాల్లో సమాజాలను, సంస్కృతిని, మతతత్వాలలోకి నెట్టే ప్రయత్నాలను అడ్డుకోడానికి అవసరం.
2. సేవల ప్రైవేటీకరణ, మతతత్వీకరణ వలన ప్రజలపై పడే భారాలపై పోరాడడానికి అవసరం; పెట్టుబడి ఆదాయాలను దోపిడీ చేయకుండా నిలువరించడానికి, నివాసిత ప్రాంతాలలో ప్రజాసేవలు వ్యాపారీకరించ బడకుండా ఉండడానికి అవసరం. పనిప్రదేశాలలో పోరాడినట్టే నివాస ప్రాంతాలలో కూడా ఈ పోరాటాలు చేయాల్సినవసరం ఉంది.
3. ప్రజలలో ఉన్న అసంఘటిత, కార్మికవర్గంలో లేని తరగతులను సంఘటితం చేయడానికి దీని అమలు అవసరం. అసంఘటిత రంగంలో పనిచేసేవారు, స్వయం ఉపాధి గలవారు, నిరుద్యోగులు జనాభాలో పెద్ద సంఖ్యలోనే ఉన్నారు. నిరుద్యోగులు అన్ని కుటుంబాలలోనూ కనిపిస్తూ ఉంటారు. నిరుద్యోగులు, సరైన ఉద్యోగాలు లేనివారు, గృహిణులు, యువతీ యువకులు, పిల్లలను కలిసి నివాస ప్రాంతాలలో సంఘటితం చేయాలి.

4. రోజువారీ పనులలో సతమతమవుతున్న ప్రజలందరినీ ఒక తాటిపైకి తెచ్చి, వారంతా ఒకరికొకరు సహరించుకునేటట్టు చేయాలి. ప్రాంతీయ సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేయడం, అందరూ కలవడానికి ఒక ప్రధాన పాత్ర పోషిస్తుంది. ఇది నయా ఉదారవాద విధానాల వలన ఏర్పడ్డ విచ్ఛిన్నాన్ని, ఒంటరితనాన్ని, స్వార్థాన్ని, ఇతర ఇటువంటి ధోరణులను తగ్గిస్తుంది.

5. ఇది స్థానికంగా బూర్జువా పార్టీల తరపున పనిచేసే గుండాల, బ్రోకర్ల ప్రభావాన్ని తగ్గిస్తుంది. మనం కేవలం పని ప్రదేశాలలోనే పనిచేయడం జరిగితే, ప్రజలు తమ రోజువారీ అవసరాల కోసం బూర్జువా పార్టీలపై ఆధారపడతారు. వారి తైనాతీలు ప్రజల సామాజిక దైనందిక సమస్యలు పరిష్కరిస్తుంటారు. పాలకుల ప్రభావం సాధారణ ప్రజానీకంలో తగ్గించాలంటే, స్థానికంగా నివాస ప్రాంతాలలో సమస్యలను మనం తీసుకోవలసి ఉంటుంది. స్థానిక సంఘాలను నిర్మించుకుని సమస్యలపై పనిచేయాల్సి ఉంటుంది.

6. కార్పొరేట్ ధనబలం, మీడియా బలం, ఎన్నికలలో వారికి ప్రధానంగా పనిచేసే సామాజిక అంశాలైన కులం, మతం శక్తులను ఎదుర్కోవాలంటే నివాస ప్రాంతాలలో పనిచేయాలి. నేటి పరిస్థితులలో, ఇటువంటి అసాంఘిక సాధనాలను, ఎదుర్కొనకపోతే, కమ్యూనిస్టులు ఎన్నికలలో విజయాలు సాధించాలని అనుకోవడం అనవసరం.

7. బూర్జువా, భూస్వామ్య విలువలు, ఆలోచనల ప్రభావం, సాధారణ ప్రజలలో పోవాలన్నా మనం నివాస ప్రాంతాలలో పనిచేయాల్సి ఉంటుంది. కుటుంబం, కులం, మతం, చదువు, వగైరాలు సైద్ధాంతిక వారసత్వాన్ని కొనసాగించేలా ప్రోత్సహిస్తాయి. ఇవన్నీ ప్రభావాన్ని చూపేది నివాస ప్రాంతాలలోనే. వీటన్నిటిని ఎదిరించాలంటే స్థానికంగా ఈ భావాలకు వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహించాలి. ఇందుకు గాను మనం స్థానిక ప్రజలను కూడగట్టాలి; వారి సాంస్కృతిక వనరులను వినియోగించుకోవాలి. మనం నిరంతరంగా సామాజిక సంస్కరణలను అమలు చేయడానికి చొరవ తీసుకోవాలి; కొనసాగించాలి; ప్రచారం చేయాలి; ఉద్యమాలు కూడా చేయాలి. సాధారణ ప్రజలు మతతత్వ శక్తుల ప్రభావంలో ఉన్న నేటి పరిస్థితులలో దీని అవసరం మరింత ఎక్కువగా ఉంది.

## II

## పట్టణ ప్రాంతాలలో విభజనలు

పట్టణాలలో వర్గాలవారి విభజించబడలేదు. లేదా సామాజిక తరగతుల వారి విభజించ బడలేదు. కానీ, పట్టణ ప్రాంతాలలో నివాస ప్రాంతాల్లో విభజన స్పష్టంగా కనిపిస్తుంది.

పట్టణాలలో మూడు రకాల విభజనలు చూడవచ్చు. **మొదటిది** – అత్యంత ధనికులు నివసించే ప్రాంతాలు – ఇక్కడ కేవలం అత్యంత ధనికులు ఉన్నత తరగతుల వారే నివసిస్తారు. **రెండవది** – మధ్యతరగతి నివసించే ప్రాంతాలు; **మూడోది** – మురికి వాడలు, బస్తీలు. ఇక్కడ కేవలం పేదలు అణగారిన వర్గాలవారు నివసిస్తారు.

### ధనికుల నివాస ప్రాంతాలు

ధనికులు, ఉన్నత కులాలవారు – పెట్టుబడి యజమానులు, ఉన్నత తరగతి అధికారులు, అధిక ఆదాయ యాజమాన్య కార్యకలాపాలు చేసేవారు – వీరు సంఖ్యాపరంగా తక్కువమంది ఉంటారు. అంతా ఒకచోటే నివసిస్తుంటారు.

ఈ మధ్యకాలంలో అభివృద్ధి చెందుతున్న గేటెడ్ కమ్యూనిటీలు, అత్యంత అధునాతన వసతులు కలిగి ఉంటాయి. అక్కడ అత్యంత ధనికులు, సంపద గలవారి శక్తి కనిపిస్తుంటుంది. మున్సిపల్ బడ్జెట్‌లో అత్యధిక భాగం ఈ ప్రాంతానికే కేటాయించబడుతుంది.

**మధ్యతరగతి నివసించే ప్రాంతాలు :** ఈ ప్రాంతాలలో ఆఫీసులలో పనిచేసేవారు, శారీరిక శ్రమ చేసేవారిలో కూడా అధిక ఆదాయాలు కలవారు, చిన్న చిన్న వ్యాపారాలు చేసేవారు, చిన్న పారిశ్రామికవేత్తలు నివసిస్తారు.

భూముల ధరలు పెరగడంతో వారు రియల్ ఎస్టేట్ మార్కెట్ వైపుకు మళ్ళారు. అపార్టుమెంట్లలో ఇంటిని అప్పు పెట్టి కొనుక్కుంటుంటారు. ఆ అప్పులు అధిక వడ్డీలపై పొందుతుంటారు. క్రమంగా మధ్యతరగతి వారు మరింత ఎక్కువమంది ఇటువైపు మరలుతున్నారు. బహుళ అంతస్తుల భావనాలలోకి తరలిపోతున్నారు.

ఉదారవాద విధానాలు వారిపై అనేక రకాల ప్రభావాలు చూపాయి. అందువలన వారు కార్మిక వర్గంతో పాటుగా పోరాటాలు చేయడానికి అనేక సందర్భాలలో ముందుకొస్తుంటారు.

మధ్య తరగతి వారు ఒక ఫ్లాట్ కొనుక్కోడానికి అనేక కష్టాలు పడవలసి వస్తుంది; వారు పెరిగిన ఇంటి అద్దెలు, ఆరోగ్య రక్షణ ఖర్చులు, విద్య, విద్యుత్

ఛార్జీలు, ట్రాఫిక్ ఇబ్బందులు, పర్యావరణ కాలుష్యం, ఇలాంటి అనేక ఇతర సమస్యలు, సంపద పన్ను, సమయపాలన పాటించని రవాణా వ్యవస్థ, రియల్ ఎస్టేట్ ధరల పెరుగుదల, అవినీతి, లంచగొండితనం, లైంగిక వేధింపులు, పోంజీ స్కీములు, వగైరాలు, తమ ఆర్జనలకు చిల్లులు పెట్టే విషయాల పట్ల ఆకర్షితులవుతారు.

ఈ తరగతిలో మనం నిత్యం ఏదో ఒక పోరాటాలు చేస్తుండాలి. ప్రస్తుతం మనకున్న లాయర్లు, ఉపాధ్యాయులు, ఇతర వృత్తిదారుల సంఘాలు ఈ తరగతిలో పనిచేయడానికి సంఘాలు నిర్మించడానికి పూనుకోవాలి.

ఈ తరగతి మార్కెట్ సంస్కరణలకు కొట్టుకుపోయే వర్గం. పాలకవర్గ ప్రభావాలకు, మీడియా ప్రచారాలకు సులువుగా ప్రభావితమౌతుంది. అలాగే మతతత్వ శక్తుల ప్రచారానికి కూడా లొంగి పోతుంది. అందువలన ఈ తరగతిలో సైద్ధాంతిక మార్పులకి అవసరమైన అన్ని కార్యకలాపాలు జరపడంలో ప్రాధాన్యత నివ్వాలి.

ఇందులో వయోజనులు పెరుగుతున్నారు. ఉద్యోగ విరమణ చేసినవారు, పెన్షన్లు పొందుతున్నవారు ఉన్నారు. స్థానికంగా ప్రజా సంఘాలు నిర్మాణంలో ప్రజా సంఘాలు సమర్థవంతంగా పనిచేయడంలో వీరి సేవలు వినియోగించుకోవాలి.

**మురికివాడలు , బస్తీలు**

నగరాలలో ఆర్థిక వేర్పాటు స్పష్టంగా కనిపిస్తుండడంతో పాటుగా అంతర్లీనంగా సామాజిక వేర్పాటు కూడా ప్రబలంగా ఉంటుంది. పట్టణాలలో ఉండే ముస్లింలు అంతా ఒక చోటే ఉంటారు; అయితే ప్రత్యేకమైన ప్రాంతాలలో ఉంటారు. అలాగే దళితులు, గిరిజనులు కూడా కొన్ని ప్రాంతాలకే పరిమితమై ఉంటారు.

వివక్షత, పేదరికం ఈ ప్రాంతాలలో కొట్టొచ్చినట్టు కనపడుతుంది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో కనిపించినంత ఎక్కువగా పట్టణాలలో కనిపించదు. పట్టణాలలో తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటారు. మనం ఈ దళితులు, గిరిజనులు, ముస్లింలు నివసించే బస్తీలపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలి.

## III

**పనిలో ప్రాధాన్యతలు**

మురికివాడల్లో బస్తీలలో పనులకు ప్రాధాన్యతనివ్వాలి. అపార్టుమెంట్లు, దిగువ మధ్యతరగతి కాలనీలకు కూడా ప్రాధాన్యతనివ్వాలి. పిల్లలు, యువతీ యువకులు, వయోవృద్ధులు, అసంఘటిత కార్మికులకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి.

రోజువారీ చేసే ఆందోళనలు మన కార్యక్రమాలలో కేంద్ర భాగం అయి ఉండాలి. అయితే మిగతా పనులు సాంస్కృతిక కార్యక్రమాలు, వినోదాన్ని కలిగించేవి, సామాజిక సేవలు, సంస్కరణలు, ప్రచారం, అభివృద్ధికాముక ఆలోచనలు కూడా సమాన ప్రాధాన్యత గలవి. హిందుత్వ శక్తులకు వ్యతిరేకంగా మతతత్వ వ్యతిరేక పోరాటాలు తక్షణం చేయాల్సిన అత్యవసర పరిస్థితి ఉన్నందువలన వాటికి తగిన ప్రధాన్యత నివ్వాలి.

స్థానిక సంస్థలను ప్రజా సంక్షేమ కార్యకలాపాలకు బాధ్యులను చేయడం కూడా మన పనిలో అత్యంత ప్రధానమైనది. స్థానిక సంస్థలలో ఉన్న మన ప్రతినిధులు, ప్రజలు, ఈ వేదికలను ఉపయోగించుకుని ప్రత్యామ్నాయ విధానాలను ముందుకు తీసుకెళ్లాలి.

## IV

### సంఘాల నిర్మాణ రూపాలు

పట్టణ నివాస ప్రాంతాలలోని ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, మన మిగిలిన అన్ని ప్రజాసంఘాలోలాగా కేంద్ర, లేదా రాష్ట్ర స్థాయి సభ్యత్వంతో కూడిన సంఘ నిర్మాణం ఈ సంఘంలో కుదరదు కాబట్టి, ఆ విధానం ఈ సంఘాలలోకుదరదని నిర్ణయించడం జరిగింది. అనేక స్థాయిలలో పట్టణాలలో స్థానికంగా పనిచేసేందుకు అనువుగా, వికేంద్రీకరించబడిన, సులువుగా మార్పులు చేసుకోగల సంఘంగా ఇది ఉండాలి. ప్రతి స్థాయిలోను, మనం దృష్టి పెట్టాల్సిన, ప్రాధాన్యత నివ్వాల్సిన అంశాల ఆధారంగా మనం నిర్ణయాలు తీసుకుని పని చేయాలి.

### రాష్ట్ర కేంద్ర స్థాయి

ఇదివరకటి ప్రణాళిక సంఘం, ఇప్పటి నీతిఅయోగ్ పట్టణాలలో అనుసరించ వలసిన కొన్ని సాధారణ విధానాలను రూపొందించింది; కొన్ని ప్రాజెక్టులను తయారు చేసింది; పట్టణాలలో కొన్ని స్కీములు ప్రవేశపెట్టాలని సూచించింది. ఈ ప్రాజెక్టులకు నిధులు అంతర్జాతీయ ఏజెన్సీలు సమకూరుస్తాయి; ఇవి కేంద్ర ప్రభుత్వం ద్వారా సమకూర్చబడతాయి. అయితే, కేంద్ర ప్రభుత్వం గాని, అంతర్జాతీయ సంస్థ అయిన ప్రపంచ బ్యాంకు గాని షరతులు లేకుండా నిధులు మంజూరు చేయవని మనం గమనించాలి.

రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రం రూపొందించిన పట్టణ స్థానిక సంస్థల

వ్యవహారాల చట్రంలోనే పనులు నిర్వహించవలసి ఉంటుంది. అయితే, కేంద్రం ఎప్పటి కప్పుడు స్థానిక సంస్థలకు ఇవ్వవలసిన నిధులను, ఆర్థిక వనరులను కబ్జా చేస్తుండడంతో వాటి వనరులు కుంచించుకు పోతున్నాయి. కానీ ఇప్పటికీ సంపద పన్ను, యూజర్ ఛార్జీలు, పట్టణ భూ యూజర్ ఛార్జీలు, నిర్మాణ నిబంధనలు, సాధారణ సేవలు వగైరాలు ఇంకా రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలోనే ఉన్నాయి. అయినప్పటికీ వామపక్షాలు తప్ప, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు, స్వతంత్ర విధానాలు రూపకల్పన చేసుకునే బదులుగా, కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రజావ్యతిరేక విధానాలనే తూచా తప్పకుండా అమలు చేస్తున్నాయి.

ఈ పరిస్థితులలో మనం కేంద్రం లోను, రాష్ట్రాలలోను ప్రజావేదికలను నిర్మించాలి. ఇవి అవసరమైనప్పుడు విస్తృతంగా ప్రచారం చేయడానికి ఉత్తేజపరిచే వేదికలుగా ఉపయోగపడతాయి.

**పట్టణ స్థాయి**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలు, పథకాల అమలు, ప్రధానంగా నగర, మునిసిపాలిటీ పాలకుల బాధ్యత అవుతుంది; రాష్ట్ర ప్రభుత్వాలు పెత్తనం చేసే ఏజెన్సీలుగా ఉంటాయి. అందువలన పట్టణాలలో స్థానికంగా జరిగే పనులు, నివాస ప్రాంతాల ప్రజల సమస్యలు తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

నగరాలు, పట్టణాల స్థాయిలో వీలయిన అన్ని స్థాయిలలో పట్టణ ప్రజావేదికలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

ఈ సమస్యలను అధ్యయనం చేయడం అత్యంత ప్రధానమైన విషయం. ఆ అధ్యయనం ఆధారంగా సంబంధిత ప్రజలందరినీ ఆహ్వానించి సెమినార్లు, ఉపన్యాసాలు, వర్క్ షాప్‌లు పెట్టాలి. వారు ప్రచారం చేసి ప్రజలను జాగృతులను చేస్తారు. ఈ వేదికలు, ప్రచారాలు, మన ప్రజా సంఘాలను, స్థానిక పార్టీని స్థానిక సమస్యలను గుర్తించేటట్టు చేస్తుంది. ఎక్కడ సమర్థవంతంగా జోక్యం చేసుకోవాలో సూచిస్తుంది. ఈ వేదికలు పట్టణ సమస్యలను పరిష్కరించడంలో ఆసక్తి ఉన్న అనేక ఇతర సంస్థలను తీసుకువస్తుంది; అన్ని కలిసి ఒక ఉమ్మడి వేదిక ఏర్పాటు చేసుకుని పట్టణ స్థాయి సమస్యలపై ఉమ్మడి పోరాటాలు, సమీకరణాలు చేయగలవు.

ఈ వేదికలు, సమస్యలను అధ్యయనం చేయడానికి ఆసక్తి, సామర్థ్యం ఉన్న వ్యక్తులు, మన పార్టీ అంటే సానుభూతి ఉన్న వారితో కూడా నిర్మించవచ్చు. వారు సమస్యలు పరిష్కరించడానికి సూచనలు చేస్తారు; ప్రచార సరంజామా కూడా

తయారు చేస్తారు. మన పార్టీ పట్టణ సంబంధిత  విషయాలు పరిశీలించే కమిటీ, వీరి పనికి సలహాలు సూచనలు ఇవ్వాలి.

పార్టీలో అనేక మంది వ్యక్తులు, నిపుణులు, పరిశోధకులు ఉన్నారు; వారు పట్టణ సమస్యపై పరిశోధనలు చేస్తున్నారు. ప్రభుత్వేతర సంస్థలు, అనేక మంది వ్యక్తులు, సాధారణ లేదా ప్రత్యేకమైన వేదికలలో  కూడా చురుకుగా ఈ పని చేస్తున్నారు. వాటిలో కొన్నిటితో మనం సహకరించి వారి నైపుణ్యతను కూడా మన పనికి ఉపయోగించుకోవచ్చు.

పట్టణ స్థాయిలో మధ్యతరగతిలో పని చేయడం అత్యంత కీలకం. ఇందుకోసం, పౌరుల వేదికలు, సాంస్కృతిక వేదికలు తయారు చేసుకోవాలి. ఇందులో మధ్య తరగతికి, ప్రధానంగా యువతకి  సంబంధించిన సమస్యలపై చర్చలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతుండాలి. వారు సామాజిక మాధ్యమాలతో ఎక్కువగా  ప్రభావితం అవుతుంటారు కాబట్టి, వారిని మతతత్వ శక్తులు సామాజిక మాధ్యమాలలో చేసే సైద్ధాంతిక చర్చలకు వ్యతిరేకంగా స్పందించే విధంగా తయారు చేయాలి. మనం బార్, మెడికల్, అకడమిక్ రీసెర్చ్ అసోసియేషన్స్‌తో కలిసి పనిచేయాలి. ఐ.టి. రంగంలో మనం యువకులను లక్ష్యంగా చేసుకుని పనిచేసి, వారి ద్వారా ఆయా వేదికలకి సంబంధించిన సమస్యలను తీసుకోవాలి. మనం పన్ను చెల్లింపుదారులు సంఘాలకు సంబంధించిన, ఇతర ఇటువంటి సంఘాలకు సంబంధించిన సమస్యలను కూడా తీసుకోవాలి.

పట్టణాలలో మన మధ్య వయోజనులు, పదవి విరమణ చేసిన వారు పెరుగుతున్నారు. వారు అనేక రకాల ఆరోగ్య సమస్యలు, ముసలితనానికి సంబంధించిన సమస్యలతో సతమతమవుతుంటారు. మనం పెన్షనర్లు సంఘాలలో ఆరోగ్యాలపై శ్రద్ధ పెట్టడానికి, ఓల్డ్ ఏజ్ హోమ్‌ల గురించి వయోజనులకు ఆహ్లాదం కలిగించే అంశాలను గురించి పనిచేయాలి.

**స్థానిక స్థాయి**

పట్టణాలలో, నగరాలలో ప్రాథమిక స్థాయిలో స్థానిక పరిపాలన యూనిట్, ఒక వార్డ్ లేదా డివిజన్.

పథకాల ప్రయోజనాలు గుర్తించడం, అభివృద్ధి కార్యక్రమాలు అమలు జరపడం, వాటి నిర్వహణ బాధ్యత తీసుకోవడం, వార్డులో ఉన్న మునిసిపల్ ఉద్యోగుల సహాయంతో పనులు జరిగేటట్టు చూడడం చేయాలి. స్థానిక ప్రజల ఆర్థిక,

సామాజిక, సాంస్కృతిక, రాజకీయ జీవితాలను తెలుసుకోవాలి. ఆ విధంగానే స్థానికంగా ఉండే ప్రజలను ఆయా ప్రాంతాలలో సంఘటితం చేయడానికి వీలవుతుంది. ఇదే అత్యంత కీలకం. వీటి ద్వారానే ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్న స్థానిక ప్రజలు అక్కడ ప్రాధాన్యత పొందుతారు.

ఇందుకోసం మనం స్థానిక నివాస ప్రాంత సంఘాలలో చురుకుగా పనిచేయాలి. మనం కూడా మన బస్తీ లేదా స్థానిక సంఘాలను ఏర్పాటు చేసుకోవాలి. దీని ద్వారా పట్టణ నివాస ప్రాంతాలలో పని చేయాలి. ఇది నివాస ప్రాంతాలలో అసంఘటిత కార్మికులను సంఘటితం చేయడానికి పనికి వస్తుంది.

మధ్యతరగతి అపార్టుమెంట్లలో, కాలనీలలో, ఆయా సంఘాలలో ఉన్న మన సభ్యుల ద్వారా, సానుభూతిపరుల ద్వారా పనులు చేయించాలి. లేదా అవసరమైతే చొరవ తీసుకుని కొత్త సంఘాలు ఏర్పాటు చేసుకోవాలి.

ఎప్పుడయినా అవకాశాలు వస్తే లేదా అవసరాలు ఏర్పడితే, విశాల ఐక్యతల, పరిచయాల మేరకు సంఘటితం చేయాలి; మనం విస్తృతంగా, అన్ని తరగతులతోనూ పరిచయాలు చేసుకోవాలి. గ్రంధాలయాలు ఏర్పాటుచేయాలి; రీడింగ్ రూమ్స్ తెరవాలి; ఆరోగ్య చెక్ అప్ కేంద్రాలు, వాకర్స్ క్లబ్బులు, న్యాయ సలహా కేంద్రాలు, ట్యూషన్ కేంద్రాలు, రక్తదాన కేంద్రాలు, ప్రజాపంపిణీ వ్యవస్థ పర్యవేక్షక కమిటీలు, నైపుణ్యం పెంచే కేంద్రాలు, సాంస్కృతిక సమూహాలు, బందులు, తాగుడు నిరోధించే కమిటీలు, శరీరం, రక్తం దానం చేసే సమూహాలు, స్వయం సహాయక బృందాలు, జిమ్, యోగా సమూహాలు – ఈ సేవలన్నీ నివాస ప్రాంతాలలో మౌలిక స్థాయిలో ఏర్పడాలి; ప్రజలతో నిత్య సంబంధాలు కలిగి ఉండడానికి, పరిచయాలు పెరగడానికి దోహదపడతాయి. ఆ పరిచయాలే రాజకీయ కార్యకలాపాలకు మెరుగుపరచుకోవడానికి ఉపయోగపడతాయి.

## V

### పట్టణ పని నిర్మాణం

స్థానికంగా బహుముఖ కార్యకలాపాలు చేయడానికి బహుముఖ సంస్థలు వివిధ రూపాలలో ఉండాలి; వీటన్నిటి మధ్య సమన్వయం కూడా ఉండాలి.

కార్మిక సంఘాలకు, మధ్యతరగతి ఉద్యోగ సంఘాలకు నివాస ప్రాంతాల్లో చేసే పనిలో ప్రమేయం ఉండేటట్టు చూడాలి.

అసంఘటిత కార్మికులలో కొందరిని స్థానికంగా పనిచేసేందుకు వినియోగించాలి. కార్మిక సంఘాలతో పాటుగా, ఉద్యోగ సంఘాలు, మహిళా, యువజన సంఘాలు ముందుండి, పనిలో భాగస్వాములు కావాలి. ఇప్పటికే మన మహిళా, యువజన సంఘాలకు , స్థానికంగా నిర్మాణం ఉంటుంది గాబట్టి , స్థానిక సమస్యలను, తమ పనిలో భాగంగా తీసుకుంటున్నాయి. నివాస ప్రాంతాలలో ఉండే వాటి ప్రాధమిక యూనిట్లు, క్రియాశీలంగా ఆందోళన కార్యక్రమాలలో భాగస్వాములు కావాలి; వీటితో పాటుగా తమ సంఘ కార్యక్రమాలు కూడా నిర్వహించుకోవాలి.

పరిమితమైన వనరులను వినియోగించుకోడంలో నష్టం జరగకుండా కాపాడుకోడానికి. పునాది స్థాయిలో జరుగుతున్న ఈ పనిని పార్టీ సంధానం చేసి, ఒకే పని ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువమంది చేయకుండా ఉండే విధంగా జాగ్రత్త పడాలి.

పట్టణ ప్రాంతాలలో పనిచేసే సంఘాలు పార్టీ ఆఫీస్‌లో సమావేశాలు వేసుకోకూడదు. అందుకు అనువైన ప్రదేశాన్ని చూసుకోవాలి. వీలైనంతవరకు స్థానికంగా ఉండే అనువైన స్థలంలో సమావేశమవ్వాలి. అక్కడ వీలుకాకపోతే ఎవరైనా తెలిసిన వాళ్ళకి చెందిన ప్రదేశంలో సమావేశమవ్వాలి. స్థానికంగా ఉన్న కమ్యూనిటీ కేంద్రాలు ఈ సమావేశాలకు వాడుకోవచ్చు.

## పార్టీ పాత్ర

పార్టీ నగర, పట్టణ కమిటీలు ఈ ప్రజాసంఘాల నిర్మాణానికి ముందుండి ప్రణాళికలు రచిస్తాయి. నివాస ప్రాంతాలలో ప్రజాసంఘాలు నిర్మాణాన్ని చేపడతాయి. ఆ ప్రాంతంలోని ప్రజా సమస్యలను గుర్తిస్తాయి. అక్కడున్న అనేక వేదికల ఆధ్వర్యంలో నివాస ప్రాంతాలలో ఉన్న సమస్యలను చేపడతాయి.

ఆ ప్రాంతంలో ఉన్న పార్టీ శాఖలు అక్కడి ప్రజా సంఘాలకు బాధ్యత వహించాలి. మనం స్థానికంగా వైవిధ్యభరితమైన కార్యాచరణాలు చేపట్టడానికి వీలైనట్టు వారిని సంసిద్ధులని చేయాలి. వారు ప్రజల సమస్యలను గుర్తించి, సంబంధిత వేదికల ద్వారా పనిచేయించే బాధ్యత తీసుకోవాలి. ఇందుకోసం ప్రాంతీయ పార్టీ కార్యదర్శుల స్థానిక వర్క్‌షాప్స్ నిర్వహించి, నివాసిత ప్రాంతాలలో పనిచేయడానికి పార్టీ అవగాహన ఏమిటో వివరించాలి; స్థానికంగా చేయాల్సిన పనిని ప్రణాళికాబద్ధం చేయాలి. ప్రతి పార్టీ సభ్యునికి ప్రత్యేకమైన బాధ్యతనివ్వాలి. ఉద్యోగాలు చేస్తూ పార్టీ శాఖలను స్థానిక

శాఖలతో అనుసంధానం చేయాలి. వారి సేవలను ఎంతవరకు వీలైతే అంతవరకూ స్థానిక పనికి వినియోగించుకోవాలి.

పార్టీ జండా కింద స్థానిక పని జరగాలనే అభిప్రాయం పార్టీ స్థానిక శాఖలలో ఉంది. అందువలనే పార్టీ స్థానిక కమిటీలు, పార్టీ స్థానిక శాఖలు స్థానిక పనిని ప్రజా సంఘాల ద్వారా చేయించడానికి ఇష్టపడడం లేదు. ఇప్పటికే పనిలో ఉన్న సంక్షేమ సంఘాలతో కలిసి పనులు చేసి, ఉమ్మడి కార్యాచరణను పెంపొందించుకోడానికి ఇష్టపడడం లేదు. ఈ ధోరణిని మార్చుకోవాలి. ప్రజాసంఘాలతో కలిసి స్థానికంగా పని చేయడానికి సంసిద్ధులు కావాలి.

స్థానికంగా మన కార్యక్రమాలు అమలు ద్వారా వచ్చిన సరికొత్త పరిచయాలను (ఆందోళన, పోరాటాలు, సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు) ఏంతో ఓర్పుతో ఆగ్జిలరీ యూనిట్ల ద్వారా ఎడ్యుకేట్ చేసి స్థానిక కమిటీలు కొత్త ప్రాంతాలకి, తరగతులకు విస్తరించేటట్టు చూడాలి.

రాష్ట్ర స్థాయిలో పట్టణ విషయాలు పరిశీలించే కమిటీలు వేయాలి. కార్మిక సంఘం, మహిళా సంఘం, యువజన సంఘంల ఫ్యాక్షన్‌ల నుండి సభ్యులను ఇందులో నియమించాలి. కొన్ని నగరాలలో కార్యక్రమాలు మొదలైనప్పటికీ రాష్ట్రాలు ఇప్పటికి కమిటీలు వేయలేదు.

***